Pubilshed from Visakapatnam

PRGI NO : APTEL/25/1888

ప్రజాభూమి

ఇది ప్రజల వెలుగు

Prajabhoomi Telugu Daily

www.prajabhoomi.com



విశాఖపట్నం VISAKAPATNAM | సంపుటి : 02 | సంచిక : 13 | శుక్రవారం | నవంబర్ 20, 2026 | ఎడిటర్ : రామమోహన్ రెడ్డి అంకిరెడ్డిపల్లి | పేజీలు : 12 | వెల : 3 రూ

Vol.No : 02 | Issue No : 13 | Friday | 20 November 2026 | Editor : Ankireddypalle Ramamohan Reddy | Pages 12 | Rs 3/-

Published From : Vijayawada, Anathapuramu, Eluru, Kadapa, Kakiknada, Tirupathi Circulated at Andharapradesh & Telangana



టాక్స్ తగ్గించాం..
మరి జీతాలు పెంచారా?

» భారత పారిశ్రామికవేత్తలకు ప్రధాని మోదీ సూటి ప్రశ్న!

ఫిక్కీ: ఫిక్కీ సదస్సులో పారిశ్రామిక దిగ్గజాలను ప్రశ్నించిన ప్రధాని మోదీ సంస్కరణల ద్వారా ఎన్ని ఉద్యోగాలు సృష్టించారో చూపాలని సూచన ఉద్యోగుల వేతనాలను ఎంత పెంచారో పరిశ్రమలు నిరూపించుకోవా లని వెల్లడి దేశీయ వినియో గదారులకు అంతర్జాతీయ స్థాయి నాణ్యత ఇవ్వాలని ఆదేశం ఫార్మా ఏపీఐలు, స్టీల్ దిగుమ తులపై ఆధారపడటం తగ్గించాలని పిలుపు కార్పొరేట్ పన్నుల తగ్గింపు,


⏭ వివరాలు 2లో..

మూడు ప్రాంతాల ఆర్థిక ప్రణాళికలే

రాష్ట్రాభివృద్ధికి బ్లూ ప్రింట్

భారీ ప్రాజెక్టులకు ఎంఎస్ఎంఈల అనుసంధానం

» ప్రతి పారిశ్రామిక క్లస్టర్‌కూ ఎకోసిస్టమ్ అభివృద్ధి చేయాలి » పారిశ్రామిక అవసరాలకు ల్యాండ్ బ్యాంక్... అవసరమైతే నూతన పాలసీ- సైబరాబాద్ తరహాలో వైజాగ్ బే-టెక్ సిటీ » సూర్యలంక, గండికోటలకు టూరిజం మాస్టర్ ప్లాన్ » విశాఖ, తిరుపతి, అమరావతి ఎకనామిక్ రీజియన్లపై ముఖ్యమంత్రి సమీక్ష » రాష్ట్ర సమగ్రాభివృద్ధిపై అధికారులకు సీఎం చంద్రబాబు దిశా నిర్దేశం



ప్రజాభూమి ప్రతినిధి,అమరావతి:

రాష్ట్ర సమగ్రాభివృద్ధికి రూపొందించిన విశాఖపట్నం, అమరావతి, తిరుపతి ఆర్థిక ప్రాంతాల ప్రణాళికలు అభివృద్ధికి బ్లూప్రింట్ వంటివని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. మూడు ఆర్థిక ప్రాంతాలపై అధికారులు రూపొందించిన ప్రణాళికలపై ముఖ్యమంత్రి ఒకేసారి సమీక్ష నిర్వహించారు. గురువారం క్యాంప్ కార్యాలయంలో జరిగిన ఈ సమీక్షలో రాష్ట్ర సమగ్రాభివృద్ధిపై అధికారులకు ముఖ్యమంత్రి దిశా నిర్దేశం చేశారు. ఈ మూడు ప్రాంతాలను సమగ్రంగా అభివృద్ధి చేయడంతో పాటు, ఇప్పటివరకు గుర్తించిన పెట్టుబడులను వాస్తవరూపంలోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ప్రణాళికల్లో ఎక్కడైనా లోటుపాట్లు ఉంటే గుర్తించి భర్తీ చేయాలని, వివిధ శాఖలు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. పరిశ్రమలు రావడం, పెట్టుబడులు పెట్టడం మాత్రమే అభివృద్ధి కాదని.. వాటి ద్వారా రాష్ట్ర ప్రజల ఆదాయాలు పెరగాలని, జీవన ప్రమాణాలు మెరుగుపడాలని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ప్రజలకు పెద్ద ఎత్తున ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించి తలసరి ఆదాయాన్ని పెంచడమే ప్రభుత్వ లక్ష్యమని... దానికి అనుగుణంగా అధికార యంత్రాంగం పని చేయాలన్నారు.

⏭ వివరాలు 2లో..



సమగ్ర స్టేటస్ రిపోర్ట్ ఇవ్వండి

జగన్ ఆస్తుల కేసుల ప్రస్తుత పరిస్థితిపై తెలంగాణ హైకోర్టు

ప్రజాభూమి ప్రతినిధి అమరావతి : జగన్ అక్రమాస్తుల కేసుల విచారణను వేగవంతం చేయాలంటూ దాఖలైన పలు పిటిషన్లపై గురువారం తెలంగాణ హైకోర్టులో విచారణ జరిగింది. కేసుల ప్రస్తుత పరిస్థితిపై పూర్తి స్థాయి స్టేటస్ రిపోర్టును సమర్పించాలని తెలంగాణ హైకోర్టు ఆదేశించింది. ఈ కేసుల విచారణ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని కోరుతూ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ)తో పాటు మాజీ ఎంపీ హరిరామజోగయ్య వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. విచారణ సందర్భంగా ఈడీ తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ...

ఈ వ్యవహారంలో దర్యాప్తు, న్యాయ ప్రక్రియ దాదాపు 15 ఏళ్లుగా కొనసాగుతున్నట్లు పేర్కొన్నారు. సీబీఐ కోర్టు పరిధిలో ఉన్న వివిధ కేసుల్లో ఇప్పటివరకు దాదాపు 150కి పైగా డిశ్చార్జ్ పిటిషన్లు దాఖలయ్యాయని, దీనివల్ల విచారణలో జాప్యం జరుగుతోందని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఈ కేసులకు సంబంధించి సీబీఐ 11 ఛార్జిషీట్లు, ఈడీ 9 ప్రాసిక్యూషన్ ఫిర్యాదులు దాఖలు చేశాయి.

2 లో..

అభివృద్ధి విషయంలో రాజకీయాలకు

తావు లేదు

2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థే తెలంగాణ లక్ష్యం

» మంచి రహదారులు లేని దేశం అభివృద్ధి చెందదు

» ఇండియన్ రోడ్స్ కాంగ్రెస్ 85వ సదస్సులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

ప్రజాభూమి ప్రతినిధి,హైదరాబాద్:

2047 మన దేశానికి ఎంతో ప్రాధాన్యం ఉన్న సంవత్సరం.. మనం స్వాతంత్ర్యం సాధించి నాటికి వందేళ్లు అవుతుంది. జాతీయ ప్రయోజనాలు, దేశ భద్రత, మౌలిక సదుపాయాలు, ప్రజా సంక్షేమం విషయంలో రాజకీయాలకు తావులేదు. ఎన్నికల సమయంలోనే రాజకీయాలు, మిగిలిన సమయంలో దేశాభివృద్ధిపైనే దృష్టి సారిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం మద్దతుగా నిలవాలని ముఖ్యమంత్రి కోరారు. నిర్దేశించిన లక్ష్యాల సాధనలో దేశం ప్రగతి సాధించడానికి తనవంతు కర్తవ్యంగా తెలంగాణ కూడా తోడ్పాటును అందిస్తుందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.



2 లో..



100ఏళ్లు మన్నిక అన్నారు.. 10 ఏళ్లకే కూలింది..

» పంజాబ్‌లో కుప్పకూలిన ఇనుప వంతెన

» వంతెనపై వేలాడుతున్న రెండు ట్రక్కులు

పంజాబ్: పంజాబ్‌లోని పటియాలాలో భారీ ప్రమాదం చోటుచేసుకుంది. భాక్రా కాలువపై నిర్మించిన ఇనుప వంతెన ఈ ఉదయం అకస్మాత్తుగా కూలిపోయింది. ప్రమాదం జరిగిన సమయంలో రెండు ట్రక్కులు వంతెనపై ప్రయాణిస్తుండటంతో అవి కూలిపోయిన వంతెనపై చిక్కుకుపోయాయి.

- మిగతా 2లో..

మూడో విడత గ్రామ పంచాయతీ

ఎన్నికలకు నోటిఫికేషన్ జారీ



ఈ నెల 21 నుంచి 23వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ

» నవంబర్ 24న నామినేషన్ల పరిశీలన » నవంబర్ 27న మధ్యాహ్నం 3 గంటల వరకు ఉపసంహరణకు అవకాశం » డిసెంబర్ 2న అవసరమైన చోట్ల పోలింగ్, అదే రోజు ఓట్ల లెక్కింపు » ఫలితాలు ప్రకటించిన రోజే ఉపసర్పంచ్ ఎన్నిక » రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా

ప్రజాభూమి ప్రతినిధి,
విజయవాడ : రాష్ట్రంలో రెండో సాధారణ గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణలో భాగంగా మూడో విడత ఎన్నికలకు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా గురువారం నోటిఫికేషన్ జారీ చేశారు. మూడో విడత గ్రామ పంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్‌ను రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా విడుదల చేశారు. ఈ విడతలో రాష్ట్రంలోని 25 జిల్లాలకు చెందిన వివిధ రెవెన్యూ డివిజన్ల పరిధిలోని మండలాల్లో గ్రామ పంచాయతీ సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలు నిర్వహించనున్నారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకారం నవంబర్ 21వ తేదీన సంబంధిత రిటర్నింగ్ అధికారులు ఎన్నికల నోటీసులు జారీ చేసి, అదే రోజు ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్లను స్వీకరిస్తారు. నవంబర్ 23వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్ల స్వీకరణ కొనసాగుతుంది. నవంబర్ 24వ తేదీన ఉదయం 8 గంటల నుంచి నామినేషన్ల పరిశీలన నిర్వహిస్తారు. నవంబర్ 25వ తేదీన నామినేషన్ల తిరస్కరణపై అప్పీళ్లను స్వీకరిస్తారు. నవంబర్ 26వ తేదీన అప్పీళ్ల పరిష్కారం ఉంటుంది. నవంబర్ 27వ తేదీ మధ్యాహ్నం 3 గంటల వరకు అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకోవచ్చు.

2 లో..

ప్రభుత్వ బోధనాసుపత్రుల్లో రోబోటిక్ శస్త్రచికిత్సల

దిశగా అడుగులు

» తొలుత విజయవాడ బోధనాసుపత్రిలో రూ.45 కోట్లతో రోబోటిక్ కేంద్రం ఏర్పాటు » ఐవీఎఫ్, బోన్ మేరో ట్రాన్స్‌ప్లాంట్ కేంద్రాలు. ఇతర సౌకర్యాల కల్పనకు » రూ.1,011 కోట్ల అంచనా వ్యయంతో ప్రతిపాదనలు » సమీక్షా సమావేశంలో చర్చించిన వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ » రోగుల అవసరాలకు తగ్గట్టు పూర్తి స్థాయి వెంటిలేటర్ల సదుపాయాన్ని కల్పించాలన్న మంత్రి



ప్రజాభూమి ప్రతినిధి అమరావతి :

అత్యంత ఆధునిక వైద్య సేవలను ప్రభుత్వ బోధనాసుపత్రుల్లో అందుబాటులోకి తెచ్చేందుకు వైద్యారోగ్య శాఖ పరిశీలిస్తోంది. ముఖ్యంగా కొత్తగా ఐవిఎఫ్ సెంటర్లు, బోన్ మేరో ట్రాన్స్‌ప్లాంట్ కేంద్రాలు, ఇతర అధునిక వైద్య సేవలను విస్తృతం చేసేందుకు రూ. 1,011 కోట్ల అంచనా వ్యయంతో ప్రతిపాదనలు సిద్ధం చేసింది. ఇందులో ముఖ్యంగా రోబోటిక్ శస్త్రచికిత్సలను బోధనాసుపత్రుల్లో దశలవారీగా ప్రవేశ పెట్టాలని యోచిస్తోంది.

- మిగతా 2లో..

నేడు జడ్పీ కొలువు !

» జిల్లాల పునర్విభజనతో రెండు జిల్లాలకు ఇద్దరు చైర్మన్లు » ఏలూరుకు రాణి..

» పశ్చిమగోదావరికి రాజు? » కూటమిలోనే పోటీ.. » అధిష్ఠానం నిర్ణయంపై ఉత్కంఠ !



సతీమణిని

ప్రజాభూమి రీజనల్ బ్యూరో, ఉమ్మడిపశ్చిమగోదావరి :

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిషత్‌కు సుదీర్ఘ రాజకీయ చరిత్ర ఉంది. దాదాపు 90 ఏళ్ల ప్రస్థానంలో 23 ఏళ్లపాటు జిల్లా బోర్డుగా, 67 ఏళ్లపాటు జిల్లా పరిషత్‌గా కొనసాగిన ఈ సంస్థ ఎందరో రాజకీయ ఉద్ధండులకు నాయకత్వ వేదికగా నిలిచింది. అయితే రాష్ట్రంలో జరిగిన జిల్లాల పునర్విభజనతో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిషత్ చరిత్రలో కొత్త అధ్యాయం ప్రారంభం కానుంది. ఒకప్పుడు ఒకే జిల్లా పరిషత్‌గా కొనసాగిన ఈ సంస్థ ఇప్పుడు మూడు జిల్లాలకు విస్తరించి, రెండు ప్రత్యేక జిల్లా పరిషత్‌లుగా రూపాంతరం చెందింది. ఏలూరు జిల్లాలో 27 మంది జడ్పీటీసీ సభ్యులతో, పశ్చిమగోదావరి జిల్లాలో 20 మంది జడ్పీటీసీ సభ్యులతో నూతన పాలకవర్గాలు తొలిసారిగా కొలువుదీరనున్నాయి. ఉమ్మడి జిల్లా పరిధిలోని కొన్ని జడ్పీటీసీ స్థానాలు తూర్పుగోదావరి జిల్లాలో కలిశాయి.

ఈ నేపథ్యంలో శుక్రవారం (నవంబర్ 20) జరగనున్న జడ్పీ చైర్మన్ల ఎన్నికలు రాజకీయంగా ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. రెండు జిల్లాల్లోనూ అధికార కూటమి పార్టీలకు చెందిన నేతల మధ్యే ప్రధాన పోటీ నెలకొనడం విశేషం. ప్రతిపక్ష పాత్రను సైతం కూటమిలోని ఆశావహులే పోషిస్తున్న పరిస్థితి కనిపిస్తోంది. ఎవరికి జడ్పీ పీఠం దక్కుతుందన్నది ఇప్పుడు రాజకీయ వర్గాల్లో హాట్‌టాపిక్‌గా మారింది.

ఏలూరు జడ్పీ పీఠంపై నవ్యశ్రీ ఆశలు!

ఏలూరు జిల్లా పరిషత్ చైర్మన్ పదవి కోసం తెలుగుదేశం పార్టీలో అంతర్గత పోటీ ఆసక్తికరంగా మారింది. తొలుత మాజీ మంత్రి మాగంటి వెంకటేశ్వరరావు (బాబు) తన జడ్పీ చైర్మన్ రేసులోకి తీసుకురావాలని ప్రయత్నించినప్పటికీ ఆ ప్రయత్నం ఫలించలేదు. దీంతో జిల్లాకు చెందిన మరో ఇద్దరు టీడీపీ నేతలు తమ కుమార్తెలను రాజకీయ రంగంలోకి దించి జడ్పీ పీఠం కోసం ప్రయత్నాలు ముమ్మరం చేశారు.

2 లో..

ప్రజాభూమి
శుక్రవారం, నవంబర్ 20, 2026

సమగ్ర స్టేటస్ రిపోర్ట్ ఇవ్వండి

మరోవైపు, సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన మార్గదర్శకాల ప్రకారం ఈ కేసులపై రోజువారీ విచారణ చేపట్టాలని హరిరామజోగయ్య తరఫు న్యాయవాది కోర్టుకు విన్నవించారు. వాదనలు విన్న తెలంగాణ హైకోర్టు... జగన్ కేసుల ప్రస్తుత స్థితిగతులపై సమగ్ర వివరాలతో స్టేటస్ రిపోర్టు అందించాలని స్పష్టం చేసింది. తదుపరి విచారణను నవంబర్ 30కి వాయిదా వేసింది.

మూడో విడత గ్రామ పంచాయతీ ఎన్నికలకు నోటిఫికేషన్ జారీ

అదే రోజు మధ్యాహ్నం 3 గంటల తర్వాత పోటీలో ఉన్న అభ్యర్థుల తుది జాబితాను ప్రకటిస్తారు.
ఎన్నికలు అవసరమైన గ్రామ పంచాయతీల్లో డిసెంబర్ 2వ తేదీన ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్ నిర్వహిస్తారు. అదే రోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు చేపట్టి, లెక్కింపు పూర్తయిన వెంటనే ఫలితాలను ప్రకటిస్తారు.సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికల ఫలితాలు ప్రకటించిన రోజే ఉపసర్పంచ్ ఎన్నికను కూడా నిర్వహిస్తారు. ఏదైనా కారణంతో ఆ రోజు ఉపసర్పంచ్ ఎన్నిక నిర్వహించడం సాధ్యం కాకపోతే, మరుసటి రోజు ఎన్నిక నిర్వహిస్తారు.రీపోలింగ్ అవసరమైన సందర్భాల్లో డిసెంబర్ 3వ తేదీన ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్ నిర్వహించి, అదే రోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలను ప్రకటిస్తారు. రీపోలింగ్ నిర్వహించిన గ్రామ పంచాయతీల్లో ఉపసర్పంచ్ ఎన్నికను రీపోలింగ్ ఫలితాలు ప్రకటించిన తర్వాతే నిర్వహిస్తారు.మూడో విడత ఎన్నికలు జరిగే మండలాల వివరాలను నోటిఫికేషన్‌కు జతచేసిన అనుబంధం-×× లో పొందుపరిచినట్లు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేతా తెలిపారు.

100ఏళ్లు మన్నిక అన్నారు..
10 ఏళ్లకే కూలింది..

ప్రస్తుతం రెండు ట్రక్కులు వంతెన శిథిలాలపై వేలాడుతున్నట్లు సమాచారం. ఈ వంతెనను నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా 2016లో నిర్మించినట్లు తెలుస్తోంది. వంతెనకు సుమారు 100 ఏళ్ల మన్నిక ఉంటుందని గతంలో పేర్కొన్నప్పటికీ, నిర్మించిన పదేళ్లు కూడా పూర్తికాకముందే కూలిపోవడం చర్చనీయాంశంగా మారింది. వంతెన కూలిపోవడానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదు. ప్రమాద సమయంలో ట్రక్కుల్లో ఉన్నవారి పరిస్థితిపై పూర్తి సమాచారం అందాల్సి ఉంది. ఘటనపై అధికారులు విచారణ చేపట్టాల్సి ఉంది. వంతెన నిర్మాణ నాణ్యత, నిర్వహణపై కూడా ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

నేడు జడ్పీ కొలువు!

దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ తన కుమార్తె సాయి నవ్యశ్రీని పెదవేగి జడ్పీటీసీ స్థానానికి పోటీ చేయించి ఏకగ్రీవంగా గెలిపించుకున్నారు. మరోవైపు టీడీపీ నేత గంట మురళి తన కుమార్తె మందలపు జాహ్నవిని జడ్పీటీసీ ఎన్నికల బరిలో నిలిపి విజయం సాధించారు. దీంతో ఇద్దరూ జడ్పీ చైర్మన్ పదవికి ఆశావహులుగా మారారు. ఇక్కడ గమనించాల్సిన మరో ఆసక్తికరమైన అంశం ఏమిటంటే.. ఈ ఇద్దరు ఆశావహులు ఒకే పార్టీకి చెందినవారు కావడమే కాకుండా ఒకే సామాజికవర్గానికి చెందినవారు కావడం. దీంతో సామాజిక సమీకరణాల కంటే రాజకీయ బలాబలాలు, పార్టీ పట్ల విధేయత, ఎమ్మెల్యేలు, ముఖ్య నేతల మద్దతు వంటి అంశాలే కీలకంగా మారనున్నాయి.
అయితే సాయి నవ్యశ్రీకే జడ్పీ చైర్మన్ పదవి దక్కే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్న ప్రచారం రాజకీయ వర్గాల్లో బలంగా వినిపిస్తోంది. జిల్లాలో జడ్పీటీసీ అభ్యర్థుల విజయానికి చింతమనేని ప్రభాకర్ పూర్తి స్థాయిలో సహాయ సహకారాలు అందించిన నేపథ్యంలో, ఆయన కుమార్తెకు అవకాశం కల్పించాలనే అభిప్రాయానికి పార్టీ అధిష్ఠానం సానుకూలంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో నవ్యశ్రీ పేరుకు గ్రీన్‌సిగ్నల్ లభించే అవకాశాలున్నాయన్న అంచనాలు వ్యక్తమవుతున్నాయి.
అయితే గురువారం రాత్రి వరకు పార్టీ నుంచి అధికారిక ప్రకటన వెలువడకపోవడంతో చివరి నిమిషంలో ఏదైనా మార్పు చోటుచేసుకుంటుందా? అధిష్ఠానం ఎవరికి అవకాశం కల్పిస్తుంది? అన్న ఉత్కంఠ కొనసాగుతోంది.
పశ్చిమగోదావరిలో ఇద్దరు రాజుల మధ్య పోరు! : ఇక పశ్చిమగోదావరి జిల్లా పరిషత్ చైర్మన్ ఎన్నిక మరో ఆసక్తికర రాజకీయ పోరుకు వేదికగా మారింది. ఇక్కడ జనసేన, తెలుగుదేశం పార్టీలకు చెందిన ఇద్దరు నేతలు జడ్పీ పీఠం కోసం పోటీపడుతున్నారు.
జనసేన పార్టీ తరఫున పీవీఎల్ నరసింహారాజు చైర్మన్ పదవిని ఆశిస్తుండగా, తెలుగుదేశం పార్టీ తరఫున పాతుకూరి రామ రాజు గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు. గతం నుంచి పార్టీకి విధేయుడిగా ఉంటూ పనిచేస్తున్నందున తనకు జడ్పీ చైర్మన్ పదవి ఇవ్వాలని ఇందుకూరి రామకృష్ణంరాజు పట్టుబడుతున్నట్లు రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. మరోవైపు పీవీఎల్ నరసింహారాజు ఇటీవలే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి జనసేనలో చేరడం ఈ పోటీలో మరో కీలక అంశంగా మారింది. నిన్నమొన్నటి వరకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో కొనసాగిన నేతకు ఇంతటి కీలకమైన పదవిని అప్పగించేందుకు కూటమి నాయకత్వం ఎంతవరకు సుముఖత వ్యక్తం చేస్తుందన్నది చర్చనీయాంశంగా ఉంది. దీంతో పార్టీ పట్ల దీర్ఘకాల విధేయతకు ప్రాధాన్యత ఇస్తారా? లేక ప్రస్తుత రాజకీయ సమీకరణాలు, సామాజిక బలాబలాలను పరిగణనలోకి తీసుకుని నిర్ణయం తీసుకుంటారా? అన్నది ఆసక్తికరంగా మారింది.ఇక్కడ మరో విశేషం ఏమిటంటే.. జడ్పీ చైర్మన్ పదవిని ఆశిస్తున్న పీవీఎల్ నరసింహారాజు, పాతుకూరి రామరాజు ఇద్దరూ క్షత్రియ సామాజికవర్గానికి చెందినవారే. దీంతో ఇద్దరు రాజుల్లో జడ్పీ పీఠాన్ని అధిరోహించే రాజు ఎవరు? అన్న చర్చ జిల్లావ్యాప్తంగా సాగుతోంది.
అధిష్ఠానం నిర్ణయమే కీలకం! : రెండు జిల్లాల్లోనూ అధికార కూటమికి చెందిన నాయకుల మధ్యే పోటీ నెలకొనడంతో ఈ ఎన్నికలు కూటమి అంతర్గత రాజకీయ సమన్వయానికి పరీక్షగా మారాయి. ఎమ్మెల్యేల ప్రాధాన్యత, పార్టీ పట్ల విధేయత, స్థానిక రాజకీయ పలుకుబడి, సామాజిక సమీకరణాలు, భవిష్యత్ రాజకీయ ప్రయోజనాలు వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని అధిష్ఠానాలు నిర్ణయం తీసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. 90 ఏళ్ల చరిత్ర కలిగిన ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిషత్ విభజన అనంతరం రెండు కొత్త జిల్లా పరిషత్‌లు తొలి పాలకవర్గాలతో కొలువుదీరుతున్న తరుణంలో ఈ ఎన్నికలకు ప్రత్యేక ప్రాధాన్యత ఏర్పడింది.
ఏలూరు జడ్పీ పీఠంపై నవ్యశ్రీ పేరు బలంగా వినిపిస్తుండగా, పశ్చిమగోదావరి జడ్పీ పీఠం కోసం ఇద్దరు రాజుల మధ్య పోటీ ఉత్కంఠను రేపుతోంది. చివరి నిమిషంలో అధిష్ఠానం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుంది? ఆశావహుల్లో ఎవరిని అదృష్టం వరిస్తుంది? అన్నది మరికొద్ది గంటల్లో తేలనుంది.
మొత్తంగా.. ఏలూరుకు రాణి దక్కుతుందా? పశ్చిమగోదావరికి రాజు దక్కుతాడా? అన్న రాజకీయ ఉత్కంఠకు శుక్రవారం తెరపడనుంది!

అభివృద్ధి విషయంలో
రాజకీయాలకు తావు లేదు

హైదరాబాద్ హెచ్ఐసీసీలో గురువారం ప్రారంభమైన ఇండియన్ రోడ్స్ కాంగ్రెస్ (ఐఆర్‌సీ) 85వ వార్షిక సదస్సుకు ముఖ్య అతిథిగా సీఎం రేవంత్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ 2047 నాటికి దేశం 30 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదగాలన్న లక్ష్యానికి అనుగుణంగా తెలంగాణ తన వంతుగా 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా రూపొందాలని లక్ష్యంగా పెట్టుకున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. వికసిత్ భారత్ లక్ష్యానికి తగినట్లు తెలంగాణ రైజింగ్ విజన్‌తో ముందుకు సాగుతున్నామని, 2034 నాటికే 1 ట్రిలియన్ డాలర్ల స్థాయికి చేరుకుంటామని ధీమా వ్యక్తం చేశారు.
దేశ జనాభాలో 2.5 శాతం ఉన్న తెలంగాణ, జాతీయ జీడీపీలో 5 శాతం వాటా అందిస్తోందని, 2047 నాటికి దానిని 10 శాతానికి పెంచుతామని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్ర రోడ్ల అభివృద్ధికి సంబంధించి మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అందించిన ప్రతిపాదనలకు కేంద్రం సంపూర్ణ సహకారం అందించాలని జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీని సీఎం కోరారు. సంపన్న దేశాలు గొప్ప రహదారులను నిర్మించవని, గొప్ప రహదారులే దేశాలను ధనిక, అభివృద్ధి చెందిన దేశాలుగా మారుస్తాయని ముఖ్యమంత్రి అన్నారు. ఔటర్ రింగ్ రోడ్ (ఓఆర్ఆర్), ప్రతిపాదిత రీజినల్ రింగ్ రోడ్ (ఆర్ఆర్ఆర్) తమ విజన్‌కు నిదర్శనాలని చెప్పారు. ఆర్థిక ప్రగతి కోసం రాష్ట్రాన్ని మూడు జోన్లుగా విభజించామని, అందులో ఓఆర్ఆర్ లోపల ఉన్న 2,100 చదరపు కిలోమీటర్ల హైదరాబాద్ నగరాన్ని క్యూర్ (జఖ=ఙు)గా గుర్తించామని, అందులో సేవల రంగానికి (సర్వీసెస్) ప్రాధాన్యమిస్తామన్నారు. ఓఆర్ఆర్, ఆర్ఆర్ఆర్ మధ్య ప్యూర్ (ర్రాఖ=ఙు) ప్రాంతాన్ని దేశంలోనే అతిపెద్ద తయారీ కారిడార్‌గా తీర్చిదిద్దుతామన్నారు. చైనా ప్లస్ వన్ అనే వ్యూహానికి ఇది తాము చూపే జాతీయ పరిష్కారమని తెలిపారు. ఆర్ఆర్ఆర్ వెలుపలి నుంచి రాష్ట్ర సరిహద్దుల వరకు ఉన్న రేర్ (=ూ=ఙు) ప్రాంతాన్ని వ్యవసాయం, వ్యవసాయాధారిత పరిశ్రమల కోసం అభివృద్ధి చేస్తామని వివరించారు.
మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా రహదారులనే కాక ఇతర పనులను తమ రాష్ట్ర ఆర్ అండ్ బీ శాఖ చేపడుతోందని సీఎం వెల్లడించారు. వైద్య రంగాన్ని బలోపేతం చేసే క్రమంలో పందేళ్ల చరిత్ర కలిగిన ఉస్మానియా ఆసుపత్రి నూతన భవనం, నిమ్స్ విస్తరణ, టిమ్స్ (ఒఒమీ), వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల ద్వారా మొత్తం 8 వేల పడకలను ప్రజలకు అందుబాటులోకి తెస్తున్నట్లు తెలిపారు.
వచ్చే డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో భారత్ ఫ్యూచర్ సిటీలో ఆసియాలోనే అతిపెద్ద ఎక్స్‌పోగా లిఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-2026 నిర్వహించనున్నట్లు ముఖ్యమంత్రి చెప్పారు. ఆ సదస్సుకు పరిశ్రమల ప్రతినిధులు, నిపుణులు తరలిరావాలని సీఎం ఆహ్వానించారు.

మూడు ప్రాంతాల ఆర్థిక ప్రణాళికలే రాష్ట్రాభివృద్ధికి బ్లూ ప్రింట్

ప్రతి ప్రాంతానికి ఉన్న ప్రత్యేకతలు, వనరులు, అవకాశాలను వినియోగించుకుంటూ రూపొందించిన అభివృద్ధి ప్రణాళికలను ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ అవసరమైన మేరకు మార్పులు చేయాలని సూచించారు. మూడు రీజియన్లల్లో జరుగుతున్న అభివృద్ధి, పెట్టుబడులు, ప్రాజెక్టుల పురోగతిని ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు ప్రత్యేక డ్యాష్‌బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మూడు ప్రాంతాల అభివృద్ధికి రూపొందించిన ప్రణాళికల అమల్లో ప్రజా ప్రతినిధుల భాగస్వామ్యం కచ్చితంగా ఉండేలా చూడాలని సీఎం స్పష్టం చేశారు. ప్రణాళికల అమల్లో ఏమైనా ఇబ్బందులు తలెత్తితే... ఆ సమస్యల పరిష్కారానికి ప్రజా ప్రతినిధుల సహకారం కూడా తీసుకుని ప్రభుత్వం యంత్రాంగం పని చేయాలని సూచించారు. అలాగే ఈ ప్రాజెక్టుల అమలుకు సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియ చేయడంతోపాటు... వివిధ రూపాల్లో వారినీ భాగస్వాములను చేయాలని ముఖ్యమంత్రి నిర్దేశించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సిటీ ఎకనమిక్ రీజియన్ స్కీం కింద 60 ప్రాజెక్టులకు సంబంధించి రూ.9,180 కోట్లతో సిద్ధం చేసి ప్రతిపాదనలను కార్యరూపం దాల్చేలా చూడాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు.
పోర్టు ఆధారిత పరిశ్రమలతో అభివృద్ధి : విశాఖపట్నం ఎకనమిక్ రీజియనల్ ప్రణాళికలో భాగంగా యాంకర్ ప్రాజెక్టుగా అభివృద్ధి చేస్తున్న ప్రాంతానికి విశాఖ బే-టెక్ సిటీ అని పేరు పెట్టారు. వివిధ పేర్లను పరిశీలించిన అనంతరం సీఎం చంద్రబాబు విశాఖ బే-టెక్ సిటీ పేరును ఖరారు చేశారు. హైదరాబాద్ నగరంలో సైబరాబాద్ పేరుతో ఓ నగరాన్ని అభివృద్ధి చేసినట్టుగానే బే-టెక్ సిటీ పేరుతో విశాఖకు అనుబంధంగా మరో నగరాన్ని అభివృద్ధి చేయాలని ఆదేశించారు. అలాగే వీఈఆర్ స్టీరింగ్ కమిటీలో నగర మేయర్‌కు చోటు కల్పించాలని సీఎం సూచించారు. విశాఖ ఎకనమిక్ రీజియన్ పరిధిలో వివిధ విభాగాలకు సంబంధించి 167 ప్రాజెక్టులకు గానూ... 64 ప్రాజెక్టులు అమల్లోకి వచ్చాయని సీఎం వివరించారు. విశాఖకు చెరో వైపు ఉన్న విజయనగరం, అనకాపల్లి వైపు అభివృద్ధి జరుగుతోందని... ఆ ప్రాంతాల్లో అవసరమైన మేరకు ముందుగానే భూమిని గుర్తించి ల్యాండ్ బ్యాంక్ ఏర్పాటు చేసుకోవాలని సీఎం సూచించారు. అలాగే తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు, ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లో భూ లభ్యత తక్కువగా ఉంటుందని... దీనివల్ల పారిశ్రామికాభివృద్ధికి కొంత ఇబ్బంది ఉందన్నారు. ఈ మేరకు ఈ జిల్లాల్లో కూడా ఏపీఐఐసీతో సమన్వయం చేసుకుని ల్యాండ్ బ్యాంక్ ఏర్పాటు చేసుకోవాలని సీఎం సూచించారు. దీనికోసం అవసరమైతే పాలసీ తీసుకురావాలని అధికారులకు సూచించారు. విశాఖలో ఏడాదిలోగా కన్వెన్షన్ సెంటర్ నిర్మాణం పూర్తి చేయాలని, తదుపరి సీఐఐ భాగస్వామ్య సదస్సును అందులోనే నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పోర్టుల ఆధారిత ఆర్థిక వ్యవస్థకు విస్తృత అవకాశాలున్నాయని, పరిశ్రమలకు అవసరమైన లాజిస్టిక్స్, పోర్టులు, విమానాశ్రయాల అనుసంధానాన్ని మెరుగుపరిస్తే మరింత అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ప్రతి పారిశ్రామిక ప్రాంతం వద్ద అవసరమైన నివాస, విద్య, వైద్యం, రవాణా సదుపాయాలతో టౌన్‌షిప్‌లను అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. తిరుపతి ఎకనమిక్ రీజియన్ పరిధిలోని 16 పట్టణాలను పారిశ్రామిక నగరాలుగా తీర్చిదిద్దాలని నిర్దేశించారు.
నాలెడ్జ్ పార్టనర్లుగా ప్రముఖ విద్యా సంస్థలు
తిరుపతి ఆర్థిక ప్రాంతాన్ని సాంకేతిక, పారిశ్రామిక, ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. తిరుపతిని గ్లోబల్ సెమీ కండక్టర్ల డిజైన్ క్యాపిటల్‌గా తీర్చిదిద్దేందుకు అవసరమైన కార్యాచరణ రూపొందించాలని సూచించారు. ఎలక్ట్రానిక్స్, స్పేస్, రోబోటిక్స్, డ్రోన్లు వంటి రంగాలకు అనుబంధంగా డిజైన్ పరిశోధన, అభివృద్ధి కేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే ఆర్ అండ్ డీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలన్నారు. కొప్పర్తి, తిరుపతి, లేపాక్షి పారిశ్రామిక క్లస్టర్లను మరింత బలోపేతం చేయాలన్నారు. మూడు ఆర్థిక ప్రాంతాల్లో ప్రధాన పరిశ్రమల ఏర్పాటుతో పాటు వాటికి అవసరమైన విడిభాగాలు, సేవలు అందించే ఎంఎస్ఎంఈలను కూడా అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. కేవలం భారీ పరిశ్రమలు ఏర్పాటు చేయడం కాకుండా, వాటి చుట్టూ స్థానికంగా చిన్న, మధ్య తరహా పరిశ్రమల నెట్‌వర్క్ ఏర్పడాలని చెప్పారు. ముఖ్యంగా పెద్ద పరిశ్రమలకు అనుసంధానించేలా ఎంఎస్ఎంఈలను ప్రోత్సహించాలని చెప్పారు. ప్రతి రంగానికి అవసరమైన పూర్తి ఎకోసిస్టమ్ అభివృద్ధి చేయాలన్నారు. పరిశ్రమల వ్యర్థాల్లోని విలువైన పదార్థాలను తిరిగి వినియోగంలోకి తీసుకొచ్చే అవకాశాలను పరిశీలించాలని, అరుదైన ఖనిజాల వ్యర్థాల నుంచి ఇతర అవసరాలకు ఉపయోగపడే పదార్థాలను వేరు చేసే సాంకేతికతపై దృష్టి పెట్టాలని ముఖ్యమంత్రి సూచించారు. గ్రీన్ ఎనర్జీ, హార్టికల్చర్, ఖనిజ సంపద ఆధారంగా తిరుపతి ప్రాంతంలో కొత్త పెట్టుబడులకు అవకాశాలున్నాయని చెప్పారు. తిరుపతి ఎకనమిక్ రీజియన్ పరిధిలో మొత్తంగా రూ. 9 లక్షల కోట్ల పెట్టుబడులు వస్తే... అత్యధిక శాతం గ్రీన్ ఎనర్జీ రంగంలో రూ. 5.70 లక్షల కోట్లు వచ్చాయని సీఎం చెప్పారు. రేర్ ఎర్త్ మినరల్స్ రంగంలో అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని.. దీన్ని మాగ్నటిక్ క్లస్టర్ ఏర్పాటు చేయాలని సూచించారు. హార్టికల్చర్ హబ్ అభివృద్ధికి సంబంధించి వచ్చిన ప్రతిపాదనలను కార్యాచరణలోకి తీసుకురావాలని, మూడేళ్లలో లక్ష్యాలను సాధించేలా ప్రణాళిక రూపొందించాలన్నారు. పెట్టుబడులు ఏయే రంగాల్లో, ఏయే ప్రాంతాల్లో వస్తున్నాయో స్పష్టంగా గుర్తించి, లక్ష్యాలకు అనుగుణంగా చర్యలు చేపట్టాలని సూచించారు. శ్రీసిటీ వంటి పారిశ్రామిక కేంద్రాల అనుభవాన్ని వినియోగించుకోవాలని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. అమరావతి ఎకనమిక్ రీజియన్లో ఆక్వా, కోకో, పామాయిల్ వంటి రంగాలు అతి పెద్ద ఆర్థిక చోదక శక్తులుగా ఉన్నాయని తెలిపారు. అమరావతి ఎకనమిక్ రీజియన్ పరిధిలో ఇప్పటికే రూ. 4.65 లక్షల కోట్ల విలువైన 48 ప్రాజెక్టులు నడుస్తున్నాయని తెలిపారు. మచిలీపట్నం, రామాయపట్నం వంటి పోర్టులకు మంచి కనెక్టివిటీ అందిస్తే ఈ ప్రాంతం వేగంగా అభివృద్ధి చెందుతుందని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. అలాగే క్వాంటం రంగాన్ని అభివృద్ధి చేయడం ద్వారా అమరావతి రీజియన్ పరిధిలో పెద్ద ఎత్తున పెట్టుబడులు రావడానికి ఆస్కారం ఏర్పడుతుందన్నారు. క్వాంటం కారిడార్ గా అమరావతి అభివృద్ధి చెందుతుందన్నారు. క్వాంటం వ్యాలీతోపాటు... క్వాంటం మాన్యుఫ్యాక్చరింగ్ రంగానికి అమరావతి కేంద్రంగా మారుతుందనన్నారు. అమరావతి ఇన్నర్ రింగ్‌రోడ్, ఔటర్ రింగ్‌రోడ్ నిర్మాణాలు అభివృద్ధికి కేంద్రంగా ఉంటాయని పేర్కొన్నారు. మూడు ఆర్థిక ప్రాంతాలకు ప్రముఖ విద్యాసంస్థలను నాలెడ్జ్ పార్టనర్లుగా నియమించాలని ముఖ్యమంత్రి సూచించారు. తిరుపతి ప్రాంతానికి ఐఐటీ, అమరావతి ప్రాంతానికి బిట్స్ పిలానీ వంటి సంస్థలతో పాటు మూడు ప్రాంతాల్లోనూ ప్రముఖ విద్యాసంస్థల భాగస్వామ్యాన్ని తీసుకోవాలన్నారు. పరిశ్రమలు, విద్యాసంస్థలు, పరిశోధనా సంస్థల మధ్య నిరంతర అవగాహన, చర్చలు జరగాలని చెప్పారు. ఐఐటీయన్లు, పాన్ ఐఐటీ నిపుణుల సేవలను వినియోగించుకోవాలని సూచించారు.
తీర ప్రాంతం... బుద్ధిస్ట్ సర్క్యూట్లతో టూరిజం అభివృద్ధి
అరకు, లంబసింగి వంటి పర్యాటక ప్రాంతాలకు సందర్శకులను ఆకర్షించేలా రహదారులు, వసతి, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించాలని సీఎం చంద్రబాబు చెప్పారు. వచ్చే సీఐఐ సదస్సు నాటికి వివిధ ప్రాంతాల నుంచి ప్రతినిధులను అరకు, లంబసింగి వంటి ప్రాంతాలకు తీసుకెళ్లాలని సూచించారు. తీర ప్రాంతాలను పరిశుభ్రంగా, సురక్షితంగా ఉంచుతూ బీచ్ రిసార్టులుగా అభివృద్ధి చేయాలన్నారు. సూర్యలంక, ఓడరేపు, చినగంజాం, నిజాం పట్నం, డిండి వంటి ప్రాంతాల్లో బీచ్, ఎకో టూరిజానికి అవకాశం ఉందని తెలిపారు. పర్యాటక అభివృద్ధి పేరుతో కాలుష్యానికి తావుండకూడదని స్పష్టం చేశారు. ఆధ్యాత్మిక పర్యాటకానికి ఉన్న అవకాశాలను పూర్తిగా వినియోగించుకోవాలని, శ్రీశైలం సహా ప్రముఖ ఆధ్యాత్మిక ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపరచాలని చెప్పారు. నాగార్జునకొండ, అమరావతి ప్రాంతాలను అనుసంధానిస్తూ బౌద్ధ పర్యాటక సర్క్యూట్‌ను అభివృద్ధి చేయాలని సూచించారు. సూర్యలంక బీచ్ అభివృద్ధికి ప్రణాళికలు రచించి... ఆ మేరకు ఆ ప్రాంతాన్ని నోటిఫై చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. సూర్యలంక, గండికోట ప్రాంతాల్లో పర్యాటక అభివృద్ధికి సమగ్ర మాస్టర్‌ప్లాన్లు రూపొందించాలని నిర్దేశించారు. ఇప్పటికే కుదిరిన అవగాహన ఒప్పందాలు క్షేత్రస్థాయిలో అమలయ్యేలా చూడాలని, పెట్టుబడుల గ్రౌండింగ్‌పై నిరంతర పర్యవేక్షణ ఉండాలన్నారు. వీకెండ్ ఎకానమీపై దృష్టి పెట్టాలని... వాణిజ్య, పర్యాటక, వినోద కార్యకలాపాలను అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి చెప్పారు. ఈ సమావేశంలో విశాఖ, తిరుపతి, అమరావతి ఎకనమిక్ రీజియన్లకు సంబంధించిన సీఈఓలు యువరాజ్, ముఖేష్ కుమార్ మీనా, సురేష్ కుమార్ సహా వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

టాక్స్ తగ్గించాం.. మరి జీతాలు పెంచారా?

పలు ఆర్థిక సంస్కరణలతో ప్రభుత్వం ఇచ్చిన రాయితీలతో పరిశ్రమలు ఎంతమందికి కొత్తగా ఉపాధి కల్పించాయి? ఉద్యోగుల వేతనాలను ఎంతమేర పెంచాయి? అంటూ భారత పారిశ్రామిక రంగాన్ని ప్రధాని నరేంద్ర మోదీ సూటిగా ప్రశ్నించారు. న్యూఢిల్లీలో గురువారం జరిగిన ఫిక్కీ వార్షిక సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యాపారాలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం పన్నుల తగ్గింపు, నిబంధనల సరళీకరణ, అంతర్జాతీయ వాణిజ్య ఒప్పందాల వంటి ఎన్నో చర్యలు తీసుకుందని ప్రధాని గుర్తుచేశారు. ఆ ఫలాలను ఉద్యోగాల సృష్టి, మెరుగైన వేతనాల రూపంలో ప్రజలకు అందించాల్సిన బాధ్యత పరిశ్రమలపైనే ఉందని స్పష్టం చేశారు.
దేశ సర్వతోముఖాభివృద్ధి కేవలం ప్రభుత్వంతోనే సాధ్యం కాదని, పారిశ్రామికవేత్తలు సైతం ఈ ప్రగతి ప్రయాణంలో సమాన భాగస్వాములు కావాలని మోదీ పిలుపునిచ్చారు. భారత్ కుదుర్చుకుంటున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల ప్రయోజనాలను అందిపుచ్చుకోవడానికి సంస్థలే సొంతంగా నిర్దిష్ట వ్యూహాలను రూపొందించుకోవాలని సూచించారు. ప్రతిదానికీ ప్రభుత్వంపైనే ఆధారపడవద్దని హితవు పలికారు. విదేశాలకు ఎగుమతి చేసే ఉత్పత్తులకే అత్యున్నత నాణ్యతను కేటాయిస్తూ 'ఎక్స్‌పోర్ట్ క్వాలిటీ' పేరిట ప్రచారం చేయడంపై మోదీ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. విదేశీ వినియోగదారులకు అందించే నాణ్యమైన వస్తువులనే భారతీయ పౌరులు కూడా పొందే హక్కు కలిగి ఉన్నారని స్పష్టం చేశారు. దేశీయ మార్కెట్‌ను తేలిగ్గా తీసుకోవద్దని హితవు పలికారు.దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించి దేశీయ తయారీ రంగాన్ని బలోపేతం చేయాలని ప్రధాని కోరారు. ప్రపంచానికే ఫార్మసీ హబ్ గా పేరుగాంచిన భారత్.. కీలకమైన యాక్టివ్ ఫార్మాస్యూటికల్ ఇంగ్రీడియంట్స్ (ఏపీఐ), ముడి పదార్థాల కోసం ఇతర దేశాలపై బిలియన్ల డాలర్లు వెచ్చించాల్సి రావడంపై ఆందోళన వ్యక్తం చేశారు. సమృద్ధిగా ముడి వనరులు ఉన్నప్పటికీ అల్యూమినియం, స్టీల్ రంగాల్లో ప్రత్యేక ఉత్పత్తులను దిగుమతి చేసుకోవడం తగదన్నారు. వ్యవసాయ ఉత్పత్తుల్లో అగ్రగామిగా ఉన్నప్పటికీ అంతర్జాతీయ మార్కెట్లో భారత ఎగుమతుల వాటా కేవలం 2 నుంచి 2.5 శాతానికే పరిమితం కావడంపై దృష్టి సారించాలని, గ్లోబల్ డిమాండ్‌కు అనుగుణంగా ఫుడ్ ప్రాసెసింగ్, విలువ ఆధారిత రంగాల్లో పెట్టుబడులు పెట్టాలని పారిశ్రామిక వర్గాలకు సూచించారు.

ప్రభుత్వ బోధనాసుపత్రుల్లో రోబోటిక్ శస్త్రచికిత్సల దిశగా అడుగులు

మొదటి పేజీ తరువాయి

తొలిదశలో విజయవాడ ప్రభుత్వ బోధనాసుపత్రిలో రూ.45 కోట్లతో రోబోటిక్ శస్త్రచికిత్స కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని, మలివిడతలో విశాఖ కేజీహెచ్, కర్నూలు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రుల్లోనూ రోబోటిక్ విధానాన్ని ప్రవేశపెట్టాలని భావిస్తోంది. మంగళగిరిలోని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ ప్రధాన కార్యాలయంలో గురువారం నాలుగు గంటలపాటు జరిగిన విస్తృత స్థాయి సమీక్షా సమావేశంలో బోధనాసుపత్రుల్లో అత్యాధునిక వైద్య సదుపాయాల కల్పన, నిర్మాణాల పురోగతి, ఇతర ముఖ్యాంశాలపై మంత్రి అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ బోధనాసుపత్రుల్లో రూ.1,011 కోట్లతో అత్యాధునిక వైద్య సేవలు, ప్రత్యేక చికిత్సా కేంద్రాలు, వైద్య పరికరాలు, మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ విష్ణువర్ధన్ వివరించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో తొలిసారిగా ఐదు సంతాన సాఫల్య కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. గుంటూరు, అనంతపురం, విజయనగరం, కాకినాడ, తిరుపతి
బోధనాసుపత్రుల్లో వీటిని నెలకొల్పేందుకు

ప్రజాభూమి
ఎన్టీఆర్, కృష్ణా
శుక్రవారం, నవంబర్ 20, 2026

59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవ ములు

ప్రజాభూమి ప్రతినిధి, మచిలీపట్నంః కృష్ణాజిల్లా గ్రంథాలయ సంస్థ,, జిల్లా కేంద్ర గ్రంథాలయం,, మచిలీపట్నం నందు ఈరోజు ఉదయం విద్యార్థినీ విద్యార్థులకు దేశభక్తి గీతాలు/ సినీ భక్తి గీతాలు,, రంగవల్లుల/ ముగ్గుల పోటీలు,, మెహందీ డిజైన్స్ పోటీలు నిర్వహిం చారు. మహిళా దినోత్సవ సందర్భంగా నిర్వ హించిన ఈ పోటీలలో పెద్ద సంఖ్యలో విద్యార్థి నిలు పాల్గొన్నారు.న్యాయ నిర్ణేతలుగా: అల్లాడ శ్యామలత (సంగీతం); కె కోటేశ్వరమ్మ (రంగవల్లులు); పి స్వర్ణలత టీచర్,(మెహందీ డిజైన్స్)



వ్యవహరించారు.వెత్స సత్యనారాయణ అన్న మయ్య పాటలు ,,, భక్తి గీతాలు ఆలపించారు. ఎల్.వెంకటేశ్వర రావు, సీనియర్ అసిస్టెంట్ మోటివేషన్ క్లాస్ , "ఏపీ గ్రంథాలయ" యాప్ గురించి మరియు " @ZGSKRISHNA" యూ ట్యూబ్ ఛానల్ గురించి విపులంగా నేర్పించారు. డిప్యూటీ లైబ్రేరియన్ నేర్చుకోవడానికి-- చద వండి నాయకత్వం వహించడానికి- నేర్చు కోండి,, నాయకత్వ లక్షణాలు గూర్చి వివరించా రు. గ్రంథాలయ సిబ్బంది,, విద్యార్థులుపాల్గొన్నారు. రేపు 20.11.26.సాయంత్రం కృష్ణా యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఎన్.ఉషా ముఖ్య అతిథులుగా జిల్లా అధికారు లు,, ప్రముఖులు అతిథులుగా వారోత్సవముల ముగింపు సభ సాయంత్రం 5:30 కు నిర్వహించబడును



ముగిం పు సభనందు పోటీలలో గెలుపొందిన విజేతలకు బహుమతి ప్రధానం, మెరిట్ సర్టిఫికెట్స్ అంద చేయబడునని జిల్లా కేంద్ర గ్రంథాలయం, మచిలీపట్నం డిప్యూటీ లైబ్రేరియన్ బీరం వెంకట రమణ తెలిపారు.



మండల పరిషత్ కో-ఆప్షన్ సభ్యుల ఎన్నికలు వాయిదా

యథావిధిగా జడ్పీ ఛైర్మన్, వైస్ ఛైర్మన్, ఎంపీపీ, వైస్ ఎంపీపీ ఎన్నికలు

ప్రజాభూమి ప్రతినిధి, మచిలీపట్నంః

జిల్లా పరిషత్, మండల ప్రజా పరిషత్ లలో కో-ఆప్షన్ సభ్యు ల ఎన్నికలు గురు, శుక్రవారాల్లోనిర్వహించడం లేదు. వీటిని వాయిదా వేశారు. జడ్పీ ఛైర్మన్, వైస్ ఛైర్మన్, ఎంపీపీ, వైస్ ఎంపీపీ ఎన్నికలు పూర్తయిన రెండు నెలల్లోపు కో-ఆప్షన్ సభ్యుల ఎన్నికలకు మరోసారి నోటిఫికేషన్ ఇవ్వను న్నారు. ఈ మేరకు రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ సవరణ ఉత్త ర్వులు జారీచేస్తోంది. రాష్ట్ర ఎన్నికల సంఘం ఈ నెల 10న జారీచేసిన నోటిఫికేషన్ ప్రకారం ముస్లింలు, క్రైస్త వులు, సిక్కులు, బౌద్ధులు, పార్సీల నుంచి మండల ప్రజాపరిషత్లో ఒకర్ని, జిల్లా ప్రజాపరిషత్లో ఇద్దర్ని కో-ఆప్షన్ సభ్యులుగా ఎంపీటీసీలు, జడ్పీటీసీలు ఈ నెల 19, 20 తేదీల్లో ఎన్ను కోవాలి. ఆ తర్వాతే ఎంపీపీ, వైస్ ఎంపీపీ, జడ్పీ ఛైర్మన్, వైస్ ఛైర్మన్ల ఎన్నిక నిర్వహించాలి. మండల ప్రజాపరిషత్తుల్లో గురువారం ఎంపీపీ, వైస్ ఎంపీపీ, జిల్లా ప్రజా పరిషత్తుల్లో శుక్రవారం జడ్పీ ఛైర్మన్, వైస్ చైర్మన్ల ఎన్నికలను యథావిధిగా నిర్వహిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు.

ఘనంగా ఇందిరా గాంధీ 109వ జయంతి

ప్రజాభూమి ప్రతినిధి, మచిలీపట్నంః

ఇందిరా గాంధీ 109వ జయంతి కార్యక్రమం పట్టాభి భవన్ నందు జిల్లా కమిటీ మరియు పట్టణ కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిం చారు ఈ సందర్భంగా జిల్లా జనరల్ సెక్రెటరీ కొడమంచిలి చంద్రశేఖర్ మరియు నగర అధ్యక్షులు అబ్దుల్ మతిన్ ఇందిరా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సంద ర్భంగా ఇందిరా గాంధీ సేవలను కొనియాడినారు నగర అధ్యక్షులు అబ్దుల్ మతిన్ మాట్లాడుతూ దేశ సేవకై తన జీవితాన్ని అంకితం చేసిన మహానీయురాలు అని పేర్కొన్నారు. జిల్లా జనరల్ సెక్రెటరీ కొడ మంచిలి చంద్ర శేఖర్ మాట్లాడుతూ దేశ సమగ్రత, ఐక్యత పేద ప్రజల సంక్షేమం, మహిళా సాధికారత కోసం విశేష కృషి చేశారు అని తెలిపారు. ఏపీ సి సి మైనారిటీ సెల్ ఉపాధ్యక్షులు మహమ్మద్ దాదా మాట్లాడుతూ భారత్ ఉక్కు మహిళ ఇందిరా గాంధీ తొలి మహిళ



ప్రధాని అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చిలుకోటి ప్రసాద్ మాట్లాడుతూ బ్యాంకుల జాతీయకరణ, గరీబీ హటావో ఇందిరాగాంధీ తెచ్చిన విప్లవ త్మకమైన సంస్కర ణలు అని తెలిపారు.

ఈ కార్యక్రమంలో కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షులు గరికపాటి శంకర్, జిల్లా సోషల్ మీడియా నాయకులు నల్లబోలు సామ్యూల్, కాంగ్రెస్ నాయకులు అల్లాబక్షు, సైపుల్ల ఆయుబ్, వీరబాబు వసంత తదితరులు పాల్గొన్నారు.



గ్రేటర్ హైదరాబాద్ పద్మశాలి సంఘం స్వర్ణోత్సవాలకు ఆహ్వానం

ప్రజాభూమి ప్రతినిధి, మచిలీపట్నంః

గ్రేటర్ హైదరాబాద్ పద్మశాలి సంఘం స్వర్ణోత్సవాలకు గంజి భద్రయ్య అధ్యక్షులు సనత్ నగర్ పద్మశాలి సంఘం వారు ఆహ్వా నించారు. గ్రేటర్ హైదరాబాద్ పద్మశాలి సంఘం 50 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా డిసెంబర్ 6 ఆదివారం రోజున మహారాణా ప్రతాప్ ఫంక్షన్ హాల్ చే నెంబర్ చౌరస్తా అంబర్ పేట నందు నిర్వహించనున్న సర్వోత్సవాలకు గంజి భద్రయ్య అధ్యక్షులు సనత్ నగర్ పద్మశాలి సంఘంకి ఆహ్వాన పత్రికను అందచేసి వేడుకలకు హాజరుకావాలని ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ హైదరాబాద్ పద్మశాలి సంఘం అధ్యక్షులు కత్తుల సుదర్శన్, ప్రధాన కార్యదర్శి కల్లేపల్లి రాజు నేత సనత్ నగర్ సంఘం సభ్యులు భీమా నారాయణ , నరసయ్య, చంద్రమౌళి, సీతా శ్రీహరి, చంద్రకుమార్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

55వ డివిజన్‌లో ప్రజల వద్దకే వెళ్లి సమస్యలు తెలుసుకున్న కార్పొరేటర్ పెద్ది రమేష్

స్థానికుల సమస్యల పరిష్కారానికి అధికారులతో ఫోన్‌లో మాట్లాడి ఆదేశాలు జారీ

ప్రజాభూమి ప్రతినిధి విజయవాడ





విజయవాడ 55వ డివిజన్‌లో కార్పొరేటర్ పెద్ది రమేష్ ప్రజల వద్దకు వెళ్లి వారి సమస్యలను అడిగి తెలుసుకు న్నారు. డివిజన్ పరిధిలోని 1, 2, 3, 4, 5, 6వ సందుల్లో పర్యటించి స్థానికులతో నేరుగా మాట్లాడారు.ఈ సంద ర్భంగా పలువురు స్థానికులు ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ సమ స్యలు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సమస్యలు తదితర ఇబ్బం దులను కార్పొరేటర్ దృష్టికి తీసుకువచ్చారు. ప్రజలు



తెలిపిన సమస్యలపై స్పందించిన పెద్ది రమేష్ వెంటనే సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి, సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.ప్రజలకు ఎదురవుతున్న సమస్యల పరి ష్కా రానికి నిరంతరం కృషి చేస్తానని, అధికారులు కూడా ప్రజల సమస్యల పట్ల తక్షణమే స్పందిం చాలని సూచించారు.ఈ కార్యక్రమంలో 55, 56 క్లస్టర్ ఇన్‌చార్జ్ దనేకుల వెంకట సుబ్బారావు, 55వ డివిజన్ అధ్యక్షులు పెద్ది శ్యామ్ సుందర్, సీనియర్ నాయకులు గొల్లగాని శివ, బసవేశ్వర రావు, కే. శేషారావు, యూనిట్ ఇన్‌చార్జ్ కప్పిరెడ్డి రాజు, బూత్ కన్వీనర్ తడసం శ్రీనివాస్, షేక్ ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

కన్నీటి వీడ్కోలు.. మంత్రి కొల్లు రవీంద్ర అక్క శేష మల్లేశ్వరి అంతిమయాత్ర

పలువురు ప్రముఖుల ఘన నివాళులు.. విషాదంలో కొల్లు కుటుంబం

మచిలీపట్నం, ప్రజాభూమి ప్రతినిధి:



మంత్రి కొల్లు రవీంద్ర కుటుం బంలో తీవ్ర విషాదం నెల కొంది. మంత్రి కొల్లు రవీంద్ర అక్క, మాజీ మంత్రి నడకు దుటి నరసింహారావు సతీమ ణి నడకుదుటి శేష మల్లేశ్వరి (69) గుండెపోటుతో బుధ వారం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. ఆ మె మరణవార్తతో కుటుంబసభ్యులు, బంధుమిత్రులు,అభిమానులు శోకసంద్రంలో మునిగిపోయారు.

మాజీ మంత్రి నడకుదుటి నరసింహారావుకు ముగ్గురు కుమార్తెలు, ముగ్గురు అల్లుళ్ళు

శేష మల్లేశ్వరి పార్థివా దేహాన్ని హైదరాబాద్ నుంచి బుధవారం రాత్రి మచిలీపట్నంలోని వారి స్వగృహానికి తీసుకువచ్చారు. విషయం తెలుసుకున్న కూటమి నాయకులు, కార్యకర్తలు, అభి మానులు, శ్రేయోభిలాషులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఆమె భౌతికకాయానికి పుష్పాంజలి ఘ టించి ఘనంగా శ్రద్ధాంజలి నడిపించారు.

ప్రముఖుల నివాళులు



మంత్రి కొల్లు రవీంద్ర కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపేందుకు పలువురు ప్రజాప్రతినిధులు, రాజకీయ ప్రముఖులు, నగర ప్రముఖులు తరలివచ్చారు. పెడన శాసనసభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్ అవనిగడ్డ టిడిపి ఇంచార్జ్ వి, శ్రీనివాసరావు ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, కొనకళ్ల జగన్నాధరావు (బోలయ్య) మచిలీపట్నం నగర మేయర్ అబ్దుల్ అబీదా, హసీం బేగ్, బీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ, టీడీపీ సీనియర్ నాయకుడు గొరైపాటి గోపీచంద్, జడ్పీటీసీ కాగిత వెంకటేశ్వరరావు, మోకా రాజా, లంకే శేషగిరి తదితరులు శేష మల్లేశ్వరి పార్థివ దేహాన్ని సందర్శించి శ్రద్ధాంజలి నడిపించారు. ఇటీవల నగరంలో విజయం సాధించిన కూటమి కార్పొరేటర్లు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు కూడా ఆమెకు కన్నీటి వీడ్కోలు పలికారు.గురువారం ఉదయం మంత్రి కొల్లు రవీంద్ర సమక్షంలో కుటుంబ సభ్యులు, బంధువులు, అభిమానుల అశ్రునయనాల మ ధ్య శేష మల్లేశ్వరి అంత్య క్రి యలు నిర్వహించారు. పలు వు రు ప్రముఖులు మంత్రి రవీం ద్ర ను పరామర్శించి, కుటుం బాని కి ప్రగాఢ సానుభూతి తెలి య జేశారు. మాజీ మంత్రి నడ కుదు టి నరసింహారావుతో వివా హ మైన శేష మల్లేశ్వరి కుటుంబ బాధ్యతలను నిర్వహిస్తూ ముగ్గురు కుమార్తెలకు తల్లిగా కుటుంబానికి అండగా నిలిచారు. నరసిం హారావు 2022లో మరణించగా, తాజాగా శేష మల్లేశ్వరి మృతి చెందడం కుటుంబానికి తీరని లోటుగా మారింది. ఆమె పెద్ద కుమార్తె నీలిమ మంత్రి కొల్లు రవీంద్ర సతీమణి.



మంత్రి కొల్లు రవీం ద్ర అక్క అయిన శేష మల్లేశ్వరికి తలకొరివి పెట్టారుశేష మల్లేశ్వరి మృతి పట్ల కుటుంబ సభ్యులు, బంధు మిత్రులు, రాజకీయ పర్గాల వారు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, దుఃఖంలో ఉన్న కుటుంబ సభ్యులకు మనోధైర్యం కలగాలని ఆకాంక్షించారు.

కోడూరు ఎంపీపీగా రెడ్రౌతు కృష్ణబాబు

ఉపాధ్యక్షురాలిగా మద్దాల ప్రియాంక ఏకగ్రీవ ఎన్నిక ఎన్నికైన ప్రజాప్రతినిధులకు కూటమి శ్రేణుల అభినందనలు

కోడూరు, ప్రజాభూమి ప్రతినిధి:

కృష్ణా జిల్లా అవనిగడ్డ నియోజకవర్గంలోని కోడూరు మండల పరిషత్ అధ్యక్షుడిగా రెడ్రౌతు కృష్ణబాబు, ఉపాధ్యక్షురాలిగా మద్దాల ప్రియాంక ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం కోడూరు మండల పరిషత్ కార్యాలయంలో మండల ఎన్నికల అధికారి పగడాల సురేష్ బాబు ఆధ్వర్యంలో ఎన్నికల ప్రక్రియ నిర్వహించారు.తొలుత నూతనంగా ఎన్నికైన మండల పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గ సభ్య లతో ప్రమాణ స్వీకారం చేయించారు.

అనంతరం మండల పరిషత్ అధ్యక్ష, ఉపాధ్యక్షుల ఎన్నికను నిర్వహించగా, రెడ్రౌతు కృష్ణబాబు, మద్దాల ప్రియాంక ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించారు.నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు, ఉపాధ్యక్షురాలికి కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అభినందనలు తెలిపారు. పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు మండల పరిషత్ కార్యాలయానికి చేరుకోవడంతో అక్కడ సందడి నెలకొంది. ఏకగ్రీవ ఎన్నికతో కూటమి శ్రేణుల్లో ఉత్సాహం వెల్లివిరిసింది.



వైస్ ఎంపీపీ మద్దాల ప్రియాంకకు ఘన సత్కారం

యార్లగడ్డ లక్ష్మికి అభినందనలు తెలిపిన బడే గాంధీ, బడే వీరబాబు

కోడూరు, ప్రజాభూమి ప్రతినిధి:

కోడూరు మండల పరిషత్ ఉపాధ్యక్షురాలిగా ఎన్నికైన ఉల్లిపాలెం ఎంపీటీసీ మద్దాల ప్రియాంకను మండల మాజీ తెలుగు యువత అధ్యక్షుడు బడే గాంధీ, మాజీ ఎంపీటీసీ బడే వీరబాబు ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు.అదేవిధంగా కోడూరు మూడో విభాగం ఎంపీటీసీ సభ్యురాలిగా ప్రమాణ స్వీకారం చేసిన యార్లగడ్డ లక్ష్మికి శుభాకాంక్షలు తెలియజేసి సత్కరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, నూతనంగా బాధ్యతలు చేపట్టిన ప్రజాప్రతినిధులు ప్రజలకు అందుబాటులో ఉంటూ, ప్రజల సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేయాలని ఆకాంక్షించారు. గ్రామాల అభివృద్ధికి ప్రాధాన్యమిస్తూ ప్రజల ఆదరాభిమానాలను పొందాలని సూచించారు.



ఘనంగా ఇందిరాగాంధీ జయంతి వేడుకలు

దివిసీమ ఉప్పెన మృతులకు కొవ్వొత్తులతో నివాళులు

అవనిగడ్డ, ప్రజాభూమి ప్రతినిధి:

అవనిగడ్డ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో భారత మాజీ ప్రధానమంత్రి ఇందిరాగాంధీ జయంతి వేడు కలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఏపీసీసీ అధ్యక్షురాలు, కృష్ణా జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు, అవనిగడ్డ నియోజకవర్గ సమన్వయకర్త అందే శ్రీరామమూర్తి ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. దేశానికి ఆమె చేసిన సేవలను స్మరించుకున్నారు. అనంతరం 1977 నవంబరు 19న దివిసీమను అతలాకుతలం చేసిన పెను ఉప్పెనలో ప్రాణాలు కోల్పో యిన వేలాది మందిని స్మరించుకున్నారు. మృతవీరుల స్తూపం వద్ద కొవ్వొత్తులు వెలిగించి మృతులకు ఘనంగా నివాళులర్పించారు. ఉప్పెనలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలు ఎదుర్కొన్న తీరని నష్టాన్ని గుర్తుచేసుకుంటూ, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఈ కార్యక్ర మంలో కృష్ణా జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శులు కాగిత సుదర్శన్, ఎస్.కె. గౌస్, అవనిగడ్డ మండల అధ్యక్షుడు నరహరిశెట్టి శ్రీమ న్నా రాయణ, కోడూరు మండ ల అధ్యక్షుడు యలవర్తి నాగేం ద్రం, జిల్లా ఎస్సీ విభాగం అధ్యక్షుడు నలుకుర్తి కుమార్ (లాజర్), అవనిగడ్డ పట్టణ అధ్యక్షుడు సనక కుటుంబరా వుతో పాటు పలువురు కాంగ్రె స్ నాయకులు, కార్యకర్తలు, అభి మానులు పాల్గొన్నారు.





కొండవీటి వెంకట నారాయణకు సింహాద్రి రమేష్ బాబు పూలనివాళి

పెద్దకర్మలో పాల్గొని కుటుంబ సభ్యులకు ఓదార్పు

కోడూరు, ప్రజాభూమి ప్రతినిధి:

కృష్ణా జిల్లా అవనిగడ్డ నియోజకవర్గం కోడూరు మండలం విశ్వనాథపల్లి గ్రామానికి చెందిన కొండవీటి వెంకట నారాయణ వయోభారంతో పాటు అనారోగ్యం కారణంగా ఇటీవల కన్నుమూశారు. గురువారం నిర్వహిం చిన ఆయన పెద్దకర్మ కార్యక్రమానికి అవనిగడ్డ మాజీ శాసనసభ్యుడు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త, రాష్ట్ర రైతు విభా గం ప్రాంతీయ కార్యనిర్వా హక అధ్యక్షుడు సింహాద్రి రమేష్ బాబు హాజర య్యారు.ఈ సందర్భంగా వెంకట నారాయణ ఇంటికి చేరుకున్న సింహాద్రి రమేష్ బాబు, ఆయన చిత్రపటానికి పూలమాల వేసి పూలనివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా మృతుని కుటుంబానికి మనోధైర్యాన్ని కల్పిస్తూ ఓదార్చారు.ఈ కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ప్రజాభూమి

ఏలూరు, పశ్చిమగోదావరి 4

శుక్రవారం 20 నవంబర్ 2026




ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో ఏలూరు జిల్లాలో రెండున్నర లక్షల పామాయిల్ తోటలు సాగు

- ఉద్యానవన శాఖ అధికారి షాజా నాయక్

ప్రజా భూమి ప్రతినిధి,జీలుగుమిల్లి

ఏలూరు జిల్లాలో రెండున్నర లక్షల ఎకరాల పామాయిల్ సాగు అవుతుందని ఏలూరు జిల్లా ఉద్యాన శాఖ అధికారి షాజా నాయక్ అన్నారు. గురువారం మండలంలోని స్వర్ణరు గూడెంలో నవభారత కంపెనీ ఆధ్వర్యంలో గెలలు కోత శిక్షణ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొన్నారు . జీలిగిమిల్లిలో పదివేల ఎకరాలు సాగు అవుతుందని కార్మికుల సంఖ్య కూడా పెంచుతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జైలుకుమిల్లి మండల ఉద్యాన శాఖ అధికారి లక్ష్మీ ప్రసన్న, నవభారత కంపెనీ అసిస్టెంట్ మేనేజర్ సిద్ధార్థ, లీలా కృష్ణుడు పాల్గొన్నారు. జీలుగుమిల్లి మండల ఏరియా మేనేజర్ దీపక్, ఫీల్డ్ మేనేజర్స్ ఎస్ మల్లేశ్వరరావు, ఎం నాగరాజు, సిహెచ్ సురేంద్ర, డి రాజకుమారితోపాటు, శిక్షణ తీసుకున్న కార్మికులు 41 మంది పాల్గొన్నారు. అనంతరం యాజమాన్యం కార్మికులకు 24 అడుగుల గడకత్తెను ఉచితంగా అందజేశారు. అవసరమైన బూట్లు, హెల్మెట్లు, గ్లౌజ్ యూనిఫామ్ అందజేశారు.

కామవరపుకోట మండల పరిషత్ అధ్యక్షులుగా మన్నెల్లి



ప్రజా భూమి ప్రతినిధి, కామవరపుకోట

కామవరపుకోటలో మండల పరిషత్లో హోరా ఉరిగా జరిగే ఎన్నికలలో వైసిపి మండల పరిషత్ ను అస్తగతం చేసుకుంది. యువతరం అంత ఒక తాటిపై కొచ్చి చింతలపూడి వైఎస్ఆర్సిపి కన్వీనర్ కంభం విజయరాజద్వర్యం లో ఈ స్థానం నిలబెట్టుకుంది. కోట మండల పరిషత్ అధ్యక్షులుగా మన్నెల్లి మద్దిరామయ్య ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

కామవరపుకోట వైస్ ఎంపిపీ మారోతి నాగ పెద్దింట్లు ఎంపీటీసీలు ఎన్నుకున్నారు. ఇదేవిధంగా రానున్న పంచాయతి ఎన్నికలలో కూడా విజయభేరి మ్రోగించాలని నూతన అధ్యక్షులు మద్దిరామయ్య కోరారు.

మండల పరిషత్ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం



ప్రజా భూమి ప్రతినిధి,జీలుగుమిల్లి

జీలుగుమిల్లి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారం చేశారు.

ముగిసిన మండల ఎంపిపి ,వైస్ ఎంపిపి,ఎంపిటిసిల ప్రమాణ స్వీకార కార్యక్రమం

ఎంపిపిగా సున్నం ఉషారాణి,వైస్ ఎంపిపి గా వీరంకి. నాగలక్ష్మి లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కోలోహాలంగా ఎన్నికైన ఎంపీటీసీలు హాజరయ్యారు. నేటి నుండి వీరి పదవి కాలం ఐదు సంవత్సరాలు కొనసాగుతుంది.

కె కోట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇంటర్నషిప్‌పై అవగాహన కార్యక్రమం



ప్రజా భూమి ప్రతినిధి, కామవరపుకోట

స్థానిక కామవరపుకోట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె విజయబాబు సూచనల మేరకు కళాశాలలో ఇంఛార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.మధు అధ్యక్షతన రసాయనశా స్త్రం విభాగం ఆధ్వర్యంలో తృతీయ సంవత్సరం చదువుతున్న బి.ఎ, బీ.కాం, బి.ఎస్సీ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏలూరు, ఓటీపీ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధి మనోహర్ ఇంటర్న్‌షిప్ ప్రాముఖ్యత మరియు పరిశ్రమల్లో లభించే అవకాశాలు మరియు ఉద్యోగ నైపుణ్యాల అభివృద్ధి గురించి వివరించారు. అనంతరం ఇంఛార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం మధు ప్రసంగిస్తూ భవిష్యత్తులో మెరుగైన ఉద్యోగ అవకాశాలకు ఇంటర్న్‌షిప్ దోహదపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంఛార్జి ప్రిన్సిపాల్ డా.ఎం.మధు, ఐ. క్యూ. ఏ. సీ కోఆర్డినేటర్ డా. జి. శ్రీనివాసరావు ఇతర అధ్యాపకులు ఎస్ సుశ్యలత, ఎస్ జ్యోతి, ఎం విజయకృష్ణ తో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

ఎంపీపీగా కొల్లి సత్యవతి ప్రమాణ స్వీకారం

ప్రజా భూమి ప్రతినిధి. చాట్రాయి.

ఈ నెల 5వ తేదీన జరిగిన ఎంపీటీసీ ఎన్నికలలో చాట్రాయి మండలంలో మొత్తం 15 ఎంపీటీసీ స్థానాలు ఉండగా 9 స్థానాలను తెలుగుదేశం పార్టీ జనసేన ఒక స్థానాన్ని కైవసం చేసుకోగా వైసిపి నాలుగు స్థానాల్లో స్వతంత్ర అభ్యర్థిగా ఒక స్థానంలో గెలుపొందడం జరిగింది. మండల ప్రజా పరిషత్ అధ్యక్షురాలుగా కొల్లి సత్యవతిని ఎన్నుకోవడం జరిగింది. చాట్రాయి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించగా ఎంపీపీగా కొత్తగూడెం ఎంపీటీసీ సభ్యురాలు మహదేవ భాస్కర లక్ష్మి తుమ్మగూడెం ఎంపీటీసీ సభ్యురాలు అయిన కొల్లి సత్యవతినీ ప్రతిపాదించగా చనుబండ ఎంపీటీసీ సభ్యుడు తీర్దాల అద్భుతరావు బలపరచగా మిగిలిన సభ్యులు ఆమోదం తెలపగా ఎంపీపీగా కొల్లి సత్యవతి ఎన్నుకోవడం



జరిగింది. అనంతరం ఉపాధ్యక్షుడిగా కోటపాడు ఎంపీటీసీ సభ్యులుమోదుగు మోడీ రమేష్ ను బూరుగు గూడెం ఎంపీటీసీ సభ్యురాలు భూభక్తుల నాగ స్వరూప ప్రతిపాదించగా చిన్నంపేట ఎంపీటీసీ సభ్యుడు కొమ్ము సుజాన్ రావు బలపరచడంతో ఉపాధ్యక్షుడిగా మోదిగుమూడి రమేష్ నుఎన్నుకోవడం జరిగింది. వీరిద్దరితో ఎన్నికల రిటర్నింగ్ అధికారి అనురాధ ప్రమాణ స్వీకారం చేయించడం జరిగింది. అనంతరం ఎంపీపీ కి ఉపాధ్యక్షుడికి ఎంపీటీసీ సభ్యులకు ఘనంగా శాలువాలతో పూల బొకేలతో సత్కరించడం జరిగింది. మండల జడ్పీటీసీసభ్యుడు తేళ్లూరిశేఖర్ మాట్లాడుతూ జిల్లా పరిషత్ నుండి వచ్చే నిధులతో మండల పరిషత్తులకు వచ్చే నిధులతో మండలంలోని గ్రామాలను అభివృద్ధి చేద్దామని ప్రజలు మనం చేసిన పనులను గుర్తించుకొని మళ్లీ మన ప్రభుత్వాన్నే అధికారంలోకి తీసుకువచ్చేలా పనిచేయాలని అన్నారు. తెలుగుదేశం మండల పార్టీ అధ్యక్షుడు ఇ జ్జి గాని వెంకటేశ్వరరావు ఎంపీపీ, జడ్పిటిసిని ,ఎంపీటీసీ సభ్యులను శాలువాలతో సత్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సత్యనారాయణ, తహసిల్దార్ జి శ్వేత, తెలుగుదేశం పార్టీ జనసేన పార్టీ నాయకులు పాల్గొన్నారు.

నూతనంగా ఎన్నికైన ఎంపీటీసీ సభ్యుల ప్రమాణ స్వీకారం


ప్రజాభూమి,బుట్టాయగూడెం

మండల పరిషత్ ఎన్నికలలో నూతనంగా ఎన్నికైన బుట్టాయగూడెం ఎంపీటీసీల ప్రమాణ స్వీకారం కార్యక్రమం మండల పరిషత్ కార్యాల యంలో నిర్వహించారు. స్థానిక ఎంపీడీవో కా ర్యాలయంలో గురువారం ఎన్నికల అధికారి ఏవి.సుబ్బరాయన్, ఎంపీడీవో కె.జ్యోతి మండల పరిషత్‌కు ఎన్నికైన ఎంపీటీసీలచే ప్రమాణ స్వీకారం చేయించారు. మండలంలో నూతన వీూజు లుగా ఎన్నికైన వంజం కనకదుర్గ(వైసిపి, అంతర్వేదిగూడెం), మడివి నాగ దుర్గారావు(జనసేన, బుట్టాయగూడెం -2) మిడియం సునీత(జనసేన, బుట్టాయగూడెం -1), కొమరం రజని (టిడిపి, దొరమామిడి -1), కుంజా వెంకటేష్ వైసిపి, దొరమామిడి-2), తెల్లం గంగాధర రావు(వైసిపి, కోట నాగవరం), ఉయికె బొజ్జి(వైసిపి, కోట రామచంద్రపురం) కొమరం మల్లేశ్వరరావు(టిడిపి, లక్ష్ముడుగూడెం) యలమాటి కృష్ణవేణి(టిడిపి, నిమ్మలగూడెం), కలుం సరోజ(టిడిపి, నూతి రామన్నపాలెం), మడకం పాపాయమ్మ (జనసేన, పులిరామిడుగూడెం), ఇరపా గంగారత్నం (టిడిపి, రాజానగరం) వెట్టి బేబీ సుప్రియ(వైసిపి, రెడ్డి గణపవరం -1), కుంజా కనకమ్మ(సిపిఐ(ఎం), రెడ్డి గణపవరం-2)కేరం రాంప్రసాద్(జనసేన, సీతప్పగూడెం) లచే ఎన్నికల అధికారి ఎవి. సుబ్బారాయన్, ఎంపీడీవో కె. జ్యోతి ప్రమాణ స్వీకారం చేయించారు.

బుట్టాయగూడెం ఎంపిపిగా కొమరం మల్లేశ్వరరావు, వైస్ ఎంపిపిగా మిడియం సునీత

ప్రజాభూమి, బుట్టాయగూడెం

బుట్టాయిగూడెం మండల పరిషత్ అధ్యక్షునిగా కొమరం మల్లే శ్వరరావు, ఉపాధ్యక్షురాలిగా మిడియం సునీత ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం జరిగిన మండల పరిషత్ పాలకవర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమంలో అంతర్వేదిగూడెంకు చెందిన కొమరం మల్లేశ్వరరావు మండల పరిషత్ అధ్యక్షుడిగా(ఎంపిపి)గా, దొరమామిడికి చెందిన మిడియం సునీత ఉపాధ్యక్షురాలి(వైస్ ఎంపిపి)గా ప్రమాణ స్వీకారం చేశారు. ఎన్నికల అధికారి ఎ వి.సుబ్బరాయన్, ఎంపీడీవో కె.జ్యోతి వీరిచే ప్రమాణ స్వీకారం చేయించారు. ప్రభుత్వం,అధికారుల సహకారంతో, ఎంపీటీసీలు, ప్రజా ప్రతినిధుల సమన్వయంతో మండలంలో ని గ్రామాల సర్వతోముఖాభివృద్ధికి నిరంతరంగా కృషి



చేస్తామని ఎంపిపి మల్లేశ్వరరావు, వైస్ ఎంపిపి సునీత తెలిపారు. ఎంపిపి మల్లేశ్వరరావును, వైస్ ఎంపిపి సునీతను టిడిపి, జనసేన, బిజెపి లకు చెందిన పలువురు నాయకులు కార్యకర్తలు పూలదండలు శాలువాలతో సత్కరించి, అభినందించారు. ఆనందోత్సాహాలతో మిఠాయిలు పంచారు.

వేగేశ్వరపురంలో ఎఫ్ఎఫ్ఎస్ విధానంపై

రైతులకు అవగాహన సదస్సు


- సబ్సిడీ ఎరువుల పంపిణీలో పారదర్శకతే లక్ష్యం : డీఆర్‌సీ ఏడీఏ జయరామలక్ష్మి
- ముందస్తు బుకింగ్‌తో రైతులకు సకాలంలో ఎరువుల సరఫరా : ఏవో రుచిత

ప్రజాభూమి ప్రతినిధి, తాళ్లపూడి

తాళ్లపూడి మండలం వేగేశ్వరపురం రైతు సేవా కేంద్రంలో ఫ్రేమ్‌వర్క్ ఫర్ ఫెర్టిలైజర్ సేల్ విధానంపై రైతులకు అవగాహన, శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డీఆర్‌సీ ఏడీఏ జయరామలక్ష్మి మాట్లాడుతూ సబ్సిడీ ఎరువుల పంపిణీలో పారదర్శకత పెంపొందించి, నిజమైన సాగుదారులకు సకాలంలో ఎరువులు అందించాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఎఫ్ఎఫ్ఎస్ డిజిటల్ విధానాన్ని ప్రవేశపెట్టిందన్నారు. ఈ విధానం రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. ఎఫ్ఎఫ్ఎస్



మొబైల్ యాప్‌లో రైతులు తమ ఆధార్ లేదా ఫార్మర్ ఐడీ, భూమి వివరాలు, సాగు చేస్తున్న పంటల వివరాలను నమోదు చేసి అవసరమైన ఎరువులను ముందుగానే బుక్ చేసుకోవచ్చన్నారు. బుకింగ్ అనంతరం జనరేట్ అయ్యే క్యూఆర్ కోడ్ లేదా టోకెన్ నంబర్‌ను ఎంపిక చేసుకున్న ఎరువుల కేంద్రంలో చూపించి, ఈ-పోస్ యంత్రం ద్వారా ధ్రువీకరణ అనంతరం ఎరువులను పొందవచ్చని వివరించారు.



ఏకగ్రీవంగా ఎన్నికైన గ్రామ పంచాయతులకు అందించే ప్రోత్సాహకం పెంపు

ప్రజాభూమి బ్యూరో ఏలూరు జిల్లా

ఏకగ్రీవంగా ఎన్నికైన గ్రామ పంచాయతీలకు అందించే ప్రోత్సాహక మొత్తాలను రాష్ట్ర ప్రభుత్వం పెంచిందని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి చెప్పారు. ఏకగ్రీవంగా ఎన్నికైన సర్పంచ్, వార్డు సభ్యులున్న గ్రామ పంచాయతీలకు 5 వేల లోపు జనాభా ఉన్న పంచాయతీలకు 15 లక్షల రూపాయలు, 5,001 నుంచి 10 వేల జనాభా ఉన్న పంచాయతీలకు 25 లక్షల రూపాయలు, 10 వేలకు పైగా జనాభా ఉన్న పంచాయతీలకు 50 లక్షల రూపాయలు ప్రోత్సాహకంగా అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తరువులు జారీ చేసిందన్నారు. 2026 గ్రామ పంచాయతీ సాధారణ ఎన్నికలకు మాత్రమే ఈ ప్రోత్సాహకాలు పెంపు వర్తిస్తుందన్నారు. ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారులు అధికారికంగా ప్రకటించిన అనంతరం ప్రోత్సాహకాలను అందించడం జరుగుతుందన్నారు. గతంలో 2 వేల లోపు జనాభా కలిగిన గ్రామ పంచాయతీలు ఏకగ్రీవంగా ఎన్నికైతే 5 లక్షల రూపాయలు, 2001 నుండి 5000 జనాభా గ్రామ పంచాయతీలకు 10 లక్షల రూపాయలు, 5001 నుండి 10 వేల లోపు జనాభా కలిగిన గ్రామ పంచాయతీలకు 15 లక్షల రూపాయలు, 10 వేల జనాభా దాటిన గ్రామ పంచాయతీలకు 20 లక్షల రూపాయలు ప్రోత్సాహకాలుగా అందించే వారని, వాటిని రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుతం జనాభా ననుసరించి 15 లక్షల రూపాయల నుండి 50 లక్షల రూపాయల వరకు పెంచిందన్నారు. ఎన్నికల అధికారులు సర్పంచ్, అన్ని వార్డు సభ్యుల పదవులకు ఎన్నికలను ఏకగ్రీవంగా అధికారికంగా ప్రకటించిన గ్రామ పంచాయతీలకు మాత్రమే ఈ ప్రోత్సాహకం వర్తిస్తుందన్నారు. ప్రోత్సాహక మొత్తాన్ని విడుదల చేయడానికి ముందు, గ్రామ పంచాయతీల అర్హతను అధికారులు ధృవీకరించాలన్నారు. ప్రోత్సాహక మొత్తాన్ని, నిర్దేశించిన ఆర్థిక, అకౌంటింగ్, ఆడిట్ విధానాలకు లోబడి, సంబంధిత గ్రామ పంచాయతీల యొక్క ఆమోదించబడిన అభివృద్ధి కార్యకలాపాలు మరియు ప్రజా సంక్షేమ పనుల కోసం మాత్రమే వినియోగించాలన్నారు. ఏకగ్రీవంగా ఎన్నికైన గ్రామ పంచాయతీ పదవీకాలంలో, పెంచిన ప్రోత్సాహకాన్ని దశలవారీగా విడుదల చేయడం జరుగుతుందన్నారు. ఎన్నికల ప్రక్రియ పూర్తయిన తర్వాత ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించబడిన గ్రామ పంచాయతీల సంఖ్య ఆధారంగా, అర్హతగల గ్రామ పంచాయతీల జనాభా వర్గాల వారీ వివరాలను గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ సమర్పించాలన్నారు.

ఏకగ్రీవంగా సర్పంచ్‌గా ఎన్నుకుంటే గ్రామాభివృద్ధికి

2 ఎకరాల భూమి విరాళం!

- రౌతులపూడి గ్రామంలో వాసిరెడ్డి దంపతుల వినూత్న ప్రకటన.. గ్రామంలో చర్చనీయాంశంగా మారిన ఆఫర్

ప్రజాభూమి ప్రతినిధి, రౌతులపూడి

కోసం వినూత్న ప్రతిపాదనతో ముందుకొచ్చారు వాసిరెడ్డి శో భన్ బాబు కృష్ణ, వెంకట సుబ్బలక్ష్మి దంపతులు. కాకినాడ జి ల్లా రౌతులపూడి గ్రామ సర్పంచ్ పదవికి తమను ఏకగ్రీవంగా ఎన్నుకుంటే గ్రామాభివృద్ధి కోసం రెండు ఎకరాల భూమిని రాసిస్తామని ప్రకటించారు. గ్రామంలో ఎన్నికల వాతావరణం నెలకొన్న నేపథ్యంలో ఈ దంపతులు చేసిన ప్రకటన స్థానికం గా ఆసక్తికర చర్చకు దారితీసింది. గ్రామంలో ఐక్యతను



పెంపొందించడంతో పాటు, అభివృద్ధి కార్యక్రమాల కు తమ వంతు సహకారం అందించాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీ సుకున్నట్లు వారు తెలిపారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేస్తామని, ప్రజలకు అవ సరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తా మని హామీ ఇచ్చారు. గ్రామాభివృద్ధి, ప్రజా సంక్షేమమే తమ ప్రధాన లక్ష్యమని పేర్కొంటూ గ్రామ పెద్దలు, ప్రజలు తమ ప్రతిపాదనను పరిశీలించి సహకరించాలని కోరారు. సర్పంచ్ పదవిని ఏకగ్రీవం చేస్తే రెండు ఎకరాల భూమిని గ్రామాభి వృద్ధికి అందిస్తామంటూ చేసిన ఈ ప్రకటన ప్రస్తుతం రౌతుల పూడి గ్రామంలో హాట్ టాపిక్‌గా మారింది. ఈ ప్రతిపాదనపై గ్రామ ప్రజలు, పెద్దలు ఎలా స్పందిస్తారో వేచి చూడాలి.

మహిళా సాధికారతపై చర్చా కార్యక్రమం.. విపత్తు నిర్వహణపై వక్తృత్వ పోటీలు

ప్రజాభూమి ఏలూరు

59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఏలూరు జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఆరవ రోజు మహిళా సాధికారతపై చర్చా కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎం. శేఖర్ బాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లా వినియోగదారుల కమిషన్ సభ్యురాలు కె.ఎస్. నాగలక్ష్మి,జిల్లా కోర్టు అఫీషియల్ రిసీవర్ ఎం. ఇందిరా ప్రియదర్శిని ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.తొలుత మాజీ ప్రధాని ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



అనంతరం మహిళా సాధికారత,మహిళల హక్కులు,సమాన అవకాశాలపై చర్చించారు.అలాగే మధ్యాహ్నం సాహిత్య మండలి రామకృష్ణాపురం,ఏలూరు వారి ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు 'విపత్తు నిర్వహణ – సంసిద్ధ చర్యలు' అనే అంశంపై వక్తృత్వ పోటీలు నిర్వహించారు.ఈ పోటీలకు పురుషోత్తమరావు, సత్యవాణి,శ్రీనివాస్, ప్రముఖ రచయిత కళ్యాణశ్రీ న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు.కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్సీ రాము సూర్యారావు,డిప్యూటీ లైబ్రేరియన్ ఎ. నారాయణరావు, గ్రంథాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు,పాఠకులు పాల్గొన్నారు.

దెందులూరు ఎంపీపీ, ఎంపీటీసీల ప్రమాణ స్వీకార మహోత్సవం

- ఎంపీపీగా మోతుకూరి నరసింహ శోభన్ బాబు, వైస్ ఎంపీపీగా పెద్దిశెట్టి నాని

ప్రజాభూమి దెందులూరు

మండల పరిషత్ అధ్యక్షుడిగా (ఎంపీపీ) మోతుకూరి నరసింహ శోభన్ బాబు ప్రమాణ స్వీకారం చేశారు.ఈ సందర్భంగా నిర్వహించిన ప్రమాణ స్వీకార మహోత్సవానికి దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ముఖ్య అతిథిగా హాజరై, నూతన ఎంపీపీతో పాటు ఎంపీటీసీలకు శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ,ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు.దెందులూరు మండల అభివృద్ధికి సమష్టిగా కృషి చేయాలని, ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మోతుకూరి నాని మాట్లాడుతూ చల్ల చింతలపూడి



గ్రామంరుణం తీర్చుకోలేనిదని, తనను భారీ మెజారిటీతో గెలిపించారన్నారు. మండల ప్రజలకు ధన్యవాదాలు తెలుపుతూ త్రాగునీటి సమస్యలు లేకుండా, డ్రైన్లు తదితర సమస్యలు తన వద్దకు తీసుకుని వస్తే పుష్కరిస్తానని మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు,దెందులూరు జడ్ పి టి సి పెనుబోయిన మహేష్,కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎంపీపీ, ఎంపీటీసీలకు అభినందనలు తెలిపారు.



ఏలూరు రూరల్ ఎంపీపీగా గుత్తా శ్రీదేవి పిచ్చయ్య చౌదరి ప్రమాణ స్వీకారం

ప్రజాభూమి ఏలూరు

రూరల్ మండల పరిషత్ అధ్యక్షురాలిగా (ఎంపీపీ) గుత్తా శ్రీదేవి పిచ్చయ్య చౌదరి ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రమాణ స్వీకార మహోత్సవంలో దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ముఖ్య అతిథిగా పాల్గొని, నూతన ఎంపీపీతో పాటు ఎంపీటీసీలకు శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ, ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.ఏలూరు రూరల్ మండలంలోని అన్ని గ్రామాల అభివృద్ధికి సమిష్టిగా కృషి చేయాలని, ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించే దిశగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు,టి డి పి రూరల్ మండల అధ్యక్షులు నేతల రవి,టి డి పి నాయకులు నంబూరి నాగరాజు ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు,అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని నూతన ఎంపీపీ, ఎంపీటీసీలకు అభినందనలు తెలిపారు.

ఘనంగా ఝాన్సీ లక్ష్మీబాయి జయంతి వేడుకలు

ప్రజాభూమి ప్రతి నిధి పాలకొల్లు

పాలకొల్లు పట్టణంలోని జి.వి.ఎస్.వి.ఆర్. మున్సిపల్ మోడల్ ప్రైమరీ స్కూల్ లో స్వాతంత్ర్య సమరయోధురాలు, వీరనారి ఝాన్సీ లక్ష్మీబాయి 198వ జయంతి వేడుకలను బుధవారం అద్భుతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పాఠశాల ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించారు. ముందుగా ఝాన్సీ లక్ష్మీబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ... చిన్న వయసులోనే బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా పోరాడిన లక్ష్మీబాయి ధైర్యసాహసాలు నేటి తరం విద్యార్థులకు స్ఫూర్తిదాయకమని కొనియాడారు. "మేరీ ఝాన్సీ నహీ దూంగీ" అని నినదించిన వీర వనిత చరిత్ర ఎప్పటికీ చిరస్మరణీయమన్నారు. ఆడపిల్లలు చదువుతో పాటు ధైర్యంగా, ఆత్మవిశ్వాసంతో ఎదగాలని సూచించారు.



కార్యక్రమంలో విద్యార్థులు దేశభక్తి గీతాలు, వ్యాసరచన, ఉపన్యాస పోటీలలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ వేడుకల్లో ఉపాధ్యాయులు నందిని, మధుసూదన రెడ్డిలితదితరులు పాల్గొని విద్యార్థులను అభినందించారు. అనంతరం విద్యార్థులకు మిఠాయిలు పంపిణీ చేశారు.


ఆత్రేయపురం ఎంపీపీగా తోటకూర సుబ్బరాజు



- వైస్ ఎంపీపీగా మెర్ల గంగారావు ఎన్నిక

ప్రజాభూమి ప్రతినిధి కొత్తపేట

ఆత్రేయపురం మండల ప్రజా పరిషత్ నూతన పాలకవర్గం కొలువుదీరింది. గురువారం ఆత్రేయపురం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ, వైస్ ఎంపీపీ ఎన్నిక ప్రక్రియ నిర్వహించారు. మండలంలోని 19 మంది ఎంపీటీసీ సభ్యుల్లో మెజారిటీ సభ్యుల మద్దతు పొందిన ఉచ్చిలి ఎంపీటీసీ సభ్యుడు తోట కూర సుబ్బరాజు మండల పరిషత్ అధ్యక్షుడిగా (ఎంపీపీ) ఎన్నికయ్యారు. ర్యాలి-2 ఎంపీటీసీ సభ్యుడు మెర్ల గంగారావు



మండల పరిషత్ ఉపాధ్యక్షుడిగా (వైస్ ఎంపీపీ) ఎన్నికయ్యారు. ఎన్నికల ప్రక్రియ అనంతరం రిటర్నింగ్ అధికారి వి.ఆర్. రుద్ర, ఎంపీడీవో పి.వి.ఆర్.కె. రాజు, తహశీల్దార్ ఆర్.డి. రామ చంద్రమూర్తి సమక్షంలో నూతనంగా ఎన్నికైన ఎంపీపీ, వైస్ ఎంపీపీతో పాటు ఎంపీటీసీ సభ్యులచే ప్రమాణ స్వీకారం చేయించారు. దీంతో ఆత్రేయపురం మండల పరిషత్ నూతన పాలకవర్గం అధికారికంగా బాధ్యతలు స్వీకరించింది. ఈ సందర్భంగా నూతన ఎంపీపీ తోటకూర సుబ్బరాజు, వైస్ ఎంపీపీ మెర్ల గంగారావు, ఎంపీటీసీ సభ్యులకు మండల టీడీపీ అధ్యక్షుడు కూసంపూడి రామకృష్ణరాజు, జిల్లా ప్రాజెక్ట్ కమిటీ వైస్ చైర్మన్ కరుటూరి నరసింహారావు, వాడపల్లి దేవస్థానం చైర్మన్ ముదునూరి వెంకటరాజు, ముళ్లపూడి భాస్కరరావు, తెలుగు యువత అధ్యక్షుడు వెచ్చా అనిల్ కుమార్, జుజ్జువరపు హరిబాబు, పుల్లం రాజు వర్గ, మాజీ ఎంపీపీలు వాకలపూడి వెంకట కృష్ణారావు, పి.ఎస్. రాజు తదితర కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ఎంపీటీసీ ఎన్నికల్లో అధికారుల

పక్షపాత వైఖరిపై చట్టపరంగా పోరాడుతాం!

- టీడీపీ మండల అధ్యక్షులు అమరవరపు అశోక్

ప్రజా భూమి ప్రతినిధి వేలేరుపాడు

ఎంపీటీసీ ఎన్నికల్లో అధికారులు అధికార పార్టీకి అన్యాయం చేస్తూ వైసీపీకి కొమ్ముకాస్తూ పక్షపాత వైఖరి ప్రదర్శించడంపై చట్టపరంగా న్యాయపోరాటం చేస్తామని టిడిపి అధ్యక్షుడు అమరవరపు అశోక్ పేర్కొన్నారు. గురువారం ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలో విలేకరులతో మాట్లాడుతూ, పీసా చట్టం ప్రకారం మండలంలోని కట్కూరు ఎంపీటీసీ ఎన్నిక చెల్లదు అన్నారు. ఎంపీటీసీ ఎన్నికల్లో గెలుపొందిన సోడే సురేష్ అనే వ్యక్తి కోయిదా పీసా కమిటీ లో కార్యదర్శి గా ఉంటూ, తన పదవికి రాజీనామా చేయకుండా ఎన్నికల నామినేషన్ వేశారని తెలిపారు.ఎన్నికల నిబంధనల ప్రకారం పీసా కమిటీ సభ్యులు ఎన్నికల్లో పోటీ చేసినట్లైతే తమ పదవికి రాజీనామా సమర్పించాలని, రాజీనామా పత్రాన్ని ఐటీడీఏ పీవో నుండి ఆమోదిత పత్రాన్ని సంబంధిత రిటర్నింగ్ అధికారికి సమర్పించాల్సి ఉంటుందని వివరించారు. ఏ మాత్రం ఎన్నికల నిబంధనలు పాటించకుండా గెలుపొందిన కట్కూరు ఎంపీటీసీ సోడే సురేష్ ఎన్నిక చెల్లదని తెలిపారు.వైసీపీ నాయకులతో చేతులు కలిపిన ఇంచార్జీ ఎంపీడీఓ పోటీలో నిలిచిన అభ్యర్థుల తప్పుడు రాజీనామా



పత్రాలను మీడియా ప్రదినిధులకు చూపిస్తున్నారని ఆరోపించారు. స్థానిక ఎన్నికల అధికారులు అధికార పార్టీకి ద్రోహం చేశారని బహాటంగా ఆరోపించారు. తమ అభ్యర్థుల ప్రమేయం లేకుండానే ఫోర్జరీ సంతకాలతో రాజీనామా పత్రాలను ఉన్నతాధికారులకు సమర్పించారని,ఈ విషయంపై తాము న్యాయపరంగా పోరాడుతామన్నారు.ఈ విషయంపై మీడియా ముందర ఐటీడీఏ పీవో రాములు నాయక్ తో ఫోన్ లో మాట్లాడారు.జడ్ పీటీసీ,ఎంపీటీసీ ఎన్నికల్లో వేలేరుపాడు మండలం నుండి ఏ ఒక్క అభ్యర్థి తనకు పీసా కమిటీ రాజీనామా పత్రాలను సమర్పించ లేదని ఐటీడీఏ పీవో స్పష్టం చేశారు.ఈ విషయం పై జిల్లా కలెక్టర్ వెట్రి సెల్వి కి పిర్యాదు చేసినట్లు తెలిపారు.మధ్యాహ్నం వరకు ఎంపిడిఓ కార్యాలయం ఎదుట పార్టీ శ్రేణులతో ఆందోళన చేపట్టారు.కుక్కునూరు సీఐ



బాల సురేష్,యస్ ఐ రాజా రెడ్డి, వేలేరుపాడు ఎస్ఐ నవీన్ కుమార్ లు ఆందోళన పరిస్థితిని ఎప్పటికప్పుడు కట్టడి చేశారు.

గెలుపొందిన ఎంపీటీసీ అభ్యర్థులను ఎంపిడిఓ కార్యాలయం లోనికి పంపించడంతో నూతన ఎంపీపీగా బాడిస వెంకమ్మ ఎన్నిక జరిగింది. కాగా కూటమి తరపున ఎంపీటీసీలుగా ఎన్నికైన ముగ్గురు అభ్యర్థులు ప్రమాణ స్వీకార చేయకపోవడం విశేషం!ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు నూప శ్రీరాములు,కోటి పల్లి ముత్యాల రావు,కుక్కునూరు రాంబాబు, కొత్తపల్లి నరసింహారావు బాబులు, జనసేన మండల కార్యదర్శి మేచినేని సంజయ్, సిపిఐ మండల కార్యదర్శి బాడిస రాము, పిట్టా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఏలూరు జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఇందిరా గాంధీ జయంతి వేడుకలు



ప్రజాభూమి ఏలూరు

పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలా రెడ్డి ఆదేశాల మేరకు ఏలూరు జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో మాజీ ప్రధాని, దివంగత నాయకురాలు ఇందిరా గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు రాజనాల రామ్మోహనరావు కేక్ కట్ చేయగా,జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి కవులూరి చంద్రశేఖర్ పండ్లు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో నాయకులు ఇందిరా గాంధీ దేశానికి చేసిన సేవలు, అమలు చేసిన సంక్షేమ పథకాలను గుర్తు చేసుకున్నారు. దేశం కోసం తన ప్రాణాలను సైతం త్యాగం చేసిన ఆమె సేవలను కొనియాడారు.ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి దండు బోయిన చంద్రశేఖర్, గౌడు రంగబాబు,బ్లాక్-1 కాంగ్రెస్ అధ్యక్షుడు చెక్కా గుప్తా,బీసీ సెల్ అధ్యక్షుడు వెంకటరమణ,మాజీ అధికార ప్రతినిధి బురదకుంట క్రాంతి, ఏలూరు యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బురదగుంట లెవిన్ క్రిస్టియన్,ఏలూరు టౌన్ కిసాన్ సెల్ అధ్యక్షుడు కొమ్మన సాంబశివరావు, తాళ్లూరి చక్రవర్తి,పులి మార్కండేయులు, శావదండి సుబ్బారావుతో పాటు మహిళా కాంగ్రెస్, యువజన కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

టీడీపీ సీనియర్ నాయకుడు గుండాల దుర్గారావుకు ఘన సత్కారం



ప్రజాభూమి ఏలూరు

తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు గుండాల దుర్గారావును 44వ డివిజన్‌కు చెందిన ప్రజాప్రతినిధులు, జనసేన నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా సత్కరించారు.అనంతరం నాయకులు ఆయనతో ఆత్మీయంగా ముచ్చటించి, ఆయన సేవలను గుర్తుచేసుకున్నారు. కూటమి నాయకుల మధ్య పరస్పర గౌరవం, ఆత్మీయ సంబంధాలు,ఐక్యత మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో 44వ డివిజన్ కార్పొరేటర్ పలివెల అంబిక, హేమంత్ బాబు, జనసేన డివిజన్ ఇంచార్జ్ బొత్సా మధు, పలివెల రవి,డివిజన్ కార్యకర్తలు పాల్గొన్నారు.

లోపూడి గ్రామ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తా

- 2వ వార్డు స్వతంత్ర అభ్యర్థిగా దుబ్బాకు శివకుమార్ నామినేషన్

ప్రజాభూమి ఏలూరు

ముసునూరు మండలం లోపూడి గ్రామ పంచాయతీ ఎన్నికల్లో 2వ వార్డు స్వతంత్ర అభ్యర్థిగా దుబ్బాకు శివకుమార్ నామినేషన్ దాఖలు చేయనున్నట్లు ఒక ప్రకటనలో తెలిపారు.గ్రామ అభివృద్ధి, ప్రజా సంక్షేమమే తన ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. లోపూడి గ్రామంలో నెలకొన్న ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని తెలిపారు.ముఖ్యంగా గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పన, పారిశుధ్యం, తాగునీటి సమస్యల పరిష్కారంతో పాటు విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రత్యేక



దృష్టి సారిస్తానన్నారు.అలాగే రైతుల సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.2వ వార్డు అభివృద్ధికి అందరినీ కలుపుకొని ముందుకు సాగుతానని, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ సేవ చేస్తానని శివకుమార్ తెలిపారు.వార్డు ప్రజలందరూ తనను ఆదరించి,తమ అమూల్యమైన ఓటును వేసి గెలిపించాలని ఈ సందర్భంగా ఆయన విజ్ఞప్తి చేశారు.

సర్ సి.ఆర్. రెడ్డి మహిళా కళాశాలలో క్విజ్ పోటీ

ప్రజాభూమి ఏలూరు

సర్ సి.ఆర్. రెడ్డి మహిళా కళాశాలలో లైబ్రరీ సైన్స్ విభాగం, ఐక్యూఏసీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా గురువారం క్విజ్ పోటీ నిర్వహించారు. ఈ పోటీలో 42 మంది విద్యార్థినులు పాల్గొన్నారు. విద్యార్థినుల్లో సాధారణ జ్ఞానం, విషయ పరిజ్ఞానం, ఆలోచనా శక్తి, జ్ఞాపక శక్తి, సమయస్ఫూర్తిని పెంపొందించడమే ఈ పోటీ ముఖ్య ఉద్దేశమని నిర్వాహకులు తెలి పారు.



ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ కిలారు ప్రభాకరరావు, ప్రిన్సిపాల్ జి. సరళ, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ పి. హిమబిందు, విద్యార్థినులు పాల్గొన్నారు.

ప్రజాభూమి
అనంతపురం,శ్రీసత్యసాయి జిల్లా 6
శుక్రవారం 20 నవంబరు 2026

పుట్లూరులో ఎంపీటీసీల ప్రమాణ స్వీకారం

ఎంపీపీగా స్వరూప, వైస్ ఎంపీపీగా పెద్దయ్య కళ్యాణి




ప్రజాభూమి, పుట్లూరు.
పుట్లూరుమండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం నందు గురువారం ఎంపీటీసీల ప్రమాణ స్వీకారం కార్యక్రమం నిర్వహించడం జరిగినది. పుట్లూరు మండలంలో జరిగిన ఎంపీటీసీ ఎన్నికలలో విజయం సాధించిన 11 మంది సభ్యులతో ఎన్నికల రిటర్నింగ్ అధికారి నాగరాజు ప్రమాణ స్వీకారం చేయించారు. ఎంపీటీసీ సభ్యులు ఎంపీపీగా స్వరూపాను బలపరచడంతో ఎంపీపీగా స్వరూపతో ప్రమాణ స్వీకారం చేయించారు. అలాగే వైస్ ఎంపీపీ గా పెద్దయ్య గారి కళ్యాణిని బలపరచడంతో వైస్ ఎంపీపీ గా ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం సమావేశం నిర్వహించారు. మండలంలోని ప్రజా సమస్యలపై అధికారులతో సమన్వయంతో పరిష్కరించుకొని ముందుకు వెళ్తామని వారు తెలిపారు. ఎంపీపీని మరియు వైస్ ఎంపీపీని ఎంపీడీవో అలివేలమ్మ, తహసిల్దార్ బాలమ్మ శాలువాలు పూల మాలలతో సత్కరించారు. అనంతరం టిడిపి నేతలు కూటమి నాయకులు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. గెలుపొందిన ఎంపిటిసి అభ్యర్థులు తమ గెలుపుకు సహకరించిన ప్రతి ఒక్కరికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. మమ్మల్ని గెలిపించినందుకు గ్రామాలలో త్రాగునీరు, మరియు పారిశుద్ధ్య పనుల ప్రత్యేక శ్రద్ధ చూపి ఎలాంటి సమస్యలు రాయకుండా తమ వంతు కృషి చేస్తామని వారు తెలిపారు.

59 వ గ్రంథాలయ వారోత్సవాలు

శ్రీమతి ఇందిరా గాంధీ జయంతి, జాతీయ సమైక్యత దినోత్సవం



ప్రజాభూమి, పుట్లూరు
59 వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా ఈ రోజు పుట్లూరు శాఖ గ్రంథాలయం నందు 6 వ రోజు స్వాతంత్ర సమరయోధురాలు శ్రీమతి ఝాన్సీ లక్ష్మీబాయి, తొలి మహిళా ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధీ జన్మదినాన్ని పురస్కరించుకొని మహిళలు వారి అభ్యున్నతి పై సెమినార్ నిర్వహించడమైనది. ఈ కార్యక్రమంలో పాఠకులు భూమిరెడ్డి ప్రదీప్ రెడ్డి లైబ్రేరియన్ ప్రకాష్ రెడ్డి దుర్గాబాయి, సరోజినీ నాయుడు ,ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. తదుపరి స్వాతంత్రోద్యమంలో పాల్గొన్న వీర వనిత లు ఝాన్సీ లక్ష్మీబాయి సరోజినీ నాయుడు, సంఘ సేవకురాలు మదర్ థెరిస్సా, సావిత్రిబాయి పూలే, మొదలగు వారి గురించి మననం చేసుకోవడము జరిగింది. మహిళలు అన్ని రంగాలలో ఇంకా ముందుకు రావాలని మహిళల అభివృద్ధి చెందితేనే దేశం ప్రగతి పథంలో ముందుకు పోతుందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పాఠకులు ప్రదీప్ రెడ్డి ,లక్ష్మి రెడ్డి , బాబయ్య , విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

గూగూడు కుళ్లాయిస్వామి దేవస్థానం ఇన్‌చార్జి ఈఓగా బి.ఆర్. వెంకటేశులు బాధ్యతల స్వీకరణ

చైర్మన్ నాగరాజు, ఆలయ కర్తల సమక్షంలో బాధ్యతల స్వీకరణ



ప్రజా భూమి -- నార్పల
ప్రముఖ పుణ్యక్షేత్రమైన గూగూడు శ్రీ కుళ్లాయిస్వామి దేవస్థానం ఇన్‌చార్జి కార్యని ర్వహణాధికారిగా (ఈఓ) బి.ఆర్. వెంకటేశులు గురు వారం బాధ్యతలు స్వీకరిం చారు. దేవస్థాన చైర్మన్ నాగరాజు, ఆలయ కర్తల సమక్షంలో ఆలయంలో అధికారికంగా బాధ్యతలు చేపట్టారు.ఈ సందర్భంగా దేవస్థాన పరిపాలనా వ్యవహారాలు, ఆలయ నిర్వహణ, అభివృద్ధి కార్యక్రమాలు, భక్తులకు కల్పించాల్సిన సౌకర్యాలపై చర్చించారు. గూగూడు కుళ్లాయిస్వామి క్షేత్రానికి నిత్యం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు విచ్చేస్తుండటంతో వారికి ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు.దేవస్థాన అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ ఆలయ నిర్వహణను మరింత మెరుగుపరిచే దిశగా కృషి చేయాలని చైర్మన్ నాగరాజు ఆకాంక్షించారు. బాధ్యతలు స్వీకరించిన ఇన్‌చార్జి ఈఓ బి.ఆర్. వెంకటేశులుకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన చైర్మన్ నాగరాజు, ఆలయ కర్తలు లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నార్పల గ్రంథాలయంలో ఘనంగా మహిళా దినోత్సవం

మదర్ థెరిసా, ఝాన్సీ లక్ష్మీబాయి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు.. మహిళలకు ఘన సన్మానం



ప్రజా భూమి -- నార్పల:
59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా నార్పల శాఖ గ్రంథాలయంలో గురువారం మహిళా దినోత్స వ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రంథాలయ అధికారి ఏ. కావేరి ఆధ్వర్యం లో జరిగిన ఈ కార్యక్రమంలో మదర్ థెరిసా, ఝాన్సీ లక్ష్మీబాయి చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సమాజంలో మహిళల పాత్ర, మహిళా సాధికారత, విద్యా రంగంలో మహిళల ప్రాధాన్యతను వివరించారు. వివిధ రంగాల్లో సేవలందిస్తున్న మహిళా ఉపాధ్యాయులను శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. ఈఎల్ఈ పాఠశాల ఉపాధ్యాయులు రాజేశ్వరి, మేతాజ్ బేగం, కృష్ణవేణి పాఠశాల ఉపాధ్యాయులను సత్కరించారు. అలాగే ఉన్నత పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. విద్యార్థుల్లో సృజనాత్మకతను, రచనా నైపుణ్యాలను పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మల్లికార్జున, తెలుగు ఉపాధ్యాయుడు నాగప్ప, ఉపాధ్యాయులు ఆంజనేయులు, సోషల్ టీచర్ షఫీద్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు. సుమారు 35 మంది గ్రంథాలయ పాఠకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం మండలాధ్యక్షులుగా మంజునాథ్

-ఉపాధ్యక్షులుగా అశోక్ కుమార్‌కు బాధ్యతలు-పోటీ లేకుండానే ఇద్దరికీ పగ్గాలు



ప్రజాభూమి, హిందూపురం టౌన్
హిందూపురం రూరల్ మండల పరిషత్‌లో నూత న పాలకవర్గం కొలువుదీరింది. మండల పరిషత్ అధ్యక్షులుగా ఎన్.మంజునాథ్, ఉపాధ్యక్షులుగా అశోక్ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎంపీపీ, వైస్ ఎంపీపీ పదవులకు ఒక్కొక్క నామినే షన్ మాత్రమే దాఖలు కావడంతో ఎన్నిక ఏకగ్రీవ మైంది. గురువారం ఎంపీడీఓ కార్యాలయంలోని మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎన్నికల అధికారి శివానంద నాయక్ ఆధ్వర్యంలో ఈ ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా నిర్వహించారు. తొలుత మండల పరిధిలోని 15 ఎంపీటీసీ స్థానాల్లో విజయం సాధించిన సభ్యులతో ఎన్నికల అధికారి ప్రమాణ స్వీకారం చేయించారు. అనంత రం ఎంపీపీ, వైస్ ఎంపీపీ ఎన్నికల ప్రక్రియను చేపట్టారు. ఎంపీపీ అభ్యర్థిగా ఎన్. మంజునాథ్ తన బి.ఫారాన్ని ఎన్నికల అధికారి శివానంద నాయక్‌కు అందజేశారు. బేవినహళ్లి ఎంపీటీసీ అంజన్‌రెడ్డి మంజునాథ్ పేరును ప్రతిపాదించగా, కొటిపి ఎంపీటీసీ చౌడప్ప బలపరిచారు. మరెవరూ నామినేషన్ దాఖలు చేయకపోవడంతో మంజునాథ్‌ను ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి ప్రకటించారు. అనంతరం వైస్ ఎంపీపీ ఎన్నిక నిర్వహించారు. అశోక్ కుమార్ అభ్యర్థిత్వాన్ని మలుగూరు ఎంపీటీసీ భారతి ప్రతిపాదించగా, జయరామప్ప బలపరిచారు. ఈ పదవికి కూడా మరో అభ్యర్థి పోటీలో లేకపోవ డంతో అశోక్ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి ప్రకటించారు.

నూతన పాలకవర్గానికి ఘన సన్మానం..

ఎంపీపీగా ఎన్నికైన మంజునాథ్ బాధ్యతలు స్వీకరిస్తూ అధికారిక రిజిస్టరులో సంతకం చేశారు. అనంతరం నూతన ఎంపీపీ, వైస్ ఎంపీపీతో పాటు ఎంపీటీసీ సభ్యులను మండల పరిషత్ అధికారులు ఘనంగా సన్మానించారు. టీడీపీ నాయకులు, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ వ్యక్తిగత కార్యదర్శులు డాక్టర్ సురేంద్ర, బాలాజీ, రూరల్ మండల కన్వీనర్ రాము, జెడ్పీటీసీ భాగ్యలక్ష్మి తదితరులు నూతన పాలకవర్గాన్ని అభినందించి సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ వ్యక్తిగత కార్యదర్శి డాక్టర్ సురేంద్రబాబు మాట్లాడుతూ, నూతనంగా ఎన్నికైన ఎంపీపీ, వైస్ ఎంపీపీ, ఎంపీటీసీ సభ్యులంతా సమన్వయంతో పనిచేస్తూ హిందూపురం రూరల్ మండల అభివృ ద్ధికి కృషి చేయాలని సూచించారు. గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, తాగునీరు, రహదారులు, పారిశుద్ధ్యం, విద్య, వైద్యం వంటి మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ప్రజాప్రతినిధులు ప్రజలకు అందుబాటులో ఉంటూ, వారి ఆకాం క్షలకు అనుగుణంగా పనిచేయాలని తెలిపారు. మండల అభివృద్ధికి ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ సహకారం, మార్గదర్శకత్వం ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ దామోదరమ్మ, డిప్యూటీ ఎంపీడీఓలు శివకుమార్, నారాయణ, మండల పరిషత్ అధికారులు, ప్రజాప్రతినిధులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఆర్ఆర్ కాలనీలో బీహార్ ముఠా కలకలం.. -ఆరుగురిలో ఒకరిని పట్టుకున్న కాలనీవాసులు

-పోలీసుల తీరుపై విస్మయం



ప్రజాభూమి, హిందూపురం టౌన్
దొంగతనాలను అరికట్టాల్సిన పోలీసులకు స్థానికులే దొంగలను పట్టించి అప్పగించాల్సిన పరిస్థితి నెలకొంది. హిందూపురం టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పులమతి రోడ్డు సమీపంలో ఉన్న ఆర్ఆర్ కాలనీలో వరుస చోరీలు, దొంగల సంచారం కాలనీవాసులను భయాందోళనలకు గురిచేస్తోంది. బుధవారం అర్ధరాత్రి దాటిన తర్వాత బీహార్‌కు చెందిన ఆరుగురు వ్యక్తులు కాలనీలోని ఇళ్లలో చోరీలకు యత్నించినట్లు స్థానికులు చెబుతున్నారు. ఈ క్రమంలో వారిలో ఒకరిని కాలనీవాసులు పట్టుకొని విద్యుత్ స్తంభానికి కట్టేసి పోలీసులకు సమాచారం అందించారు. అయితే నిందితుడిని తీసుకెళ్లేందుకు గురువారం ఉదయం టూవీలర్‌పై ఒక్క కానిస్టేబుల్‌ను మాత్రమే పంపించడంతో పోలీసుల తీరుపై స్థానికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. కాలనీలో ఇప్పటికే నాలుగు ఇళ్లలో దొంగలు తాళాలు పగలగొట్టి చోరీలకు పాల్పడినట్లు స్థానికులు వెల్లడిస్తున్నారు. గత జనవరిలో తులసి నాయక్ అనే ఉపాధ్యాయుడి ఇంటి కిటికీ ఊచలు తొలగించి సుమారు 12 తులాల బంగారంతో పాటు నగదును దోచుకెళ్లారు. ఈ ఘటనపై ఇప్పటివరకు దర్యాప్తులో ఎలాంటి పురోగతి కనిపించడం లేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వారం రోజుల క్రితం సైతం ఓ మహిళ ఇంటి తాళాలు పగలగొట్టి దొంగలు చోరీకి పాల్పడినట్లు చెబుతున్నారు. ఇలా వరుసగా చోరీలు జరుగుతున్నా పోలీసుల నుంచి ఆశించిన స్థాయిలో స్పందన కనిపించడం లేదని కాలనీవాసులు విమర్శిస్తున్నారు. దొంగలకు సంబంధించిన సీసీ కెమెరా ఫుటేజీలను సైతం స్థానికులు టూటౌన్ ఇన్‌స్పెక్టర్‌కు పంపించినట్లు తెలిపారు. అయినా ఇప్పటివరకు ఆ ప్రాంతంలో పోలీసు బీట్ నిర్వహించడం లేదని ఆరోపిస్తున్నారు. రాత్రి వేళల్లో గుర్తుతెలియని వ్యక్తులు సంచరిస్తున్నా నిఘా కొరవడిందని, దీంతో దొంగలకు అనుకూలంగా మారుతోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇక బుధవారం అర్ధరాత్రి పట్టుబడిన నిందితుడిని తీసుకెళ్లేందుకు పోలీసులు వ్యవహరించిన తీరు మరింత చర్చనీయాంశంగా మారింది. స్థానికులు దొంగను పట్టుకున్నామని, వచ్చి తీసుకెళ్లాలని సమాచారం అందిస్తే కనీసం పోలీసు జీపును కూడా పంపకుండా ఒక్క కానిస్టేబుల్‌ను టూవీలర్‌పై పంపించడంపై వారు ప్రశ్నిస్తున్నారు. టూవీలర్ నడుపుతున్న కానిస్టేబుల్ వెనుక నిందితుడిని కూర్చోబెట్టి ఎలా పోలీస్ స్టేషన్‌కు తరలిస్తారని, మార్గమధ్యంలో నిందితుడు తప్పించుకునే ప్రమాదం ఉంటే బాధ్యత ఎవరిదని నిలదీస్తున్నారు. చివరకు స్థానికులే మరో వ్యక్తిని కానిస్టేబుల్‌తో పాటు పంపించి, నిందితుడిని అదుపులో ఉంచుతూ టూటౌన్ పోలీస్ స్టేషన్‌కు తరలించడంలో సహకరించాల్సి వచ్చిందని తెలిపారు. చోరీలు జరిగినప్పుడు బాధితులు పోలీసులను ఆశ్రయించడం, సీసీ ఫుటేజీలు అందించడం, అనుమానితులను పట్టించి అప్పగించడం కూడా ప్రజలే చేయాల్సి వస్తే పోలీసుల గస్తీ, నిఘా వ్యవస్థలు ఎందుకనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. స్థానికులే దొంగలను పట్టుకొని అప్పగించిన తర్వాత ప్రత్యేక బృందాలతో గాలించి ముఠాను పట్టుకున్నట్లు ప్రకటనలు చేయడం కంటే, ముందుగానే నిఘా పెట్టి చోరీలను అరికట్టడంపై పోలీసులు దృష్టి సారించాలని కాలనీవాసులు కోరుతున్నారు. ఆర్ఆర్ కాలనీలో వరుస చోరీలపై ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించి, గతంలో జరిగిన చోరీ కేసులను ఛేదించడంతో పాటు రాత్రి వేళల్లో పోలీసు గస్తీని పెంచాలని, ప్రజలకు భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు.

నార్పల ఎంపీపీగా స్వాతిలత రెడ్డి ప్రమాణ స్వీకారం

వైస్ ఎంపీపీగా అంకాల శ్రావణి ఏకగ్రీవ ఎన్నిక..

25 ఏళ్ల వయస్సులోనే కీలక బాధ్యతలు



ప్రజా భూమి -- నార్పల,
నార్పల మండల పరిషత్ కార్యాలయం లో గురువారం నూతనంగా ఎన్నికైన 16 మంది ఎంపీటీసీ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలపరిచిన ఎంపీటీసీ సభ్యుల మద్దతుతో నార్పల ఎంపీటీసీ స్వాతిలత రెడ్డి ఎంపీపీగా, అంకాల శ్రావణి వైస్ ఎంపీపీగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం వారిద్దరూ అధికారికంగా ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎంపీపీ స్వాతిలత రెడ్డి మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు. తనపై నమ్మకంతో ఓట్లు వేసి గెలిపించిన నార్పల మండల ప్రజలకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటానని అన్నారు. తనను ఎంపీపీగా ఎన్నుకున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంపీటీసీ సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. తనకు ఈ అవకాశం కల్పించిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, అనంత వెంకటరామిరెడ్డి, సింగనమల నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ శైలజానాథ్, నార్పల సత్యనారాయణ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఇదిలా ఉండగా, వైస్ ఎంపీపీగా ఎన్నికైన అంకాల శ్రావణి కేవలం 25 ఏళ్ల వయస్సులోనే కీలకమైన ప్రజాప్రతినిధి బాధ్యతలు చేపట్టడం విశేషంగా నిలిచింది. చిన్న వయస్సులోనే మండల స్థాయి పదవిని చేపట్టడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమాన్ని ఎన్నికల అధికారి (ఆర్వో) భారతి పర్యవేక్షించగా, ఎంపీడీవో మమతా దేవి, మండల తహసీల్దార్ అరుణకుమారి తదితర అధికారులు పాల్గొన్నారు. నూతనంగా ఎన్నికైన ఎంపీపీ, వైస్ ఎంపీపీ, ఎంపీటీసీ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.

గడ్డంనాగేపల్లి సర్పంచ్ బరిలో రేగటి చిన్నరామయ్య.. నామినేషన్ దాఖలు

గ్రామ అభివృద్ధే లక్ష్యంగా ఎన్నికల సమరానికి సిద్ధం.. ప్రజల ఆదరణతో ముందడుగు



ప్రజా భూమి – నార్పల
నార్పల మండలం గడ్డంనాగేపల్లి గ్రామ సర్పంచ్ ఎన్నికల బరిలోకి రేగటి చిన్నరామయ్య దిగారు. గ్రామ సర్పంచ్ పదవికి అభ్యర్థిగా గురువారం అధికారులకు తన నామినేషన్ పత్రాలను సమర్పించారు. గ్రామంలో ప్రజా సమస్యల పరిష్కారం, అభివృద్ధి కార్యక్రమాలకు ప్రాధాన్యత కల్పించాలనే లక్ష్యంతో ఎన్నికల బరిలో నిలిచినట్లు తెలిపారు.గ్రామంలో తాగునీరు, పారిశుధ్యం, సీసీ రోడ్లు, వీధి దీపాలు తదితర మౌలిక సదుపాయాల కల్పనతో పాటు అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేయడమే తన ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. గ్రామ ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించే విధంగా పనిచేస్తానని తెలిపారు.సర్పంచ్ ఎన్నికల్లో తనకు ఒక అవకాశం కల్పించి ఆశీర్వదించాలని రేగటి చిన్నరామయ్య గ్రామ ప్రజలను కోరారు. నామినేషన్ దాఖలుతో గడ్డంనాగేపల్లిలో గ్రామ పంచాయతీ ఎన్నికల సందడి మొదలైంది.

రంగాపురం సర్పంచ్ బరిలో కొండల నాయుడు.. నామినేషన్ దాఖలు

మండల పార్టీ నాయకుడిగా గుర్తింపు.. గ్రామ పంచాయతీ ఎన్నికల బరిలోకి



ప్రజా భూమి -- నార్పల:
నార్పల మండల పరిధిలోని రంగాపురం గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో సర్పంచ్ పదవికి మండల పార్టీ నాయకుడు కొండల నాయుడు ఎన్నికల బరిలో నిలిచా రు. ఈ మేరకు గురువారం సర్పంచ్ అభ్యర్థి గా ఎన్నికల అధికారులకు తన నామినేషన్ పత్రాలను సమర్పించారు.గ్రామ పంచాయ తీ ఎన్నికల ప్రక్రియ ప్రారంభం కావడంతో రంగాపురంలో రాజకీయ సందడి నెలకొంది. ఈ నేపథ్యంలో కొండల నాయుడు సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలుచేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. గ్రామ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఎన్నికల బరిలోకి దిగారు.నామినేషన్ దాఖలుతో రంగాపురం గ్రామంలో ఎన్నికల వేడి మొదలైంది. రానున్న రోజుల్లో ఎన్నికల ప్రచారం మరింత ఊపందుకునే అవకాశం ఉంది.

మహిళా సాధికారతతోనే అభివృద్ధి

-ఝాన్సీ లక్ష్మీబాయి, ఇందిరా గాంధీ లకు ఘన నివాళి



ప్రజాభూమి, హిందూపురం టౌన్
మహిళలు అన్ని రంగాల్లో అభి వృద్ధి సాధించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ప్రభుత్వం మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అంజలీదేవి సూచించారు. గురు వారం రాణి ఝాన్సీ లక్ష్మిబాయి, ఇందిరాగాంధీ జయంతి వేడుక లను కళాశాల మహిళా సాధికారత విభాగం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఝాన్సీ లక్ష్మీబాయి, ఇందిరాగాంధీల చిత్రపటాలకు పూలమాలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ప్రిన్సిపాల్ అంజలీదేవి మాట్లాడుతూ, రాణి లక్ష్మీబాయి ధైర్య సాహసాలు, దేశభక్తి, త్యాగనిరతి స్వాతంత్ర్య సంగ్రామంలో ఆమె పోషించిన పాత్రను స్మరించుకున్నారు. అదే విధంగా ఇందిరా గాంధీ రాజకీయ ప్రస్థానం, దేశ ప్రధానిగా ఆమె అందించిన సేవలు, నాయకత్వ లక్షణాలను విద్యార్థినులకు తెలియజేశారు. ఇద్దరు మహనీయులు నవంబర్ 19 వ తేదీనే జన్మించటం విశేషమని, వారి జీవితాలు విద్యార్థినులలో ధైర్యం, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు, దేశాసేవాభావనను పెంపొందించటానికి స్ఫూర్తినిస్తాయని వక్తలు పేర్కొన్నారు. విద్యార్థినులు గొప్ప లక్ష్యాలను నిర్దేశించుకొని, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల మహిళా సాధికారత విభాగం సమన్వయకర్త డా. వై. బి. నాగమణి, అధ్యాపకులు డా. యశోద రాణి, డా శ్రీలక్ష్మి ఆఫ్సానా కళాశాల సీనియర్ అసిస్టెంట్ బి. నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్లపై చెత్త వేస్తే రూ.2 వేల జరిమానా

-ఇంటింటికీ ఈ-ఆటోల ద్వారా చెత్త సేకరణ..

-నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు

-మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున



ప్రజాభూమి, హిందూపురం టౌన్
పట్టణ పరిశుభ్రతకు విఘాతం కలిగిస్తూ రోడ్లు, వీధులు, ఖాళీ స్థలాలు, డ్రైనేజీల్లో చెత్త వేస్తే ఇకపై జరిమానా తప్పదని హిందూపురం మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున స్పష్టం చేశారు. ఇంటింటికీ, వ్యాపార సంస్థల వద్దకే వచ్చి చెత్త సేకరించేలా మున్సిపాలిటీ ఈ-ఆటోలను ఏర్పాటు చేసినప్పటికీ బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయడం నిబంధనల ఉల్లంఘన కిందకు వస్తుందని హెచ్చరించారు. గురువారం ఆయన పట్టణ ప్రజలకు, వ్యాపారస్తులకు ఈ మేరకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, పట్టణంలో ప్రతిరోజూ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఈ-ఆటోల ద్వారా ప్రతి ఇంటి వద్దకు, వ్యాపార సంస్థలు, దుకాణాల వద్దకు వెళ్లి చెత్త సేకరిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు తమ ఇళ్లలో, దుకాణాల్లో ఉ త్పత్తయ్యే చెత్తను నేరుగా ఈ-ఆటోలకు మాత్రమే అందించాలని సూచించారు. రోడ్లపై, వీధుల్లో, ఖాళీ స్థలాల్లో, డ్రైనేజీల్లో లేదా బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయడం వల్ల పరిసరాలు అపరిశు భ్రంగా మారడమే కాకుండా ప్రజారోగ్యానికి కూడా ఇబ్బందులు కలుగుతాయని పేర్కొన్నారు. నిబంధనలు ఉల్లంఘించి బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేసే వారిపై సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ రూల్స్--2026 ప్రకారం రూ.1,000 నుంచి రూ.2,000 వరకు జరిమానా విధించనున్నట్లు వెల్లడించారు. పరిశుభ్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అదేవిధంగా తమ ఇళ్ల వద్దకు లేదా వ్యాపార సంస్థల వద్దకు చెత్త సేకరణ ఈ-ఆటోలు రాకపోతే ప్రజలు ఆందోళన చెందకుండా వెంటనే మున్సిపాలిటీ కమాండ్ కంట్రోల్ రూమ్ టోల్‌ఫ్రీ నంబర్ 18004252633 కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. ప్రజలకు చెత్త సేకరణ సేవలు అందుబాటులో ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. హిందూపురం పట్టణాన్ని పరిశుభ్రంగా, ఆరోగ్యకరంగా తీర్చిదిద్దడం మున్సిపాలిటీ ఒక్కదాని బాధ్యత మాత్రమే కాదని, ప్రతి పౌరుడి భాగస్వామ్యం అవసరమని కమిషనర్ పేర్కొన్నారు. జరిమానాల బారిన పడకుండా ఉండటమే కాకుండా స్వచ్ఛమైన పట్టణ నిర్మాణంలో భాగస్వాములు కావాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

ప్రజాభూమి
వైఎస్ఆర్ కడప, శ్రీ అన్నమ్మయ్య 7
శుక్రవారం 20 నవంబరు 2026

వైకాపా నాయకులు మారణాయుధాలతో దాడి చేశారు - బిటెక్ రవి

పులివెందులలో వైకాపా డ్రామాలకు కాలం చెల్లింది - కేసులలో ఉన్న వైకాపా నాయకులను వెంటనే అరెస్ట్ చేయాలి

ప్రజాభూమి, పులివెందుల



వైకాపా నాయకులు తెలుగుదేశం పార్టీ నాయకులపై మారణాయుధాల తో దాడులు చేశారని, పులివెందులలో వైకాపా డ్రామాలకు కాలం చెల్లిందని, కేసులలో ఉన్న నిందితులు స్వేచ్ఛగా తిరుగుతున్నారని పులివెందుల నియోజకవర్గ ఇన్చార్జ్ బిటెక్ రవి అన్నారు.గురువారం తెలుగు దేశం పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావే శంలో ఆయన మాట్లాడుతూ పులివెందులలో ఏదో జరిగిపోతోందని వైకాపాకు సంబంధించిన ఛానల్, వైకాపా నేతలు దుష్ప్రచారం చేస్తున్నారని అన్నారు.నామినేషన్ల కోసం ఇరవై ఒకటి మందికి పోలీసు రక్షణ కావాలని, నామినేషన్ కేంద్రాలను కడపకు మార్చాలని వైకాపా వారు హైకోర్టును ఆశ్రయించడం జరిగిందని అన్నారు. నామినేషన్ కేంద్రాలను మార్చడం సాధ్యం కాదని స్పష్టం చేసిన హైకోర్టు, అభ్యర్థితో పాటు ఇద్దరు ప్రతిపాదకులు మాత్రమే లోపలికి వెళ్లేలా పోలీసు ఎస్కార్ట్ కల్పించాలని ఆదేశించిందని అన్నారు.కోర్టు ఆర్డర్ రాత్రి ఎనిమిది గంటలకు రాగా, అంతకుముందే సాయంత్రం ఐదు గంటలకే ఆ ఇరవై ఒకటి మందిలో పదమూడు మంది ఎటువంటి రక్షణ లేకుండానే ప్రశాంతంగా నామినేషన్లు దాఖలు చేశారని, దీన్నిబట్టే వారు కోర్టును, ఎన్నికల సంఘాన్ని తప్పుదోవ పట్టించారని ఆయన విమర్శించారు.పోలీసులు తమకు అడ్డుపడుతున్నారని వైకాపా నేతలు ఆరోపించడం హాస్యాస్పదంగా ఉందని అన్నారు. ఎంపీ అవినాష్ రెడ్డి స్వయంగా 307 హత్యాయత్నం కేసులో నిందితుడిగా ఉన్న కొమ్మద్ది నరసింహారెడ్డిని వెంటబెట్టుకుని డీఎస్పీ ఆఫీసుకు వెళ్లి, ముందస్తు అరెస్ట్ అయిన వారికి పూచీకత్తు ఇచ్చి విడిపించుకుని తీసుకెళ్లారని సీసీ కెమెరాల్లో రికార్డు అయినట్లుగా ఆయన పేర్కొన్నారు. వేంవల్లి ఆనువత్రి పరామర్శలోనూ అవినాష్ రెడ్డి పక్కనే 307 కేసులో నిందితుడైన వేముల జడ్పీటీసీ భర్త పెర్నపాడు సాంబశివరెడ్డి కూర్చున్నారని, నిందితులు ఇలా స్వేచ్ఛగా తిరుగుతుంటే పోలీసులు ఎవరికి వత్తాసు పలుకుతున్నట్లు అని ఆయన ప్రశ్నించారు. చక్రాయపేటలో దాదాపు మూడు వందల మంది వైకాపా కార్యకర్తలు ట్రాక్టర్లలో బీరు బాటిళ్లు, రాళ్లు, ఆయుధాలతో నామినేషన్ కేంద్రం వద్దకు వచ్చి హల్ చల్ చేశారని ఆయన అన్నారు. ట్రాక్టర్ను తమ కార్యకర్తలపైకి ఎక్కించడంతో ఇద్దరి కాళ్లు విరిగాయని, మరొకరికి తలకు తీవ్ర గాయాలయ్యాయని, అయినప్పటికీ ఇప్పటివ రకు ఆ ట్రాక్టర్ ను గానీ, డ్రైవర్ ను గానీ పోలీసులు అదువులోకి తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు.144 సెక్షన్ అమల్లో ఉన్నందున నామినేషన్ కేంద్రాల వద్దకు వందలాది మందిని అనుమతించలేమని పోలీసులు స్పష్టం చేశారని, సతీష్ రెడ్డి మూడు వందల నుంచి నాలుగు వందల మందితో రావాలనుకుంటే ఎలా కుదురుతుందని ఆయన అన్నారు.పులివెందుల, వేంపల్లి మండలాల్లో చాలా వరకు నామినేషన్లు నజావుగా జరిగాయని, సింహాద్రిపురం మండలంలో అష్టమి తిథి కారణంగానే కొన్ని చోట్ల నామినేషన్లు వేయలేదని ఆయన వివరించారు. చివరగా, 307 కేసుల్లో నిందితులుగా ఉన్న అరాచక శక్తులను తక్షణమే అరెస్ట్ చేయాలని జిల్లా ఎస్పీ, పులివెందుల డీఎస్పీలను ఆయన కోరారు.

307 కేసుల్లో ఉన్న వారిని ఎందుకు అరెస్ట్ చేయలేదు

కళ్ళల్లో కారంపొడి కొట్టి పథకం ప్రకారం దాడి చేశారు -పులివెందుల పోలీస్ స్టేషన్ ముందు టిడిపి ధర్నా

ప్రజాభూమి, పులివెందుల



పులివెందుల నియోజకవర్గం, తొండూరు మండలం అగడూరులో బయటి ప్రాంతాల నుంచి వచ్చిన వ్యక్తులు పథకం ప్రకారం దౌర్జన్యాలకు పాల్పడ్డారని పులివెందుల టిడిపి నియోజకవర్గ ఇన్చార్జ్ బిటెక్ రవి, ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపా ల్ రెడ్డి, ఎంపీపీ దేవిరెడ్డి సంజీవరెడ్డి, తూగుట్ల మధుసూదన్ రెడ్డి అన్నారు.ఈ సందర్భంగా వారు పులివెందుల పట్టణంలోని అర్బన్ పోలీస్ స్టేషన్ సమీపంలో ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బిటెక్ రవి మాట్లాడుతూ మార్కెట్ కమిటీ చైర్మన్తో పాటు బండి రామసుర రెడ్డి, తుల సీనాథ్ రెడ్డిలపై కారం పొడి చల్లి వైకాపా నాయకు లు దాడులు చేశారని అన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ అపస్మారక స్థితికి చేరుకున్నారని అన్నారు. పరిస్థితి విషమించడంతో కడప రిమ్స్ కు తరలిం చడం జరిగిందని అన్నారు.నామినేషన్ వేయడానికి వెళ్లిన మహిళలపైనా దాడి చేసి, తమ వర్గానికి చెందిన నాలుగు నుంచి ఐదు వాహనాలను దగ్ధం చేశారని ఆయన మండిపడ్డారు.అధికార పక్షంలో ఉన్నప్పటికీ తాము ధర్నా చేయాల్సిన పరిస్థితి రావడానికి పోలీసుల ఉదాసీనతే కారణమ ని అన్నారు. గతంలో మూడు వందల ఏడు కేసుల్లో ముద్దాయి లుగా ఉన్న వారిపై ముందస్తు చర్యలు తీసుకోవాలని కోరినా, ఎస్పీ నుంచి ఆదేశాలు లేవం టూ పోలీసులు అరెస్టులు చేయలేదని విమర్శిం చారు. అగడూరు ఘటనలకు ఎంపీ అవినాష్ రెడ్డి పూర్తి బాధ్యత వహించాలని అన్నారు. గతంలో పోలీసు ఫైరింగ్ జరిగిన కేసులో ముద్దాయి లను అరెస్ట్ చేయకపోవడం వల్లే వారికి ధైర్యం వచ్చిందని, తప్పుడు ఫిర్యాదులతో హైకోర్టును, ఎన్నికల సంఘాన్ని తప్పుదోవ పట్టిస్తున్నారని ఆయ న అన్నారు.బాధ్యులపై చర్యలు తీసుకునే వరకు ధర్నా విరమించబోమని స్పష్టం చేశారు. నామి నేషన్ సందర్భంగా సుమారు ఆరు వందల నుంచి ఏడు వందల మంది బయటి వ్యక్తులు కారం పొడి, పెట్రోల్ బాంబులు, కర్రలు, రాళ్లు, రాడ్లతో దాడులు చేయడం జరిగిందని అన్నారు.మార్కెట్ యార్డ్ చైర్మన్ ను కాపాడే ప్రయత్నంలో తమకు కూడా గాయాలయ్యాయని, భయానక వాతావర ణం సృష్టించి ఎన్నికలను ఏకపక్షంగా జరుపు కోవాలని చూస్తున్నారని ఆయన పేర్కొన్నారు. గతంలో మూడు వందల ఏడు కేసులో ప్రస్తుతం తమ కార్యకర్తలపై దాడి చేసిన వారందరినీ వెంటనే అరెస్ట్ చేసే వరకు తాను ధర్నా చేస్తానని అన్నారు.

జడ్పీ చైర్పర్సన్, వైస్ చైర్పర్సన్ ఎన్నిక 20న మధ్యాహ్నం 1 గంటకు

కో-ఆప్టెడ్ సభ్యుల ఎన్నిక వాయిదా

జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా. శ్రీధర్ చెరుకూరి

ప్రజాభూమి ప్రతినిధి,కడప:

వైఎస్ఆర్ కడప జిల్లా పరిషత్ ఛైర్పర్సన్, వైస్ ఛైర్పర్సన్ ఎన్నికలు ఈ నెల 20వ తేదీన మధ్యాహ్నం 1 గంటకు నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా. శ్రీధర్ చెరుకూరి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ముందుగా నిర్ణయించిన ప్రకారం జెడ్పి ఛైర్పర్సన్, వైస్ ఛైర్పర్సన్ ఎన్నికలను నవంబర్ 20వ తేదీ ఉదయం 10 గంటలకు నిర్వహించాల్సి ఉంది. అయితే.. తాజాగా రాష్ట్ర ఎన్నికల సంఘం ఇచ్చిన ఆదేశాల మేరకు సమయాన్ని మార్పు చేసి 20వ తేదీ శుక్రవారం మధ్యాహ్నం 1 గంటకు ఎన్నికలను నిర్వహించనున్నట్లు తెలిపారు. అయితే, అదే రోజు జరగాల్సిన కో-ఆప్టెడ్ సభ్యుని ఎన్నిక వాయిదా పడిందని జిల్లా కలెక్టర్ తెలిపారు. కో-ఆప్టెడ్ సభ్యుని ఎన్నిక నిర్వహణ తేదీని.. తదుపరి రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఖరారు చేసి ప్రకటించడం జరుగుతుందన్నారు. కావున ఈ నెల 20వ తేదీన మధ్యాహ్నం 1 గంటకు జడ్పీ ఛైర్పర్సన్, వైస్ ఛైర్పర్సన్ ఎన్నికలు మాత్రమే నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు.


సిద్ధవటం ఎంపీపీగా అతికారి వినుత ఏకగ్రీవ ఎన్నిక



ప్రజాభూమి, సిద్ధవటం: సిద్ధవటం మండల పరిషత్ అధ్యక్షురాలిగా జనసేన పార్టీకి చెందిన అతికారి వినుత ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ఎన్నికల కార్యక్రమంలో మాధవరం-1 ఎంపీటీసీ చింతగింజల సుభాషిణి ఎంపీపీ అభ్యర్థిగా ఆమె పేరును బలపరచగా, జంగాలపల్లి ఎంపీటీసీ పాలెం వెంకటమ్మ ప్రతిపాదించారు. అన్ని ఎంపీటీసీ సభ్యులు చేతులెత్తి మద్దతు తెలపడంతో వినుత ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారి ఎన్. కృష్ణయ్య ఆమెతో ఎంపీపీగా ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం పొన్నవోలు ఎంపీటీసీ, టీడీపీ సభ్యురాలు జ్యోతి శివారెడ్డి వైస్ ఎంపీపీగా ప్రమాణ స్వీకారం చేశారు. అంతకుముందు మండలంలోని 11 మంది ఎంపీటీసీ సభ్యులతో ఆర్వో ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఫణి రాజకుమారి, డిప్యూటీ ఎంపీడీఓ మెహెతాబ్ యాస్మిన్ తదితరులు పాల్గొన్నారు.

50వేలకు అయ్యప్పస్వామి లడ్డును దక్కించుకున్న నల్లగాండువారి పల్లె సూరి

ప్రజాభూమి,పులివెందుల



పులివెందుల మండలం పరిధిలోని నల్లగొండ వారి పల్లె గ్రామంలో అంగరంగ వైభవంగా అయ్యప్ప స్వామి అంబలం పూజ కార్యక్రమాన్ని గురుస్వామి వెంకటరామిరెడ్డి, శీను స్వామి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ అంబలం పూజ కార్యక్రమంలో అయ్యప్ప స్వామి ప్రసాదం లడ్డును వేలంపాట నిర్వహించారు. నల్లగొండ వారి పల్లె గ్రామానికి చెందిన దేవ రింటి సూర్యనారాయణ (సూరి) 50 వేల రూపాయలు లడ్డును పాడి దక్కించుకున్నారు. ఈ సందర్భంగా గురుస్వామి లడ్డును సూరి తల పైన పెట్టి దుశ్శాలవాలతో, పూలహారా లతో సత్కరించారు. ఈ సందర్భంగా సూర్య మాట్లాడుతూ ఈ వేలంపాటలో స్వామివారి లడ్డుప్రసాదాన్ని దక్కించుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ లడ్డును అందరికీ పంపిణీ చేసి పంట పొలాలలో చల్లడం జరుగుతుందన్నారు. ఇలా చల్లడం వల్ల పంటలు బాగా చేతికొస్తాయని నమ్మకమన్నారు.

మడూరు సర్పంచ్ అభ్యర్థిగా హరిప్రియ నామినేషన్


గ్రామ అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తానని హామీ

ప్రజాభూమి, పులివెందుల



మడూరు గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా మాడూరు హరిప్రియ గురువారం నామినేషన్ దాఖలు చేశారు.ఈ సందర్భంగా హరిప్రియ మాట్లాడుతూ పులివెందుల తెలుగుదేశం పార్టీ ఇన్చార్జ్ బిటెక్ రవి ఆదేశాల మేరకు తెలుగుదేశం పార్టీ బలపరిచిన మాడూరు ఆదర్శ సతీమణి మడూరు గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా మడూరు గ్రామ సచివాలయంలో నామినేషన్ దాఖలు చేశారు.నన్ను మడూరు గ్రామ సర్పంచ్ గా ప్రజలు గెలిపిస్తే ప్రభుత్వ నిధులను సక్రమంగా వినియోగిస్తూ పక్కదారి పట్టించకుండా ప్రభుత్వ పథకాలను ప్రతి ఒక్కరికి అందేలా చూస్తానని చెప్పారు. గ్రామ అభివృద్ధికి, ప్రతి వార్డు అభివృద్ధికి సహకరిస్తూ ప్రతి ఒక్కరికి అందుబాటులో ఉంటూ మడూరు గ్రామ అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తానని మడూరు గ్రామ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, మడూరు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఎంపీపీ అతికారి వినుతకు ఘన సన్మానం



ప్రజాభూమి, సిద్ధవటం: సిద్ధవటం మండలంలో ఇటీవల జరిగిన ఎంపీటీసీ ఎన్నికల్లో జనసేన పార్టీ తరపున ఏకగ్రీవంగా ఎన్నికైన అతికారి వినుత, చింతగింజల సుభాషిణి గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా మాధవరం-1, వెంకటేశ్వరాపురం, ఎస్.కె.ఆర్. నగర్ ప్రాంతాలకు చెందిన తెలుగుదేశం పార్టీ యువ నాయకులు నూతనంగా ఎంపీపీగా ఏకగ్రీవంగా ఎన్నికైన అతికారి వినుత, ఆమె తండ్రి రాజంపేట పార్లమెంట్ జనసేన పార్టీ సమన్వయకర్త అతికారి కృష్ణ, అలాగే ఎంపిటిసి సుభాషిణి దంపతులు అవ్వారు రవిశంకర్ లను ఘనంగా సన్మానించారు. శాలువాలు కప్పి, పూలమాలలు వేసి వారికి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన ఎంపీపీ, ఎంపీటీసీ సభ్యులు మండల అభివృద్ధికి సమష్టిగా కృషి చేయాలని ఆకాంక్షించారు. ప్రజల సమస్యలను పరిష్కరించడంలో ప్రజాప్రతినిధులు ముందుండాలని, గ్రామాల అభివృద్ధికి పార్టీ భేదాలకు అతీతంగా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ యువ నాయకులు, జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని నూతన ప్రజాప్రతినిధులకు శుభాకాంక్షలు తెలిపారు.

విద్యార్థుల చదువుకు అండగా కూటమి ప్రభుత్వం

- ఫీజు రీయింబర్స్మెంట్ కింద రూ.4,962.22 కోట్లు విడుదల

- టీఎన్ఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు వేణుగోపాల్ రెడ్డి

ప్రజాభూమి, పులివెందుల



పేద విద్యార్థుల చదువులకు కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తోందని టీఎన్ఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. గత ప్రభుత్వం మిగిల్చిన ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలను విడతలవారీగా చెల్లిస్తూ విద్యార్థుల చదువులకు ఆటంకం కలగకుండా చర్యలు తీసుకుంటోందన్నారు. విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ విద్యార్థులకు ఇచ్చిన హామీ మేరకు ఇప్పటి వరకు ఫీజు రీయింబర్స్మెంట్ కింద రూ.4,962.22 కోట్లు విడుదల చేశారని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాం లో ఫీజు రీయింబర్స్మెంట్, వసతి దీవెన, పీజీ ఫీజులకు సంబంధించి మొత్తం రూ.4,271 కోట్లు బకాయిలు పెట్టారని విమర్శించారు. దీంతో విద్యార్థులు సర్టిఫికెట్లు పొందలేక, ఉన్నత చదువులు కొనసాగించడంలో ఇబ్బందులు ఎదుర్కొన్నారని తెలిపారు. కళాశాలల్లో నిలిచిపోయిన సుమారు 10 లక్షల మంది విద్యార్థుల సర్టిఫికెట్లు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. ఫీజుల పేరుతో విద్యార్థులను ఇబ్బందులకు గురిచేయవద్దని కళాశాలల యాజమాన్యాలకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని పేర్కొన్నారు. అర్హులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఈబీసీ విద్యార్థుల చదువులకు ప్రభుత్వం భరోసా కల్పిస్తోందన్నారు. పేదరికం కారణంగా ఏ విద్యార్థి చదువు ఆగకూడదనే లక్ష్యంతో పనిచేస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి లోకేష్కు టీఎన్ఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు వేణుగోపాల్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

వ్యాసరచన, చిత్రలేఖన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతుల ప్రదానం

ప్రజాభూమి,పులివెందుల

59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా పులివెందుల గ్రంథాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన వివిధ కార్యక్రమాల్లో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలిచిన విద్యార్థినీ విద్యార్థులకు గురువారం స్థానిక అహోబిలాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బహుమతులు అందజేశారు.పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన వారితో పాటు ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందించారు. విద్యార్థుల్లో సృజనాత్మకత, పఠనాసక్తి, రచనా నైపుణ్యాలను పెంపొందించేందుకు ఇలాంటి పోటీలు ఎంతగానో దోహదపడతాయని గ్రంథాలయ అధికారి కృష్ణ కిషోర్ రెడ్డి తెలిపారు.ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు రెడ్డికి గ్రంథాలయ అధికారి కృష్ణ కిషోర్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు రెడ్డి, ఉపాధ్యాయులు ప్రసాద్, లక్ష్మీరెడ్డి, వీరేంద్ర, శాంతకుమారి విద్యార్థులు పాల్గొన్నారు.

గండి అంజన్న ఆలయంలో పవిత్రోత్సవాలకు ఏర్పాట్లు

- ఈ నెల 21 నుంచి 24 వరకు నాలుగు రోజుల పాటు ఉత్సవాలు

- ప్రత్యేక పూజలు, హోమాలు, అభిషేకాల నిర్వహణ

ప్రజాభూమి, చక్రాయపేట

ప్రముఖ పుణ్యక్షేత్రమైన గండి క్షేత్రం శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానంలో ఈ నెల 21 నుంచి 24వ తేదీ వరకు నాలుగు రోజుల పాటు పవిత్రోత్సవాలు నిర్వహించేందుకు ఆలయ అధికారులు, అర్చకులు ఏర్పాట్లు చేస్తున్నారు. దేవస్థానంలో నిత్యం నిర్వహించే పూజలు, ఆరాధనలు, ఇతర కైంకర్యాల్లో తెలిసీ తెలియక జరిగే దోషాల నివారణకు, లోకకల్యాణం, భక్తుల శ్రేయస్సు కోసం పవిత్రోత్సవాలను శాస్త్రోక్తంగా నిర్వహించనున్నట్లు ప్రధాన అర్చకులు కేసరి, ఉప ప్రధాన అర్చకులు రాజా రమేష్ తెలిపారు. ఈ సందర్భంగా నాలుగు రోజుల పాటు ప్రత్యేక పూజలు, హోమాలు, అభిషేకాలు, పవిత్ర సమర్పణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో సి. విశ్వనాథ్, చైర్మన్ కల్లూరి వెంకటస్వామి వెల్లడించారు. ఈ నెల 21న అంకురార్పణ, విశ్వక్సేనారాధన, రక్షాబంధనం, బింబశుద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తారు. 22న మహాకుంభాభిషేకం, యాగశాల ప్రవేశం, అగ్ని ప్రతిష్ఠ, పవిత్ర ప్రతిష్ఠ, సుందరకాండ పారాయణం, హోమాలు నిర్వహిస్తారు. 23న మహాన్యాసపూర్వక హోమం, పంచామృత స్నపనం, పవిత్ర సమర్పణ, సింధూరార్చన, అష్టపూర్ణాహుతి కార్యక్రమాలు ఉంటాయి. 24న ఆంజనేయ స్వామి మూలమంత్ర హోమం, సుదర్శన హోమం, మహాపూర్ణాహుతి, మహాకుంభ ప్రోక్షణతో పవిత్రోత్సవాలు ముగియనున్నాయి. ఈ పవిత్రోత్సవాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఆలయ అధికారులు కోరారు.

అయ్యప్ప నామస్మరణతో మార్మోగిన నల్లగొండ వారిపల్లె

భక్తిశ్రద్ధలతో ఘనంగా అయ్యప్ప స్వామి పడిపూజ

- గ్రామంలో పండుగ వాతావరణం

ప్రజాభూమి,పులివెందుల



పులివెందుల మండల పరిధిలోని నల్లగొండ వారిపల్లె గ్రామంలో అయ్యప్ప స్వామి పడిపూజ కార్యక్రమాన్ని గురువారం గురుస్వాములు, గ్రామస్తుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.పడిపూజ సందర్భంగా గ్రామంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. అయ్యప్ప స్వామి నామస్మరణ, భక్తుల శరణుఘోషతో నల్లగొండ వారిపల్లె గ్రామం మార్మోగింది.



పడిపూజను పురస్కరించుకుని గ్రామంలో అరటి బెరడులతో ప్రత్యేక మండపాలను ఏర్పాటు చేసి, వాటిని వివిధ రకాల పూలతో అందంగా అలంకరించారు. మండపాలలో అయ్యప్ప స్వామి, వినాయకుడు, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి విగ్రహాలను పెట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు.పులివెందుల గురుస్వామి వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధల తో సాగాయి.ఈ సందర్భంగా అయ్యప్ప స్వామికి పంచామృ తాభిషేకాలు నిర్వహించి, అనంతరం ప్రత్యేక అలంకరణతో స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులకు అవకాశం కల్పించారు. అయ్యప్ప భక్తులు నిర్వహించిన భజనలు, భక్తిగీతాలుకార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.అనంతరం సంప్రదాయ బద్ధంగా పడిపూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. పదునెనిమిది పవిత్ర పడి మెట్లకు ప్రత్యేక పూజలు చేసి, అయ్యప్ప స్వామి మహిమలను స్మరించుకుంటూ భక్తులు శరణుఘోషతో పూజల్లో పాల్గొన్నారు. అనంతరం భక్తులందరికీ బిక్ష కార్యక్రమాన్నిఏర్పాటు చేశారు సాయంత్రం స్వామివారి ఉత్సవ విగ్రహాలతో గ్రామోత్సవం నిర్వహించా రు. ఈ పడిపూజ గ్రామంలో పండుగ వాతావరణాన్ని నెలకొల్పింది.

ఈశ్వరమ్మ జయంతి వేడుకల్లో చీరల పంపిణీ

వృద్ధులకు, దివ్యాంగులకు, నిరుపేద మహిళలకు చేయూత

ప్రజాభూమి, పులివెందుల



భగవాన్ శ్రీ సత్యసాయిబాబా మాతృమూర్తి స్వర్గీయ ఈశ్వరమ్మ నూట ఒకటవ జయంత్యోత్సవాలను పురస్కరించుకొని సత్య సాయి సేవా సమితి అహోబిలపురం శాఖ ఆధ్వర్యంలో చీరల పంపిణీ కార్యక్రమం చేపట్టారు.ముద్దనూరు రోడ్డులోని వికలాం గుల కమ్యూనిటీ భవనంలో సత్యసాయి బాబా చిత్రపటానికి పూలమాల వేసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం మహిళా దివ్యాంగులకు చీరలు పంపిణీ చేశారు.అంధుల ఆశ్రమం, లీలావతి వృద్ధాశ్రమంలోని నిరాశ్రయులైన మహిళలకు మొత్తం నూట ఒకటి చీరలు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా సేవా సమితి జిల్లా కోఆర్డినేటర్ రమణ మాట్లాడుతూ ఈశ్వరమ్మ కీర్తి దివ్యాంగులందరికీ గొప్ప స్ఫూర్తి అని పేర్కొన్నారు.కార్యక్రమంలో వికలాంగుల నెట్ వర్క్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఇరికిరెడ్డి రఘునాథరెడ్డి, పులివెందుల కన్వీనర్ దాసరి రెడ్డయ్య, రవి కిషోర్ నాయుడు, విజయలక్ష్మి, రామమునిరెడ్డి, చెన్నారెడ్డి, పుల్లమ్మ, స్వరూప, సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాభూమి

తిరుపతి,చిత్తూరు 8

శుక్రవారం 20 నవంబరు 2026

యరగాటిపల్లి సర్పంచ్ అభ్యర్థిగా పంట్రాంగం ప్రమీల నామినేషన్!

దివంగత మాజీ సర్పంచ్ కళ్యాణ్ సతీమణిగా బరిలోకి..

ప్రజాభూమి ప్రతినిధి, వాకాడు:
వాకాడు మండలంలోని యరగాటిపల్లి పంచాయతీ సర్పంచ్ అభ్యర్థిగా టీడీపీ బలపరిచిన పంట్రాంగం ప్రమీల గురువారం నామినేషన్ దాఖలు చేశారు. ఆమె దివంగత మాజీ సర్పంచ్ పంట్రాంగం కళ్యాణ్ సతీమణి. నామినేషన్ కార్యక్రమంలో ఆమె వెంట పంట్రాంగం వసంత్, పంట్రాంగం సతీకామ్, టీడీపీ యువ నాయకుడు పంట్రాంగం అరుణ్ తదితర నాయకులు పాల్గొన్నారు.



నెల్లిపూడి సర్పంచ్ బరిలో కల్లూరు హరీష్ బాబు!

టీడీపీ మద్దతు అభ్యర్థిగా నామినేషన్ దాఖలు

ప్రజాభూమి ప్రతినిధి, వాకాడు:
వాకాడు మండలంలోని నెల్లిపూడి గ్రామ పంచాయతీ సర్పంచ్ పదవికి టీడీపీ మద్దతు అభ్యర్థిగా కల్లూరు హరీష్ బాబు నామినేషన్ దాఖలు చేశారు. గూడూరు ఎమ్మెల్యే డాక్టర్ పాశం సునీల్ కుమార్ బలపరిచిన అభ్యర్థిగా ఆయన వాకాడు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎన్నికల అధికారులకు గురువారం నామినేషన్ పత్రాలను అందజేశారు.



డిజిటల్ మోసాలపై జాగ్రత్త అవసరం

-ఆంధ్రా గ్రామీణ బ్యాంకు తొట్టంబేడు శాఖ మేనేజర్ మోహన్ కుమార్

ప్రజా భూమి ప్రతినిధి
తొట్టంబేడు
ప్రస్తుత సమాజంలో జరుగుతున్న డిజిటల్ మోసాలు, సైబర్ నేరాల పట్ల అవగాహనకలిగి ఉండాలని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు, తొట్టంబేడు శాఖ మేనేజర్ మోహన్ కుమార్ అన్నారు. గురువారం ది స్కూల్ నందు సైబర్ సెక్యూరిటీ, డిజిటల్ మోసాల పై నిర్వహించిన వ్యాస రచన పోటీల్లో విజేతలైన విద్యార్థులు వి.వర్షిత, కె . లిఖిత, ఎ.లిఖిత, సి. కీర్తన రెడ్డి, టి.జయశ్రీ లకు బహుమతులు అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆన్లైన్ గేమ్స్, సెక్యూరిటీ లింక్స్, ఇన్స్ స్టా గ్రామ్ ద్వారా వచ్చే ఓటిపిల పట్ల జాగ్రత్త గా ఉండాలన్నారు. గేమ్స్, చదువుకు అవసరమైన టాబ్స్ ఉపయోగించే సమయంలో వచ్చే ఓటీపీల పట్ల స్పందించ వలసిన అవసరం లేదన్నారు. ఏ లావాదేవీలు అయినా బ్యాంకు ద్వారా నిర్వహించడం శ్రేయస్కరం అని తెలిపారు. విద్యార్థులకు తల్లికి వందనం, ప్రభుత్వ పథకాలు బ్యాంకు అకౌంట్ లకు మాత్రమే వస్తాయని, ఇతర లింక్స్ ద్వారా రావన్నారు. గ్రామీణ బ్యాంకు నందు జీరో బ్యాలన్స్ అకౌంట్స్, తల్లిదండ్రులతో జాయింట్ అకౌంట్స్ త్వరగా తయారు చేసి ఇవ్వబడును అని అన్నారు. అదే విధంగా విద్యార్థులకు విద్యా రుణాలు, డిపాజిట్ల పై అత్యధికంగా 10.5శాతం వడ్డీ, ఇళ్ళ, వాహనాల రుణాలు ఇస్తున్నామన్నని తెలిపారు. ది స్కూలు విద్యార్థులను అభినందించిన కార్యక్రమంలో గ్రామీణ బ్యాంకు తొట్టంబేడు మేనేజర్ మోహన్ కుమార్, ప్రేమానంద్, ప్రభాకర్ రెడ్డి, కృష్ణారెడ్డి, బ్యాంకు మరియు ది స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.



ఎంపీపీ ఎన్నిక వాయిదా అప్రజాస్వామికం

ప్రజా భూమి ప్రతినిధి –శ్రీకాళహస్తి
తొట్టంబేడు మండల ఎంపీపీ ఎన్నికలో రిటర్నింగ్ అధికారి వ్యవహరించిన తీరు అప్రజాస్వామికమని బోనుపల్లి ఎంపీటీసీ సీ.చాముండేశ్వరి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్వతంత్ర అభ్యర్థికి 12 మంది సభ్యుల్లో 11 మంది ఎంపీటీసీ సభ్యులు చట్ట బద్ధంగా మద్దతిచ్చి ఎంపీపీ ఎన్నికను పూర్తి చేసినా ఎన్నికను వాయిదా వేయడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని విమర్శించారు. ఎంపీపీని ఎంపీటీసీ సభ్యులు ఎన్నుకోవాల్సిన చోట మరేదో శక్తికి రిటర్నింగ్ అధికారి తలొగ్గడం ఎన్నికల వ్యవస్థపై గొడ్డలి పెట్టు అన్నారు. అధికార కూటమి నుంచి బీ-ఫారం అందుకున్న అభ్యర్థిని ప్రతిపాదించేవారు, బలపరిచేవారు లేకున్నా మళ్ళీ ఎన్నిక ఎందుకోనని ప్రశ్నించారు. దీనిపై ప్రభుత్వం ఉన్నత స్థాయి విచారణ జరిపి ఆర్వోపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



రేణిగుంట మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీటీసీ సభ్యుల ప్రమాణ స్వీకారం

ప్రజా భూమి ప్రతినిధి రేణిగుంట.
అనుకుంటా మండల కార్యాలయంలో గురువారం ఎంపీపీ,, (ఎంపీటీసీ)ల ప్రమాణోత్సవ కార్యక్రమం నిర్వహించారు.తొలుత ఎంపీటీసీ సభ్యులతో రిటర్నింగ్ అధికారి ఆదినారాయణ నాయుడు ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం ఎంపీపీ, వైస్ ఎంపీపీ ఎన్నిక ప్రక్రియ చేపట్టగా, ఎంపీపీగా మునిచంద్రా రెడ్డి, వైస్ ఎంపీపీగా సుప్రియ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమం రేణిగుంట తహసీల్దార్ శ్రావణ్ కుమార్, ఎంపీడీఓ రవిచంద్ర, రిటర్నింగ్ అధికారి ఆదినారాయణ నాయుడు, డిప్యూటీ ఎంపీడీఓ ప్రభురావు పాల్గొన్నారు. నూతనంగా ఎన్నికైన ఎంపీపీ మునిచంద్రా రెడ్డి, వైస్ ఎంపీపీ సుప్రియలకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీపీ మునిచంద్ర రెడ్డి మీడియా తో మాట్లాడారు కార్యక్రమంలో ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.



నూతన ఎంపీపీ రామముని రెడ్డికి ఘన సన్మానం

ప్రజాభూమి, వేంపల్లె
నూతనంగా ఎంపీపీగా ఎన్నికైన సింగారెడ్డి రామముని రెడ్డిని స్థానిక పట్టణంలో కోనేటి నారాయణ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కోనేటి నారాయణ ఎంపీపీ రామముని రెడ్డికి శాలువా కప్పి, పూలమాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కోనేటి నారాయణ మాట్లాడుతూ రామముని రెడ్డి ఎంపీపీగా ఎన్నిక కావడం సంతోషకరమని అన్నారు. మండల అభివృద్ధికి ప్రత్యేక చొరవ చూపుతూ, ప్రజలకు అందుబాటులో ఉండి గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షించారు. ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతనిస్తూ ఎంపీపీగా తన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల ఉపాధ్యక్షుడు పసుపులేటి వీరభద్ర, కోనేటి రామచంద్ర, కోనేటి సతీష్, మునగల నరసింహులు తదితరులు పాల్గొన్నారు.



చంద్రగిరి ఎంపీపీగా సరితా రమణమూర్తి, వైస్ ఎంపీపీగా కె. సునీల్ ఏకగ్రీవ ఎన్నిక..!

- 14 మంది టీడీపీ ఎంపీటీసీల ప్రమాణ స్వీకారం.. ఇద్దరు వైసీపీ సభ్యుల గైర్హాజరు!
- ఏకగ్రీవ ప్రతిపాదనలతో ఎంపీపీగా సరితా రమణమూర్తి, వైస్ ఎంపీపీగా సునీల్ ఎన్నిక..
- పదవిని హోదాగా కాకుండా సేవా కార్యక్రమంగా భావించి మండలాన్ని అభివృద్ధి చేస్తా: నూతన ఎంపీపీ సరితా రమణమూర్తి..

ప్రజా భూమి ప్రతినిధి,చంద్రగిరి:
చంద్రగిరి మండల పరిషత్ (ఎంపీపీ) నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవం మరియు ఎన్నికల ప్రక్రియ అత్యంత ఘనంగా, ప్రశాంత వాతావరణంలో జరిగింది. మండల పరిధిలో మొత్తం 16 మంది ఎంపీటీసీ సభ్యులు ఉండగా, ఈ కార్యక్రమానికి 14 మంది తెలుగుదేశం పార్టీ ఎంపీటీసీ సభ్యులు హాజరయ్యారు. మిగిలిన ఇద్దరు వైసీపీ ఎంపీటీసీ సభ్యులు ఈ సమావేశానికి గైర్హాజరయ్యారు. ముందుగా, సభకు హాజరైన 14 మంది టీడీపీ ఎంపీటీసీ సభ్యులతో ఎన్నికల అధికారులు ఒక్కొక్కరిగా ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం, మండల పరిషత్‌లో టీడీపీకి స్పష్టమైన ఆధిక్యం ఉండటంతో నిబంధనల ప్రకారం ఎంపీపీ, వైస్ ఎంపీపీ ఎన్నికల ప్రక్రియను చేపట్టారు. ఇందులో ఎంపీపీగా సరితా రమణమూర్తిని, వైస్ ఎంపీపీగా సునీల్‌ని ఏకగ్రీవ ప్రతిపాదనలతో సభ్యులు ఎన్నుకున్నారు. ఎన్నికల ప్రక్రియ పూర్తయిన



అనంతరం రిటర్నింగ్ అధికారి (ఆర్వో) మరియు ఎంపీడీవో అధికారికంగా సభ్యులందరితో సంతకాలు చేయించి ధృవీకరణ పత్రాలు అందజేశారు. నూతనంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులందరూ పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకుంటూ గ్రూప్ ఫోటోలు దిగారు. ఈ సందర్భంగా నూతన ఎంపీపీగా బాధ్యతలు స్వీకరించిన సరితా రమణమూర్తి మాట్లాడుతూ.. ముందుగా తనను



ఆశీర్వదించిన చంద్రగిరి మండల ప్రజలకు, కూటమి నాయకులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. తెలుగుదేశం పార్టీ అధిష్టానం, చంద్రగిరి శాసనసభ్యులు పులివర్తి నాని, ఆయన సతీమణి పులివర్తి సుధారెడ్డి తనపై ఎంతో నమ్మకంతో ఈ కీలక బాధ్యతను అప్పగించారని పేర్కొంటూ, తన విజయానికి సహకరించిన కూటమి నాయకులు, కార్యకర్తలందరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. కులాలు, మతాలు, ప్రాంతాలు, వర్గాలకు అతీతంగా చంద్రగిరి మండలంలోని అన్ని గ్రామాలను సమానంగా అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేస్తానని ఆమె స్పష్టం చేశారు. మండలంలో ప్రధానంగా తాగునీరు, పారిశుద్ధ్యం, అంతర్గత రహదారులు, వైద్యం, విద్య తదితర మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తానని హామీ ఇచ్చారు. ఈ ఎంపీపీ బాధ్యతను ఒక అధికార హోదాగా కాకుండా ప్రజాసేవా కార్యక్రమంగా భావించి, నీతి నిజాయితీలతో ప్రజలకు అందుబాటులో ఉంటూ పనిచేస్తానని, మండల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆమె కోరారు.

ఘనంగా నూతన ఎంపీటీసీల ప్రమాణ స్వీకారం



మండల అభివృద్ధికి సమష్టిగా కృషి చేయాలి : టీడీపీ మండల అధ్యక్షుడు చెంచు రామానాయుడు

ప్రజా భూమి ప్రతినిధి
– బుచ్చినాయుడు కండ్రిగ
తిరుపతి జిల్లా బుచ్చినాయుడు కండ్రిగ మండలంలో నూతనంగా ఎన్నికైన ఎంపీటీసీల ప్రమాణ స్వీకార కార్యక్రమం ఘనంగా నిర్వహించారు తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు చెంచు రామానాయుడు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నూతన ఎంపీపీ జి. గంగమ్మ, వైస్ ఎంపీపీ టి. లక్ష్మమ్మతో పాటు ఎంపీటీసీ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా నూతన ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ గ్రామాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. ప్రజల ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరవేసేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. జనసేన పార్టీ ఎంపీటీసీ జై భాషా సైతం ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. ప్రమాణ స్వీకారం అనంతరం ఎంపీడీవో వెంకటరత్నమ్మ నూతన ప్రజాప్రతినిధులను పూలమాలలతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తూ మండల అభివృద్ధికి తోడ్పడాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, జనసేన పార్టీ నాయకులు, సైనికులు, బీజేపీ నాయకులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొని నూతనంగా ఎన్నికైన ఎంపీపీ, వైస్ ఎంపీపీ, ఎంపీటీసీలకు శుభాకాంక్షలు తెలియజేశారు. మండల అభివృద్ధికి పార్టీలకు అతీతంగా సమష్టిగా కృషి చేయాలని నాయకులు పిలుపునిచ్చారు.

తొండవాడ కూటమి సర్పంచ్ అభ్యర్థిగా పులికంటి మోహన్ రెడ్డి నామినేషన్: 10 మంది వార్డు సభ్యులతో కలిసి భారీ ఊరేగింపుగా వెళ్లి నామినేషన్ దాఖలు!


ప్రజాభూమి ప్రతినిధి,చంద్రగిరి:
తొండవాడ గ్రామ పంచాయతీ సర్పంచ్ ఎన్నికల నామినేషన్ల పర్వం కోలాహలంగా సాగింది. కూటమి బలపరిచిన సర్పంచ్ అభ్యర్థిగా పులికంటి మోహన్ రెడ్డి, 10 మంది వార్డు సభ్యులతో కలిసి గురువారం అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో నామినేషన్ దాఖలు చేశారు. ముందుగా గ్రామంలోని శ్రీ వినాయక స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన ఆయన, అక్కడి నుండి కూటమి నాయకులు, కార్యకర్తలు, మహిళలు, గ్రామస్తులతో కలిసి భారీ ఊరేగింపుగా శ్రీకృష్ణ మందిరానికి చేరుకున్నారు. శ్రీకృష్ణ మందిరంలో ప్రత్యేక పూజల అనంతరం, కార్యకర్తల నినాదాల మధ్య తొండవాడ సచివాలయంలోని ఎన్నికల రిటర్నింగ్ అధికారి వద్దకు చేరుకుని విజయవంతంగా నామినేషన్ పత్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా మాజీ గంగమ్మ గుడి చైర్మన్ పి. రఘురామ రెడ్డి మాట్లాడుతూ.. తెలుగుదేశం పార్టీ ఎప్పుడూ నిజాయితీ, ప్రజాసేవా భావం కలిగిన వ్యక్తులనే బలపరుస్తుందన్నారు. గతంలో తపసి సత్యనారాయణ రెడ్డి ఐదేళ్ల పాటు సర్పంచ్‌గా పనిచేసి, ప్రతి పనిని సొంత పనిగా భావిస్తూ ప్రజల విశ్వాసాన్ని చూరగొన్నారని గుర్తుచేశారు. గ్రామంలో సర్పంచ్ పదవికి ఎంతోమంది ఆశావహులు ఉన్నప్పటికీ, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని ఆదేశాల మేరకు, తపసి సత్యనారాయణ రెడ్డి సేవలను గుర్తుచేసుకుంటూ వారి అల్లుడు పులికంటి మోహన్ రెడ్డిని కూటమి నాయకులందరం ఏకగ్రీవంగా అభ్యర్థిగా నిర్ణయించామని తెలిపారు. ఇటీవల జరిగిన ఎంపీటీసీ ఎన్నికల్లో భారీ మెజారిటీ ఇచ్చినట్లే, ఇప్పుడు సర్పంచ్, వార్డు సభ్యులను గెలిపిస్తే గ్రామ అభివృద్ధి మన చేతుల్లోనే ఉంటుందని, "ప్రజల వద్దకే సేవ" అనే నినాదంతో పనిచేస్తామని ఆయన పేర్కొన్నారు. కూటమి సర్పంచ్ అభ్యర్థి పులికంటి మోహన్ రెడ్డి మాట్లాడుతూ.. ఎమ్మెల్యే పులివర్తి నాని ఇచ్చిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, తన మామగారు తపసి సత్యనారాయణ



రెడ్డి ఆశయ సాధనకు కృషి చేస్తానన్నారు. తాను ఈ గ్రామానికి వచ్చి సుమారు 56 ఏళ్ల అవుతోందని, గ్రామస్తులతో తనకు విడదీయరాని అనుబంధం ఉందని తెలిపారు. రాత్రింబవళ్లు తేడా లేకుండా ప్రజలకు అండగా ఉంటూ, కులమతాలు, వర్గాలకు అతీతంగా పంచాయతీలోని ప్రతి గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానని హామీ ఇచ్చారు. మరో రెండు రోజుల్లో ఎన్నికల గుర్తులు ఖరారవుతాయని, ఈ నెల 29న జరిగే ఎన్నికల్లో తనతో పాటు 10 మంది వార్డు సభ్యులకు ఓటు వేసి అఖండ మెజారిటీతో గెలిపించాలని గ్రామస్తులకు నమస్కరిస్తూ విజ్ఞప్తి చేశారు.స్థానిక నాయకులు పరమాల గోపినాథ్ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే పులివర్తి నాని ఆదేశాల మేరకు పులికంటి మోహన్ రెడ్డిని సర్పంచ్ అభ్యర్థిగా ఎన్నుకున్నామని తెలిపారు. ప్రాంతాలకు అతీతంగా, గ్రామానికి ఎనలేని సేవలు చేసిన తపసి సత్యనారాయణ రెడ్డి వారసుడిగా బరిలోకి దిగిన మోహన్ రెడ్డికి, 10 మంది వార్డు సభ్యులకు ప్రజలు పట్టం కట్టి గ్రామ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు.బీసీ సెల్ అధ్యక్షుడు మణి యాదవ్ మాట్లాడుతూ.. బడుగు, బలహీన వర్గాలను ప్రోత్సహిస్తూ, తనకు ఎంపీటీసీగా అవకాశం ఇచ్చి గెలిపించిన ఎమ్మెల్యే పులివర్తి నానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అన్ని పదవుల్లో బీసీలకు సముచిత న్యాయం చేస్తున్న ఎమ్మెల్యే ఆదేశాల మేరకు, తొండవాడ సర్పంచ్ అభ్యర్థి పులికంటి మోహన్ రెడ్డిని, వార్డు సభ్యులను అత్యధిక మెజారిటీతో గెలిపించి ఎమ్మెల్యేకు కానుకగా అందిస్తామని స్పష్టం చేశారు. ఈ నామినేషన్ కార్యక్రమంలో తొండవాడ గ్రామ పెద్దలు, తెలుగుదేశం, జనసేన, బీజేపీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, యువకులు, మహిళలు భారీ సంఖ్యలో పాల్గొని సంఘీభావం తెలిపారు.

శ్రీకాళహస్తి 21వ వార్డులో జనసేన జెండా ఎగురవేయడమే లక్ష్యంగా మహేష్‌కు పార్టీ బీఫామ్ అందజేత

ప్రజా భూమి ప్రతినిధి శ్రీకాళహస్తి టౌన్
శ్రీకాళహస్తి మున్సిపాలిటీ పరిధిలోని 21వ వార్డులో జనసేన పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న మహేష్ కి పార్టీ తరఫున అధికారికంగా బీఫామ్ అందజేశారు. ఈ సందర్భంగా ఉమ్మడి చిత్తూరు జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు పసుపులేటి హరిప్రసాద్, ఉమ్మడి చిత్తూరు జిల్లా కార్యదర్శి, శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానం చైర్మన్ కొట్టే సాయి ప్రసాద్ చేతుల మీదుగా మహేష్ గారికి బీఫామ్ అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా నాయకులు మహేష్ కి శుభాకాంక్షలు తెలియజేస్తూ, 21వ వార్డులో ప్రజల నమ్మకాన్ని పొందుతూ, ప్రజా సమస్యల పరిష్కారానికి అంకితభావంతో పనిచేయాలని ఆకాంక్షించారు. జనసేన పార్టీ సిద్ధాంతాలు, అధినేత పవన్ కళ్యాణ్ ఆశయాలు, ప్రజలకు సేవ చేయాలనే సంకల్పంతో ముందుకు సాగుతున్న జనసైనికులకు పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉండాలని, సామాన్య ప్రజల ఆకాంక్షలకు ప్రతినిధిగా, వార్డు అభివృద్ధికి కృషి చెయ్యాలని చెప్పడం జరిగింది. 21వ వార్డులో మౌలిక సదుపాయాల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం, పారదర్శకమైన పాలన, ప్రజలకు అందుబాటులో ఉండే నాయకత్వం లక్ష్యంగా ముందుకు సాగాలని ఆకాంక్షిస్తున్నాము. ఈ ఎన్నికల్లో జనసేన పార్టీ అభ్యర్థిగా బరిలో నిలుస్తున్న మహేష్ కి పార్టీ నాయకులు, జనసైనికులు, వీర మహిళలు మరియు అభిమానులందరి సహకారం, ఆశీస్సులు అందాలని కోరుకుంటూ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తున్నాము.



పాకాల ఎంపీపీ గా ఆముదపాకల శ్రీహరి నాయుడు..!

వైస్ ఎంపీపీ గా తలారి సుచిత్ర..

ప్రజా భూమి ప్రతినిధి,పాకాల: (చంద్రగిరి)
తిరుపతి జిల్లా, చంద్రగిరి నియోజకవర్గ, పాకాల మండలం, స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి రెడ్డి సురేష్ ఎంపీపీ,వైస్ ఎంపీపీ ఎన్నికలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ కార్యాలయంలో ప్రిసైడింగ్ అధికారులు వాసుదేవరావు,కిరణ్ సమక్షంలో 16మంది ఎంపీటీసీ'లు సమావేశమయ్యారు.రిటర్నింగ్ అధికారి రెడ్డి సురేష్ సభ్యుల అందరితో ప్రమాణ స్వీకారం చేయించారు.అనంతరం వీరందరూ కలిసి ఎంపీపీగా ఆముదపాకల శ్రీహరి నాయుడు,వైస్ ఎంపీపీ గా తలారి సుచిత్ర లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.నూతనంగా ఎన్నికైన ఎంపీపీ,వైస్ ఎంపీపీ,ఎంపీటీసీ సభ్యులు సిద్దలక్ష్మి,నాగ జ్యోతి,లతీఫ్, పాటూరు మోహన్, మణి,రంజిత్ కుమార్,ఇ లియాస్,రమేష్, మధులత,మంజుల, రూపలత,వనజ, సుబ్రమణ్యం నాయుడు,గౌతమి లకు రిటర్నింగ్ అధికారి,ప్రిసైడింగ్ అధికారులు అభినందనలు తెలియజేశారు.



ఘనంగా ఇందిరాగాంధీ జన్మదిన వేడుకలు

ప్రజా భూమి ప్రతినిధి శ్రీకాళహస్తి టౌన్
మాజీ ప్రధాని ఉక్కు మహిళ శ్రీమతి ఇందిరా గాంధీ జన్మదిన వేడుకలను శ్రీకాళహస్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త తలపా దామోదరం రెడ్డి ఆధ్వర్యంలో వారి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. తలపా దామోదరం రెడ్డి మాట్లాడుతూ భారతదేశ తొలి మహిళా ప్రధాని ఇందిరా గాంధీ ని సుదీర్ఘకాలంపాటు ప్రధానిగా పనిచేసిన చరిత్ర ఆమెదని, నేడు భారతదేశం అన్ని రంగాల్లో ప్రపంచ దేశాలతో పోటీ పడుతుందంటే నాడు ఆమె తీసుకున్నటువంటి సాహసోపేత నిర్ణయాలేనని, ఇందిరా గాంధీ ఎంతోమందికి స్ఫూర్తిదాయకమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు కరీముల్లా, జిల్లా ఇంచార్జి కలెక్టరేటివ్ రెప్రజెంటేటివ్ చైర్మన్ చిరంజీవి,ఓబీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాయాదవ్, శ్రీకాళహస్తి పట్టణ యువజన అధ్యక్షులు ఆంటోనీ, నాగరాజు, మహేష్, అరుణ్, చరణ్, జోసెఫ్, సారధి, చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు



జనసేన- ఎన్డీఏ కూటమి విజయోత్సాహం: దండి నరేంద్ర

– ఏర్పేడు , రేణిగుంట మండలాల ఎంపీటీసీ ప్రమాణ స్వీకారం
– ఎంపీపీ , వైస్ ఎంపీపీ ఎన్నికల కార్యక్రమాల్లో పాల్గొన్న నమన్వయకర్తలు దండి నరేంద్ర, కొట్టే సాయి

ప్రజా భూమి ప్రతినిధి ఏర్పేడు
శ్రీకాళహస్తి నియోజకవర్గ పరిధిలోని ఏర్పేడు , రేణిగుంట మండలాల్లో ఇటీవల ప్రజల మద్దతుతో ఘనవిజయం సాధించిన ఎంపీటీసీ సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవంలో పాల్గొని, నూతన ప్రజాప్రతినిధులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశాను. ఈ సందర్భంగా జనసేన పార్టీ తరఫున ఎన్నికైన ఏర్పేడు ఎంపీటీసీ సభ్యులు విజయలక్ష్మి కంబయ్య, శ్రీమతి గంగమ్మ అద్దూరి తో పాటు ఎన్డీఏ కూటమి ఎంపీటీసీ సభ్యులకు, నూతనంగా ఎన్నికైన ఎంపీపీ రవి వైస్ ఎంపీపీ కిరణ్ కి ప్రత్యేక అభినందనలు తెలియజేశాను. అదేవిధంగా రేణిగుంట మండలానికి చెందిన జనసేన ఎంపీటీసీ సభ్యులు చెంచులక్ష్మి కొబాకు చంద్రకళ ఆకుల కి శుభాకాంక్షలు తెలియజేశాను. ఈ విజయాల వెనుక అహర్నిశలు శ్రమించిన జనసేన నాయకులు, జనసైనికులు, వీర మహిళలు, కూటమి నాయకులు, కార్యకర్తలందరికీ నా హృదయపూర్వక ధన్యవాదాలు. మీ సమష్టి కృషి, అంకితభావమే ఈ ఘన విజయాలకు పునాది. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, కూటమి ఐక్యతతో అభివృద్ధి, ప్రజాసేవే లక్ష్యంగా ముందుకు సాగాలని శ్రీ కాళహస్తి నియోజకవర్గ సమన్వయకర్త దండి నరేంద్ర ఆకాంక్షించారు.



ప్రజాభూమి
తిరుపతి,చిత్తూరు 9
శుక్రవారం 20 నవంబరు 2026

శింగనమల ఎంపీపీ ఎన్నికల్లో హైడ్రామా

• ఎంపీటీసీలను భయభ్రాంతులకు గురిచేసి సంతకాలు చేయించారు • ఎంపీపీ ఎన్నికల వేళ తీవ్ర ఉద్రిక్తత..

• ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ తీరుపై వైసీపీ ఆరోపణలు • మాజీ మంత్రి సాకే శైలజనాథ్ ఘాటు వ్యాఖ్యలు

ప్రజా భూమి శింగనమల

శింగనమల: మండల కేంద్రంలో జరిగిన ఎంపీపీ ఎన్నిక ప్రక్రియ తీవ్ర ఉత్కంఠకు దారితీసింది. వైసీపీ ఎంపీటీసీలను భయభ్రాంతులకు గురిచేసి బలవంతంగా,సంతకాలు, చేయించుకున్నారని టీడీపీ ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ పై వైసీపీ నాయకులు ఆరోపణలు. వ్యక్తం చేస్తున్నారు ఎంపీపీ ఎన్నికల సందర్భంగా టీడీపీకి చెందిన ఐదుగురు ఎంపీటీసీలు,హోజ రయ్యారుమరో ఎంపీటీసీ వీర తులసి కూడా గైర్హాజరు కావడం రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీసింది. మరోవైపు వైసీపీకి చెందిన ఆరుగురు ఎంపీటీసీలు ప్రమాణ స్వీకారానికి హాజరయ్యారు. అయితే ఎంపీడీవో కార్యాల యంలో ఇద్దరు ఎంపీటీసీలను లోపలే నిర్బంధిం చారని, మరో నలుగురు ఎంపీటీసీలను కార్యాలయంలోకి అనుమతించి వారిని భయభ్రాంతుల గురిచేసి వారిని కొట్టి



మహిళలను చూడకుండా చాలా ఇబ్బంది పెట్టి వారితో బలవంతంగా సంతకాలు చేయుచున్నారని వైసిపి మహిళా ఎంపీటీసీలు ఆవేదన చెందుతు న్నారు. ఎంపీడీవో కార్యాలయంలో ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ, ఎంపీడీవో భాస్కర్ రాయల్, ఆర్వో చల్ల లలిత సమక్షంలో మొత్తం తొమ్మిది మంది ఎంపీటీసీలతో ప్రమాణ స్వీకారం చేయిం చడం మరింత చర్చనీయాంశంగా మారింది. ఎంపీపీ ఎన్నికల ప్రక్రియలో చోటుచేసుకున్న వరిణామాలపై రాజకీయ వర్గాల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇద్దరు ఎంపీటీసీలను కార్యాలయంలో బంధించారని వారు మీడియా సమావేశంలో ఆవేదన వ్యక్తం చేశారు ప్రజాస్వామ్యంలో ఇంత ఇంత భయభ్రాంతుల గురి చేయడం ఎంతవరకు సహజమంటూ మా మీద చేతులతో కర్రలతో కొట్టి గాయాలపాలు చేసి ఇంత తీవ్రంగా కొట్టడం ఎవరు అక్కు ఇచ్చారంటూ ఆవేదన చెందారు గ్రామాల్లో ఓటు బ్యాంకింగ్ లేక మమ్మల్ని ఎందుకు ఇంత దారుణంగా హింసిస్తున్నారని ఎంపీటీసీలు వైసీపీ నాయకులు టిడిపి ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ పై గాటు వాక్యాలు చేశారు. పోలీస్ డిపార్ట్మెంట్ సీఐ రాగిరి రామయ్య ఎంపీడీవో భాస్కర్ రాయల్ ఆర్వో చెల్లా లలిత మీడియా మిత్రులకు అనుమతి



లేదంటూ మీడియాని కూడా ప్రింట్ మీడియా ఎలక్ట్రికల్ మీడియా ఎవరిని అనుమ తించకుండా వారిని బయటనే ఎండలో బయట తిప్పుతూ మీడియాని గౌరవం లేకుండా హేళన చేయడం చాలా అవమానకరం మీడియా ఇంత అవమానకరం ఏ ప్రభుత్వంలోనూ జరగలేదంటూ మీడియా మిత్రులు ఆవేదన వ్యక్తం చేశారు ప్రధాన పాత్ర సీఐ రాగిరి రామయ్య ఈ మీడియాను లోపల అనుమతించకుండా అడ్డుకున్నాడు ఇది ఎంతవరకు సహజం

శ్రీకంఠపురంలో ఉచిత కంటి వైద్య శిబిరం

-60 మంది శస్త్రచికిత్సలకు ఎంపిక



ప్రజాభూమి, హిందూపురం టౌన్

పేద, మధ్యతరగతి ప్రజలకు కంటి వైద్య సేవలను చేరువ చేయాలనే లక్ష్యంతో జనహిత సొసైటీ ఆధ్వర్యంలో గురువా రం శ్రీకంఠపురం 15వ వార్డులో నిర్వ హించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరా నికి సుమారు 100 మందికి పైగా హాజరై కంటి పరీక్షలు చేయించుకోగా, వారిలో 60 మందిని తదుపరి శస్త్రచికిత్సల నిమిత్తం వైద్యులు సిఫార్సు చేశారు. ఎంతోమందికి చూపును ప్రసాదిస్తూ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న జనహిత సొసైటీ నిర్వాహకులు డాక్టర్ కృష్ణమోహన్ జింకకు శ్రీకంఠపురం గ్రామంతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కంటి వైద్య శిబిరం విజయవంతం కావడంలో మాజీ మున్సిపల్ కౌన్సిలర్ కే. సతీష్ కుమార్, కౌన్సిలర్ దుర్గ మంజుల, నవీన్ కీలకంగా వ్యవహరించారు. అదేవిధంగా ఐ క్యాంప్ ఇన్‌ఛార్జి ఏ. నాగరాజు చుట్టుపక్కల ప్రాంతాల్లో మైక్ ద్వారా ప్రచారం నిర్వహించడంతో పాటు కరపత్రాలు పంపిణీ చేసి ప్రజలకు శిబిరంపై అవగాహన కల్పించారు. కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రత్యేక చొరవ చూపిన ఏ. నాగరాజుకు నిర్వాహకులు, స్థానికులు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వడ్డే ప్రసాద్, దుర్గ, నవీన్, దుర్గ నాని, సికిందర్, శివ, గోవింద, మంజునాథ్, నరసింహమూర్తి, సురేంద్రబాబు, అబ్దుల్ అలీం, ఫైరోజ్, మూర్తి, కృష్ణ, బాషా పాల్గొన్నారు.

ప్రతికూల పరిస్థితులను అధిగమించి శింగనమల ఎంపీపీ పీఠాన్ని కైవసం చేసుకున్న కూటమి!

ఎంపీపీగా కుమ్మెత హరిత, వైస్ ఎంపీపీగా నల్లని శ్రీదేవి

ఎన్నిక మూతన నాయకత్వానికి

ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ అభినందనలు

ప్రజా భూమి శింగనమల



శింగనమల మండల పరిషత్ అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ మద్దతుతో కుమ్మెత హరిత ఎంపీపీగా, నల్లని శ్రీదేవి వైస్ ఎంపీపీగా ఎన్నికయ్యారు. దీంతో శింగనమల మండల పరిషత్ పీఠాన్ని కూటమి కైవసం చేసుకుంది. ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన ఎన్నికల్లో ఇరువర్గాలకు సమానంగా ఆరు స్థానాలు ఉండటంతో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. అనేక రాజకీయ ప్రతికూలతలు, సవాళ్లు ఎదురైనప్పటికీ, సమర్థవంతమైన వ్యూహం, నాయకుల సమన్వయం, కార్యకర్తల పట్టుదలతో తెలుగుదేశం పార్టీ మద్దతుతో కుమ్మెత హరిత ఎంపీపీగా ఎన్నికయ్యారు. నల్లని శ్రీదేవి వైస్ ఎంపీపీగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ నూతనంగా ఎన్నికైన ఎంపీపీ, వైస్ ఎంపీపీలకు హృదయపూర్వక అభినందనలు, శుభాకాంక్షలు తెలియజేశారు. సంఖ్యాబలం సమానంగా ఉన్నప్పటికీ, ప్రతికూల పరిస్థితులను అధిగమించి ఎంపీపీ పీఠాన్ని కైవసం చేసుకోవడం పార్టీ అధిష్ఠానం ఆదేశాల మేరకు ఎంపిటిసి సభ్యుల సమష్టి కృషికి నిదర్శనమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. నూతన నాయకత్వం శింగనమల మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లాలని, గ్రామీణ ప్రాంతాల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతనిస్తూ, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా కృషి చేయాలని ఆకాంక్షించారు. మండల ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ ప్రజాసేవ, అభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. ఈ విజయం కేవలం ఎంపీపీ పీఠాన్ని దక్కించుకోవడమే కాదు.. ప్రతికూల పరిస్థితుల్లోనూ ఐక్యతతో, పట్టుదలతో పనిచేస్తే విజయం సాధ్యమని నిరూపించిన కూటమి శ్రేణుల సమష్టి విజయం అని పార్టీ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు.

ఎంపీపీగా సింగారెడ్డి రామముని రెడ్డి ఎన్నిక

- వైస్ ఎంపీపీగా నామ వేమకుమార్ ఎంపిక

- 18 మంది ఎంపీటీసీ సభ్యుల ప్రమాణస్వీకారం

ప్రజాభూమి, వేంపల్లె





మండల ప్రజా పరిషత్ అధ్యక్షుడిగా (ఎంపీపీ) సింగారెడ్డి రామముని రెడ్డిని, ఉపాధ్యక్షుడిగా (వైస్ ఎంపీపీ) నామ వేమకుమార్‌ను నూతనంగా ఎన్నికైన ఎంపీటీసీ సభ్యులు ఎన్నుకున్నారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం లో నిర్వహించిన కార్యక్రమంలో రిటర్నింగ్ అధికారి నాగసుధ మండలానికి చెందిన 18 మంది ఎంపీటీసీ సభ్యులతో ప్రమాణస్వీకారం చేయించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన ఎం పీటీసీ సభ్యులు ప్రజలకు అందుబాటులో ఉంటూ తమ తమ ప్రాంతాల అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి, ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తామని పేర్కొన్నారు. ప్రమాణస్వీకారం చేసిన ఎంపీటీసీ సభ్యులు–వేంపల్లె పట్టణం నుంచి సింగారెడ్డి రామముని రెడ్డి, షేక్ మహమ్మద్ ఇదయతుల్లా, ఎన్. వెంకటసుబ్బమ్మ, గోగుల మారుతి కుమార్, పెడబల్లి సుమ్మ, నామా వేమకుమార్, బి. అంజనమ్మ, పోతిరెడ్డి వరలక్ష్మి, సింగారెడ్డి రాధమ్మ, షేక్ రజియా, బక్కన్నగారిపల్లి గ్రామం నుంచి జి. మనోజ్ కుమార్ నాయుడు, టి. వెలమవారిపల్లి గ్రామం నుంచి ఎస్. దేవలా నాయక్, తాళ్లపల్లి గ్రామం నుంచి టి. లక్ష్మీదేవి, కత్తులూరు గ్రామం నుంచి ఎమ్. సుభాషిణి, అలవలపాడు గ్రామం నుంచి అన్నారెడ్డి బాలస్వామి రెడ్డి, ముతుకూరు గ్రామం నుంచి ఆర్. నాగలక్ష్మమ్మ, ఇడుపులపాయ గ్రామం నుంచి జి. సలీమా, అలిరెడ్డిపల్లి గ్రామం నుంచి డి. రామచంద్ర. ఈ కార్యక్రమంలో టిడిపి మండల పరిశీలకులు రఘునాథ్ రెడ్డి, తహసీల్దార్ శివశంకర్ రెడ్డి, ఎంపీడీఓ కుళాయమ్మ, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైస్ చైర్మన్ పదవిపై రాద్ధాంతం చేస్తే క్రమశిక్షణ చర్యలు

-నియోజకవర్గ సమన్వయకర్త పావులూరు శ్రీనివాసరావు



ప్రజాభూమి, హిందూపురం టౌన్

హిందూపురం మున్సిపల్ వైస్ చైర్మన్ పదవి ఎంపిక విషయంలో పార్టీ నిర్ణయానికి విరుద్ధంగా వ్యవహరిస్తే క్రమశిక్షణ చర్యలు తప్పవని ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ కార్యాలయ పొలిటికల్ కోఆర్డినేటర్ పి. శ్రీనివాసులు పేర్కొ న్నారు. పదవి కోసం వ్యక్తిగతంగా బలప్రదర్శ నలు చేయడం, అనవసర సమావేశాలు నిర్వహించడం, ఇతరులను రెచ్చగొట్టే విధంగా వ్యవహరించడం తగదని స్పష్టం చేశారు. గురువారం ఆయన ఈ విషయాలను వెల్లడిస్తూ.. కొంతమంది నాయకులు, కౌన్సిలర్లు ఎమ్మెల్యే బాలకృష్ణ అనుమతి లేకుండానే వైస్ చైర్మన్ పదవి తమకే దక్కాలంటూ ప్రయత్నాలు చేయడం, పత్రికల్లో ప్రకటనలు, కథనాలు వచ్చేలా వ్యవహరించడం వంటి పరిణామాలు ఎమ్మెల్యే దృష్టికి వెళ్లాయని తెలిపారు. ఈ వ్యవహారంపై రాష్ట్ర పార్టీ కూడా సీరియస్‌గా ఉందని పేర్కొన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ పదవి ఎంపిక, నియామకం పార్టీ అధిష్టానం నిర్ణయం మేరకు ఎమ్మెల్యే బాలకృష్ణ చేపడతారని స్పష్టం చేశారు. ఈ విషయంలో ఎవరైనా అనవసర రాజకీయాలు చేసినా, బహిరంగంగా మాట్లాడినా ఎంతటివారైనా వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నాయకులు, కౌన్సిలర్లు వ్యక్తిగత ప్రయోజనాల కంటే పార్టీ ప్రయోజనాలకు ప్రాధాన్యతనిస్తూ, అధిష్టానం నిర్ణయానికి కట్టుబడి ఉండాలని పి. శ్రీనివాసులు సూచించారు.

టీడీపీ సర్పంచ్ అభ్యర్థుల ఖరారు

-ఏడు గ్రామ పంచాయతీలకు అభ్యర్థుల ప్రకటన

-ఎమ్మెల్యే బాలకృష్ణ ఆదేశాలతో ఎంపిక

ప్రజాభూమి, హిందూపురం టౌన్

హిందూపురం రూరల్ మండలంలోని గ్రామ పంచాయతీల్లో తెలుగుదేశం పార్టీ తరఫున సర్పంచ్ అభ్యర్థులను ఖరారు చేసినట్లు ఆ పార్టీ రూరల్ మండల కన్వీనర్ రాము తెలిపారు. హిందూపురం ఎమ్మెల్యే పద్మభూషణ్ నందమూరి బాలకృష్ణ ఆదేశాల మేరకు మండలంలోని 14 గ్రామ పంచాయతీలకు గాను తొలి విడతగా ఏడు పంచాయతీలకు అభ్యర్థులను ఎంపిక చేసినట్లు గురువారం వెల్లడించారు. పూలకుంట గ్రామ పంచాయతీ సర్పంచ్ అభ్యర్థిగా డి. ప్రమీలమ్మ, బేవినహళ్లి నుంచి ఎం. జ్యోతి, మణేసముద్రం నుంచి అంజినమ్మ, కోటిపి నుంచి కేఎన్. ఉమాశంకర్ రెడ్డి, చౌళూరునుంచి కేపీ.ఉషా రాణి, మలుగూరు నుంచి ఆర్.శుభాషిణి, చలివెందుల నుంచి జి. వెంకటరెడ్డి (చిన్న)లను ఎంపిక చేసినట్లు రాము వివరించారు. ఎంపికైన వారిలో పూలకుంటకు చెందిన ప్రమీలమ్మ రెడ్డి సామాజికవర్గానికి, బేవినహళ్లికి చెందిన జ్యోతి, చౌళూరుకు చెందిన ఉషారాణి వాల్మీకి సామాజికవర్గానికి, మణేసముద్రానికి చెందిన అంజినమ్మ ఎస్సీ మాదిగ సామాజికవర్గానికి చెందినవారని తెలిపారు. మిగిలిన అభ్యర్థుల వివరాలను కూడా పార్టీ నాయకత్వం నిర్ణయం మేరకు వెల్లడించనున్నట్లు పేర్కొన్నారు.

నామినేషన్లు వేయనీయకుండా టిడిపి గుండాలు గలాటలు చేస్తున్నారు

బిటెక్ రవి ధర్నా డ్రామా చూసి నవ్వొస్తుంది – ఎంపీ అవినాష్ రెడ్డి

ప్రజాభూమి, పులివెందుల



పులివెందులలో బిటెక్ రవి చేసిన ధర్నా డ్రామా చూసి నవ్వొస్తుందని ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి అన్నారు. నామినేషన్లు వేయనీయకుండా టిడిపి గుండాలు గలాటాలు చేస్తున్నారని, బిటెక్ రవి నీచ రాజకీయాన్ని చూసి ప్రజలు అసహించుకుంటున్నారని అన్నారు.గురువారం జగన్ క్యాంపు కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ రెండు వేల ఇరవై ఐదులో వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహాలకు టిడిపి తోరణాలు కట్టారని, వాటిని తొలగిస్తే మా కౌన్సిలర్లపై మూడు వందల ఏడు కేసులు పెట్టి వేధించారని అన్నారు.జడ్పీటీసీ ఉప ఎన్నికల్లో వేల్పుల రాముపై దాడి చేస్తే రాముపైనే కేసు కట్టారని, తొండూరులో చంటి, అమరేష్ పై దాడి చేసినా చంటిపైనే కేసు పెట్టారని అన్నారు.మున్సిపల్ ఎన్నికల్లో నామినేషన్ వేయడానికి వెళ్తే మాపైనే గలాటాలు చేసి మాపైనే మూడు వందల ఏడు కేసులు కట్టారని అన్నారు. చక్రాయిపేటలో, అగడూరులో కూడా ఇదే పరిస్థితి అని అన్నారు.ఈ రోజు నామినేషన్ వేయడానికి వెళ్తే మా వారిపై పెట్రోల్ బాంబులతో, రాళ్లతో, కర్రలతో దాడి చేసింది ఎవరో బిటెక్ రవి, రామగోపాల్ రెడ్డి చెప్పాలని అన్నారు.అధికార యంత్రాంగం చేతిలో పెట్టుకుని వైకాపా నాయకులను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తున్నారంటే వైకాపా నాయకులు బయట ఉంటే ఎన్నికలు జరుపుకునే దమ్ము మీకు లేదని అన్నారు.2021లో మేము ఎన్నికలు జరిపినప్పుడు ఒక్క నామినేషన్ పత్రం కూడా చించలేదని, మళ్లీ గ్రామాల్లో ఫ్యాక్షన్ తీసుకొచ్చింది మీరేనని అన్నారు.వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రి అయినప్పటి నుండి ఈ ప్రాంతంలో ఫ్యాక్షన్ పోయి అందరూ సంతోషంగా ఉన్నారని, ఇప్పటికైనా పద్ధతులు మార్చుకుని సర్పంచ్ ఎన్నికలను ప్రశాంతంగా జరిపించాలని అన్నారు.

బాలల హక్కుల పరిరక్షణకు కృషి చేద్దాం



ప్రజాభూమి,
హిందూపురం టౌన్

బాల్యం నుంచే రాజ్యాంగం, ప్రాథమిక హక్కులు, బాధ్యతలు, చట్టాలపై విద్యార్థులు అవగాహన పెంపొందించుకోవాలని పూలకుం ట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కేశవమూర్తి సూచించారు. బాలల హక్కుల పరిరక్షణ, వారికి సురక్షితమైన బాల్యాన్ని అందించడమే లక్ష్యంగా గురువారం పాఠశాలలో సురక్షిత్ బచ్ పన్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పారా లీగల్ వాలంటీర్ అశోక్ కుమార్ మాట్లాడుతూ, ప్రతి చిన్నారికి సురక్షితమైన బాల్యాన్ని అందించడం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. బాలలపై జరిగే హింస, వేధింపులు, దోపిడీ, బాల కార్మికత్వం వంటి సమస్యలను సమష్టిగా ఎదుర్కోవాలన్నారు. పిల్లలకు వారి హక్కులపై అవగాహన కల్పించిన బాల్య వివాహాలను అరికట్టాలని, బాల కార్మికత్వాన్ని నిర్మూలించాలని సూచించారు. బాలలపై లైంగిక వేధింపులను నివారించడంతో పాటు అక్రమ రవాణాను అడ్డుకునేందుకు ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. విద్యార్థులకు సురక్షితమైన విద్యా వాతావరణం కల్పించాలని, ఆపదలో ఉన్న పిల్లలకు తక్షణ రక్షణ, సహాయం అందించాలని పేర్కొన్నారు. పిల్లల్లో ధైర్యం, ఆత్మవిశ్వాసం పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం పారా లీగల్ వాలంటీర్ సురేష్ మాట్లాడుతూ, చట్టాలను తెలుసుకోవడం ప్రతి పౌరుడి హక్కు అని, వాటిని గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. ఆపద సమయంలో సహాయం పొందేందుకు 1098 చైల్డ్ హెల్ప్‌లైన్, 112 అత్యవసర సహాయ నంబర్, 100 పోలీస్ సహాయ నంబర్లను వినియోగించుకోవాలని విద్యార్థులకు వివరించారు. ప్రతి బిడ్డకు రక్షణ, ప్రతి బిడ్డకు విద్య, ప్రతి బిడ్డకు సురక్షితమైన బాల్యం అనే నినాదంతో బాలల హక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. బాల్యం బంగారు భవిష్యత్తుకు పునాది అని, బాలల రక్షణ మనందరి బాధ్యత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో లోక్ అదాలత్ సిబ్బంది రాజా కాశుకుర్తి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజల నమ్మకమే బాధ్యత.. ప్రజాసేవే లక్ష్యం -- పోరుమామిళ్ల-1 ఎంపీటీసీగా శీలంశెట్టి లక్ష్మయ్య ప్రమాణ స్వీకారం

పవన్ కళ్యాణ్‌కు కృతజ్ఞతలు తెలిపిన లక్ష్మయ్య.. ప్రజల మధ్య ఉంటూ సమస్యల వరిష్కారానికి కృషి చేస్తానని వెల్లడి



ప్రజా భూమి పోరుమామిళ్ల, :

కడప జిల్లా పోరుమామిళ్ల పట్టణంలోని శ్రీ శక్తి భవన్‌లో ఎంపీటీసీల ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బద్వేల్ నియోజకవర్గం పోరుమామిళ్ల–1 ఎంపీటీసీగా జనసేన పార్టీ నాయకుడు, కడప పార్లమెంట్ కోఆర్డినేటింగ్ కమిటీ సభ్యుడు శీలంశెట్టి లక్ష్మయ్య ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా తనపై నమ్మకం ఉంచి ప్రజాసేవకు అవకాశం కల్పించిన జనసేన పార్టీ అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల ఆదరణ, నమ్మకంతో లభించిన ఈ పదవిని బాధ్యతగా భావిస్తున్నానని పేర్కొన్నారు. ఎంపీటీసీగా పదవిని స్వీకరించినంత మాత్రాన బాధ్యత ముగిసిపోదని, అసలు బాధ్యత ఇప్పుడే ప్రారంభమవుతుందని లక్ష్మయ్య తెలిపారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ గ్రామంలోని ప్రజా సమస్యలను తెలుసుకుని, వాటి పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని అన్నారు. వ్యక్తిగత స్వార్థం కోసం కాకుండా ప్రజా ప్రయోజనాలే పరమావధిగా పనిచేస్తానని స్పష్టం చేశారు.ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, గ్రామ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని, ప్రజల సమస్యల పరిష్కారంలో ముందుంటానని ఈ సందర్భంగా శీలంశెట్టి లక్ష్మయ్య వెల్లడించారు.

పార్కుల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత

-బాలకృష్ణ వ్యక్తిగత కార్యదర్శి వీరయ్య



ప్రజాభూమి, హిందూపురం టౌన్

పట్టణంలోని పార్కులను అభివృద్ధి చేయడంతో పాటు చిన్నారులకు ఆహ్లాదకరమైన వాతావరణంలో ఆటవిడుపు సదుపాయాలు కల్పిం చేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుం టున్నామని ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ వ్యక్తిగత కార్యదర్శి వీరయ్య తెలిపారు. ఇందులో భాగంగా ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు (ఏపీజీబీ) హిందూపురం ఎం.ఎఫ్. రోడ్ బ్రాంచ్ సహకారంతో చౌడేశ్వరి కాలనీ పార్కుకు రూ.50 వేల విలువైన చిల్డ్రన్స్ ప్లే పరికరాలను అందించడం అభినందనీయమన్నారు. గురువారం బ్యాంకు ప్రతినిధులు పార్కుకు తీసుకొచ్చిన ఆట పరికరాలను వీరయ్య, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జునతో కలిసి పరిశీలించారు. గతంలో ఎమ్మెల్యే బాలకృష్ణ చేతుల మీదుగా ప్రారంభించిన ఈ పార్కులో చిన్నారుల అవసరాలకు అనుగుణంగా పరికరాలను ఏర్పాటు చేయడం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. పట్టణంలోని ఇప్పటికే ఉన్న పార్కులను అభివృద్ధి చేయడంతో పాటు, వాటిని పునరుద్ధరించి ప్రజలకు మెరుగైన సదుపాయాలు కల్పించాలన్న ఎమ్మెల్యే ఆలోచనలకు అనుగుణంగా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి సహకరించిన ఏపీజీబీ బ్యాంకు యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున, మున్సిపల్ ఎంఈ గంగాధర్, డీఈ మదన్, ఏఈ జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో సమీకృత వ్యాధి నిఘా కార్యక్రమం..!

ప్రజా భూమి ప్రతినిధి, చంద్రగిరి:

భారతదేశంలో అంటువ్యాధుల వ్యాప్తిని ముందుగానే గుర్తించి, వాటిని అరికట్టడానికి కేంద్ర ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న ఒక ముఖ్యమైన కార్యక్రమం. ముందస్తు హెచ్చరికలు: అంటువ్యాధులు లేదా అసాధారణ ఆరోగ్య సమస్యలు తలెత్తినప్పుడు వాటిని ప్రారంభ దశలోనే గుర్తించి, మహమ్మారిగా మారకముందే నివారించడం.

డేటా సేకరణ: దేశవ్యాప్తంగా వివిధ జిల్లాల నుండి వ్యాధుల సమాచారాన్ని (డేటా) సేకరించి, విశ్లేషించడం.

త్వరిత స్పందన: వ్యాధి వ్యాప్తి జరిగినప్పుడు వెంటనే స్పందించడానికి ప్రత్యేక బృందాలను సిద్ధంగా ఉంచడం.

సమాచార సేకరణ పద్ధతులు

1.సిండ్రోమిక్ : ల్యాబ్ పరీక్షలతో సంబంధం లేకుండా రోగి లక్షణాల (జ్వరం, విరేచనాలు, దగ్గు వంటివి) ఆధారంగా ఆరోగ్య కార్యకర్తలు సేకరించే సమాచారం.

2.ప్రిసంప్టివ్: క్లినికల్ పరీక్షల ఆధారంగా వైద్యులు నిర్ధారించిన వ్యాధుల సమాచారం.

3.లాబొరేటరీ: ల్యాబ్ పరీక్షల్లో (రక్త పరీక్షలు, మల పరీక్షలు వంటివి) ఖచ్చితంగా నిర్ధారణ అయిన వ్యాధుల సమాచారం.

ఇది ఎలా పనిచేస్తుంది?

గ్రామ స్థాయి నుండి జిల్లా, రాష్ట్ర మరియు జాతీయ



స్థాయిల వరకు ఒక నెట్‌వర్క్ ఉంటుంది.ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రాలు మరియు ప్రభుత్వ/ప్రైవేట్ ఆసుపత్రుల నుండి ప్రతి వారం వ్యాధుల నివేదికలను ఆన్‌లైన్ ద్వారా సేకరిస్తారు.ఏదైనా ప్రాంతంలో అకస్మాత్తుగా ఒకే రకమైన కేసులు పెరిగితే, వెంటనే జిల్లా వైద్య బృందం అక్కడికి చేరుకుని నివారణ చర్యలు చేపడుతుంది. ఇవాళ కమ్యూనిటీ హాస్పిటల్ చంద్రగిరి నందు (ఇంటిగ్రేటెడ్ డిసీజ్ సర్వైలెన్స్ ప్రోగ్రామ్) విజిట్ చేయడం జరిగింది. ఈ విజిట్లోభాగంగా అంటువ్యాధులు ప్రబలకుండా ముందస్తుగా గుర్తించడం మరియు సకాలంలో ప్రజారోగ్య చర్యలు తీసుకోవడం గురుంచి సూచనలు ఇవ్వడం జరిగింది, మరియు రేబిస్ వాక్సిన్, పాము కాటు వాక్సిన్ రికార్డ్స్ పరిశీలించడం జరిగింది. ఈ కార్యక్రమములో డాక్టర్ శృతి, డాక్టర్ జితేంద్ర, డాక్టర్ రామాంజనేయులు రెడ్డి, డాక్టర్ మహమ్మద్ రఫీ, డాక్టర్ అరుణ, డాక్టర్ కవిత, డాక్టర్ హిమబిందు మరియు హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు,

ప్రజాభూమి

జనరల్ 10

శుక్రవారం 20 నవంబర్ 2026

ఆంధ్రా అరుణాచలంలో వైభవంగా కార్తీక మాస ఆకాశదీపోత్సవం


ప్రజాభూమి, ప్రత్తిపాడు



కాకినాడ జిల్లా రాచపల్లిలోని ఆంధ్రా అరుణాచలంగా ప్రసిద్ధిగాంచిన శ్రీ అపీతకుచాంబా సమేత అరుణాచలేశ్వర స్వామివారి దేవస్థానంలో కార్తీక మాసం సందర్భంగా గురువారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం శ్రీ గోపూజ, విఘ్నేశ్వర పూజతో కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. అనంతరం శ్రీ అరుణాచలేశ్వర స్వామివారికి సామూహిక రుద్రాభిషేకం నిర్వహించారు. సాయంత్రం 4 గంటలకు శ్రీ మేధా దక్షిణామూర్తి హోమం భక్తిపూర్వకంగా నిర్వహించారు. సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు కార్తీక మాస ఆకాశదీపోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. అనంతరం శ్రీ గంగా మాత పుష్కరిణి వద్ద గంగా పూజ, హారతులు నిర్వహించారు. ఈ ప్రత్యేక పూజా కార్యక్రమాలతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొని ఆధ్యాత్మిక ఆనందాన్ని పొందారు.

సమాజంపై మహిళల్లో చైతన్యం పెరగాలి

- మహిళలు, బాలికలకు చట్టాలపై అవగాహన అవసరం అధ్యాపకురాలు నాగశ్రీలక్ష్మి




ప్రజాభూమి ప్రతినిధి కొత్తపేట

ప్రస్తుత సమాజ స్థితిగతులను మహిళలు అర్థం చేసుకుని, సామాజిక అంశాలపై అవగాహన పెంపొందించుకుంటూ చైతన్యవంతులుగా మారాల్సిన అవసరం ఉందని కొత్తపేట వి.కె.వి. ప్రభుత్వ డిగ్రీ కళాశాల కామర్స్ అధ్యాపకురాలు సిహెచ్. నాగశ్రీలక్ష్మి అన్నారు. 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా గురువారం కొత్తపేట ద్వితీయ శ్రేణి శాఖా గ్రంథాలయంలో గ్రంథపాలకురాలు కె. సునీత ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన నాగశ్రీలక్ష్మి మాట్లాడుతూ సమాజంలో మహిళల పట్ల వివక్ష, చిన్నచూపు, హింస, అరాచకాలు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వీటిని అరికట్టేందుకు మహిళల్లో విద్యతో కూడిన చైతన్యం అవసరమన్నారు. విద్యార్థి దశ నుంచే బాలికలకు మహిళా చట్టాలపై సంపూర్ణ అవగాహన కల్పించాలని సూచించారు. మహిళలు, బాలికలు సమాజంలో నిర్భయంగా జీవించేందుకు ఆత్మస్థైర్యాన్ని పెంపొందించుకోవాలని, తమ హక్కులపై అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు. అనంతరం ముఖ్య అతిథి నాగశ్రీలక్ష్మిని దుశ్శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో విశ్రాంత మండల విద్యాశాఖ అధికారి ఏడిద సత్తిరాజు, విశ్రాంత లైబ్రేరియన్ చామకూర నాగేశ్వరరావు, సామాజికవేత్త కాండ్రేగుల గంగరాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పార్టీ రహిత ఎన్నికలకు రాజకీయ రంగు !

- సర్పంచ్, వార్డు స్థానాలకు పార్టీ అభ్యర్థులుగా ప్రచారం
- నిబంధనలు అమలు చేయడంలో అధికారుల తీరుపై ప్రశ్నలు



ప్రజాభూమి ప్రతినిధి కొత్తపేట


గ్రామీణ ప్రజాస్వామ్యానికి పునాదిగా నిలవాల్సిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో రాజకీయ పార్టీల జోక్యం పెరుగుతోందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పార్టీ గుర్తులకు, రాజకీయ పార్టీల ప్రమేయానికి అతీతంగా స్వేచ్ఛాయుత వాతావరణంలో జరగాల్సిన సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలకు రాజకీయ రంగు పులమడంపై పలువురు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతున్న నేపథ్యంలో గ్రామాల్లో రాజకీయ సందడి నెలకొంది. ఎన్నికల బరిలో నిలుస్తున్న అభ్యర్థులను ఆయా రాజకీయ పార్టీల అభ్యర్థులుగా పేర్కొంటూ ప్రచారం చేయడం చర్చనీయాంశంగా మారింది. గతంలో గ్రామ పంచాయతీ ఎన్నికల్లో రాజకీయ పార్టీల మద్దతుతో పోటీ చేస్తున్నామని అభ్యర్థులు చెప్పుకుంటూ ప్రచారం చేసేవారు. అయితే ప్రస్తుతం పరిస్థితి మారిందని, నేరుగా ఫలానా పార్టీ అభ్యర్థిగా పేర్కొంటూ ప్రచారం సాగిస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. దీనివల్ల గ్రామస్థాయి ఎన్నికల్లోనూ పార్టీ రాజకీయాలు చొరబడటమే కాకుండా ఓటర్లను ప్రభావితం చేసే అవకాశం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన నేపథ్యంలో రాజకీయ నాయకుల విగ్రహాలకు, ఫ్లెక్సీలకు ముసుగులు వేసి నిబంధనలను అమలు చేస్తున్న ఎన్నికల అధికారులు.. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల పేరుతో జరుగుతున్న ప్రచారంపై ఎందుకు దృష్టి సారించడం లేదని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఎన్నికలు పార్టీ గుర్తులతో జరగనప్పుడు అభ్యర్థులను రాజకీయ పార్టీలకు చెందిన వారిగా చిత్రీకరిస్తూ ప్రచారం చేయడంపై అధికారులు స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందని అంటున్నారు. గ్రామాల్లో వ్యక్తిగత పరిచయాలు, అభ్యర్థుల సేవాభావం, స్థానిక సమస్యల పరిష్కార సామర్థ్యం ఆధారంగా ఓటర్లు తమ ప్రతినిధులను ఎన్నుకునే పరిస్థితులు ఉండాలని ప్రజాస్వామ్యవాదులు అభిప్రాయపడుతున్నారు. రాజకీయ పార్టీల ప్రభావం కారణంగా గ్రామస్థాయి ఎన్నికల్లో విభేదాలు, వర్గపోరాటాలు పెరిగే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఎన్నికల అధికారులు ఈ అంశంపై ప్రత్యేక దృష్టి సారించి, ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న ప్రచారంపై పరిశీలన చేపట్టాలని పలువురు కోరుతున్నారు. పార్టీ అభ్యర్థులుగా ప్రచారం చేస్తూ ఓటర్లను ప్రభావితం చేసే ప్రయత్నాలకు నిబంధనల మేరకు అడ్డుకట్ట వేసి, ప్రతి ఓటరు ఎలాంటి ఒత్తిళ్లు, ప్రలోభాలకు గురికాకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఏలేశ్వరం ఎంపీపీగా మసిరపు రత్నం

- వైస్ ఎంపీపీగా పెంటకోట గంగాభవాని ఎన్నిక
- నూతన పాలకవర్గానికి ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా అభినందనలు.. ఘనంగా సన్మానం

ప్రజా భూమి,ఏలేశ్వరం

కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గ పరిధిలోని ఏలేశ్వరం మండల పరిషత్ అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నికలు గురువారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ ఎన్నికల్లో జెడ్పంగి ఎంపీటీసీ సభ్యురాలు మసిరపు రత్నం



మండల పరిషత్ అధ్యక్షురాలిగా (ఎంపీపీ), లింగంపర్తి ఎంపీటీసీ సభ్యురాలు పెంటకోట గంగాభవాని వైస్ ఎంపీపీగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన ఎంపీపీ మసిరపు రత్నం, వైస్ ఎంపీపీ పెంటకోట గంగాభవానిలను ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా అభినందించారు. అనంతరం నూతన పాలకవర్గంతో పాటు మండల పరిషత్ సభ్యులు, ఎంపీటీసీ సభ్యులను ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా మాట్లాడుతూ.. మండల అభివృద్ధి లక్ష్యంగా ప్రజాప్రతినిధులందరూ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రజల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి నిరంతరం కృషి చేయాలని, ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేయాలని ఆకాంక్షించారు.

ప్రత్తిపాడు ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ఆటోలతో ప్రయాణికులకు ఇబ్బందులు!



ప్రజా భూమి,ప్రత్తిపాడు

ప్రత్తిపాడు ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా ఆటోల ఇష్టారాజ్యంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆ టోలు నిలిపేందుకు ప్రత్యేక స్థలం కేటా యించినప్పటికీ, కొందరు ఆటో డ్రైవర్లు అక్కడ నిలపకుండా రోడ్డుపైనే ఆటోలు నిలిపి ప్రయాణికులను ఎక్కించుకుంటు న్నారు. దీంతో ఒకవైపు ద్విచక్ర వాహనా లు, మరోవైపు పాదచారులు రాకపోకలు సాగిస్తుండగా, మధ్యలో ఆటోలు నిలిపి ఉండటంతో రహదారిపై తరచూ ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. ముఖ్యంగా ఆర్టీసీ బస్సులు కాంప్లెక్స్‌లోకి వెళ్లేందుకు, బయటకు వచ్చేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. బస్సు డ్రైవర్లు హారన్ కొట్టినా ఆటోలు పక్కకు జరగని పరిస్థితులు కనిపిస్తున్నాయి. దీంతో ప్రయాణికులు రోడ్డుపైనే నిలబడి బస్సులు ఎక్కాల్సి వస్తోంది. రద్దీ సమయంలో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆటో డ్రైవర్ల ఉపాధికి ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రత్యేకంగా కేటాయించిన స్థలంలోనే ఆటోలు నిలిపితే ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం లభిస్తుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ఆటోల పార్కింగ్‌ను క్రమబద్ధీకరించి, ప్రయాణికుల భద్రతకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



వాడపల్లి శ్రీవారికి రూ.1.66 లక్షల విలువైన స్వర్ణమయ తామ్ర కవచాల సమర్పణ

- రాజమండ్రికి చెందిన భక్తుల కుటుంబం విరాళం

ప్రజాభూమి ప్రతినిధి కొత్తపేట

కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి రాజమండ్రికి చెందిన భక్తులు రూ.1,66,800 విలువైన స్వర్ణమయ తామ్ర కవచాలను సమర్పించారు. రాజమండ్రి వాస్తవ్యులు వనిమిశెట్టి శ్రీరామకృష్ణ వెంకటసుబ్బారావు, శ్రీమతి అనంతలక్ష్మి సత్యవతి దంపతుల కుటుంబ సభ్యులు స్వామివారి ఉత్సవమూర్తుల కోసం నూతనంగా తయారు చేయించిన స్వర్ణమయ తామ్ర కవచాలను ఆలయానికి అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు కవచాలకు శాస్త్రోక్తంగా సంప్రోక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం దాతల కుటుంబ సభ్యులు కవచాలను ఆలయ అధికారులకు సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు దాతల కుటుంబ సభ్యులను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో ఆలయ అర్చక స్వాములు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కాజులూరులో అట్టహాసంగా ఎంపీపీ వైస్ ఎంపీపీ ఎంపీటీసీల ప్రమాణ స్వీకారం







- అధికార అంటే హోదా కాదు... ప్రజలకు సేవ చేసే గురుతర బాధ్యత...
- అభివృద్ధి సంక్షేమానికి అంకితభావంతో పనిచేయాలి...
- నూతనంగా ప్రమాణ స్వీకారం చేసిన ప్రజా ప్రతినిధులతో మంత్రి సుభాష్.

ప్రజాభూమి ప్రతినిధి,కాజులూరు.


కాజులూరు మండల ఎంపీపీగా చందాల ఆదినారాయణ, వైస్ ఎంపీపీగా పోలిశెట్టి సీతామహాలక్ష్మి ప్రమాణ స్వీకారం చేసి పదవీ బాధ్యతలు చేపట్టారు. ఎన్నికల ప్రత్యేక అధికారి ఆర్. విజయరాజు, ఎంపీడీవో జె. రాంబాబు ఆధ్వర్యంలో ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగింది. ప్రమాణ స్వీకార కార్యక్రమా నికి రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ముఖ్య అతిథిగా హాజరై నూతనంగా ఎన్నికైన ఎంపీపీలు, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీ సభ్యులకు హృదయపూర్వక శు భాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమాల్లో కూటమి సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం, ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్, రామచంద్రపురం మున్సిపల్ చైర్మన్ మేడిశెట్టి శేషారావు, చిక్కాల దొరబాబుతో పాటు కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి వాసంశెట్టి సుభాష్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ప్రజాప్రతినిధులుగా ఎన్నికై బాధ్యతలు స్వీకరించడం ఎంతో గర్వకారణమని, అదే సమయంలో ప్రజల పట్ల మరింత బాధ్యతతో పనిచేయాల్సిన గురుతర కర్తవ్యమని అన్నారు. అధికారం అంటే కేవలం హోదా, పదవి కాదని ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు లభించిన గొప్ప అవకాశమని పేర్కొన్నారు. ప్రజలు మనపై ఉంచిన నమ్మకాన్ని, విశ్వాసాన్ని ప్రతి ఒక్కరూ నిలబెట్టుకోవాలని సూచించారు. నిత్యం ప్రజల్లో ఉంటూ, ప్రజలతో మమేకమై వారి కష్టసుఖాల్లో భాగస్వాములు కావాలని, గ్రామాల్లో నెలకొన్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేయాలని పిలుపునిచ్చారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన, తాగునీరు, పారిశుధ్యం, రహదారులు, విద్య, వైద్యం వంటి అంశాలకు ప్రాధాన్యతనిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సహకారంతో రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతోందని తెలిపారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వానికి ప్రజలు బ్రహ్మరథం పట్టి ఘన విజయాన్ని అందించారని, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన సాగించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా స్థానిక ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోవాలని కోరారు. గ్రామాల అభివృద్ధిలో ఎంపీపీలు, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీ సభ్యుల పాత్ర కీలకమని, అందరూ సమన్వయంతో పనిచేస్తూ తమ మండలాలను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లాలని ఆకాంక్షించారు.

ప్రజల ఆశీర్వాదంతో పదవులు వచ్చాయి.. ప్రజల మన్ననలు పొందేలా సేవలందించాలి. ప్రజల సమస్యలకు పరిష్కారం చూపుతూ, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలులో ఆదర్శంగా నిలవాలని నూతన ప్రజాప్రతినిధులకు మంత్రి వాసంశెట్టి సుభాష్ దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో కాజులూరు జడ్పీటిసి కూటి శేషరత్నం హాజరయ్యారు.

నూతన ప్రజా ప్రతినిధులు ప్రమాణ స్వీకారం చేయడంతో కూటమి శ్రేణుల్లో నూతనోత్సాహం నెలకొంది. పలువురు నాయకులు, కార్యకర్తలు నూతనంగా బాధ్యతలు చేపట్టిన ప్రజాప్రతినిధులకు శుభాకాంక్షలు తెలియజేశారు.

ప్రత్తిపాడు మండల పరిషత్ నూతన అధ్యక్షురాలిగా యాళ్ల మంగాదేవి జగదీష్





- వైస్ ఎంపీపీగా ముప్పనబోయిన వెంకటలక్ష్మి ఏసుబాబు ఏకగ్రీవ ఎన్నిక

ప్రజా భూమి,ప్రత్తిపాడు

ప్రత్తిపాడు మండల పరిషత్ నూతన అధ్యక్షురాలిగా యాళ్ల మంగాదేవి జగదీష్, ఉపాధ్యక్షురాలిగా ధర్మవరం-2 ఎంపీటీసీ సభ్యురాలు ముప్పనబోయిన వెంకటలక్ష్మి ఏసుబాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ సూచనలు, నాయకత్వంలో ఎంపీటీసీ సభ్యులంతా ఏకాభిప్రాయానికి రావడంతో ఎన్నిక ప్రక్రియ సజావుగా పూర్తయింది. ఈ సందర్భంగా నూతన ఎంపీపీ యాళ్ల మంగాదేవి జగదీష్ ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభను ఘనంగా సన్మానించారు.

ఎంపీటీసీ సభ్యులందరినీ సమన్వయం చేస్తూ ఏకగ్రీవ ఎన్నికకు కృషి చేసిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల ప్రక్రియను రిటర్నింగ్ అధికారి వీవీవీ సత్యనారాయణ, ఎంపీడీవో ఎంవీఆర్ కుమార్ బాబు నిర్వహించారు. నూతన ఎంపీపీ, వైస్ ఎంపీపీతో పాటు ఎంపీటీసీ సభ్యులకు రాష్ట్ర ఖాదీ గ్రామీణ పరిశ్రమల వైస్ చైర్మన్ కొమ్ముల కన్నబాబు, జడ్పీటీసీ సభ్యులు రొంగల సత్యనారాయణ, మాజీ సర్పంచ్ యాళ్ల విశ్వేశ్వరరావు, నాయకులు అంబటి బుజ్జి, యర్రాబత్తుల గోవిందు నాయుడు, వెలుగుల నాని, రావూరి తాతాజీ, సమ్మిటి అమ్మిరాజు తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

ప్రజాభూమి
పోలవరం 11
శుక్రవారం 20 నవంబరు 2026

నీతి ఆయోగ్ కార్యక్రమంలో భాగంగా పోలవరం జిల్లాలో గిరిజన అభివృద్ధి, యువతకు నైపుణ్య శిక్షణ, క్రీడలు, పునరావాస కాలనీల అభివృద్ధికి నాలుగు వినూత్న ప్రాజెక్టులు

సీఎస్ఆర్ నిధులు, వివిధ అభివృద్ధి కార్యక్రమాల సమన్వయంతో గిరిజన ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ

ప్రజాభూమి ప్రతినిధి-రంపచోడవరం

గిరిజన ప్రాంతాల సమగ్ర అభివృద్ధి, స్థానిక సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణ, యువ తకు మెరుగైన అవకాశాల కల్పన, క్రీడా ప్రతిభను వెలికితీయడం, పునరావాస కాలనీ ల్లో మౌలిక సదుపాయాల కల్పన లక్ష్యంగా పోలవరం జిల్లాలో నాలుగు వినూత్న అభివృద్ధి ప్రాజెక్టులను ప్రతిపాదించినట్లు జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ తెలిపారు. రంపచోడవరం ఐటీడీఏ సమావేశ మందిరం నుంచి నీతి ఆయోగ్ కార్యక్రమాల అమలు, అభివృద్ధి సూచికల పురోగతి, ప్రభుత్వ పథకాల అమలు తీరు, లక్ష్యాల సాధన తదితర అంశాలపై సం బంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్, సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం, నీతి ఆయోగ్ నిర్దేశించిన మార్గ దర్శకాలకు అనుగుణంగా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ అభివృ ద్ధి లక్ష్యాలను నిర్ణీత గడువులోగా సాధించాలని సూచించారు. జిల్లాలోని గిరిజన ప్రాంతాల అవసరాలను దృష్టిలో ఉంచుకుని రూపొందిం చిన ప్రాజెక్టులను సమర్థవంతంగా అమలు చేసేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్లాలని ఆదేశించారు.ఇంటిగ్రేటెడ్ ట్రైబల్ ఎక్స్‌పీరియన్స్ పార్క్ అండ్ మ్యూజియం: గిరిజనుల సంప్రదాయాలు, సంస్కృతి, కళలు, జీవన విధానాలను భవిష్యత్ తరాలకు పరిచ యం చేయడంతో పాటు పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేసే లక్ష్యంతో ఈ ప్రాజెక్టును ప్రతిపాదించినట్లు తెలిపారు. ఇందులో గిరిజన మ్యూజియం భవనం, ప్రదర్శన గ్యాలరీలు, బహిరంగ ప్రదర్శన ప్రదేశాలు, సాంస్కృతిక కార్యక్రమాల వేదిక, స్థానిక ఉత్పత్తుల విక్రయ కేంద్రాలు, పర్యాటకులకు అవసరమైన మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు.శిఖర్ – గిరిజన యువత నైపుణ్యాలు, ఆరోగ్యం, క్రీడాభివృద్ధి కేంద్రం: గిరిజన యువతలో శారీరక దృఢత్వం, క్రీడా నైపుణ్యాలు, ఆరోగ్యంపై అవగాహన పెంపొం దించడంతో పాటు ఉపాధి, భవిష్యత్ అవకాశాలకు అవసరమైన శిక్షణ అందించేం దుకు రంపచోడవరం కేంద్రంగా శిఖర్ (స్కిల్, హెల్త్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, కైనెటిక్స్ అండ్ అజిలిటీ రిసోర్స్ హబ్) ఏర్పాటుకు ప్రతిపాదించినట్లు తెలిపారు. మా ఊరి మైదానం – 50 గ్రామాల్లో గ్రామీణ క్రీడా మైదానాలు: జిల్లాలోని 12 మండలాల్లో 50 గ్రామాల్లో సుమారు 139.41 ఎకరాల విస్తీర్ణంలో గ్రామీణ క్రీడా మైదానాలను అభివృ ద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు కలెక్టర్ తెలిపారు. గ్రామీణ యువత, విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యాలను ప్రోత్సహించ డం, బాలబాలిక లు, గిరిజన విద్యార్థులకు మెరుగైన క్రీడా వాతావరణం కల్పించడం ఈ ప్రాజెక్టు ప్రధాన ఉద్దేశమన్నారు. గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ప్రతిభావంతులైన క్రీడాకారుల ను గుర్తించి ప్రోత్సహించేందుకు ఈ మైదా నాలు ఎంతగానో దోహదపడతాయని పేర్కొ న్నారు.మోడల్ రిహాబిలిటేషన్ అండ్ రీసెటిల్‌మెంట్ కాలనీ అభివృద్ధి ప్రాజెక్టు: జిల్లాలోని పునరావాస కాలనీల్లో నివసిస్తున్న కుటుంబాల జీవన ప్రమాణాలను మెరుగుపరి చేందుకు ఈ ప్రాజెక్టును ప్రతిపాదించినట్లు కలెక్టర్ తెలిపారు. ఇందులో భాగంగా కమ్యూనిటీ హాల్, కంప్యూటర్లు, ఇంటర్నెట్, డిజిటల్ లైబ్రరీ, లెర్నింగ్ సెంటర్, క్రీడా మైదానాలు, పిల్లల ఆట స్థలాలు, ఓపెన్ జిమ్, తాగునీరు, పారిశుద్ధ్యం, డ్రైనేజీ వంటి సదుపా యాలను కల్పించనున్నట్లు వివరించారు. మహిళలు, పిల్లలు, వృద్ధులు, దివ్యాంగులకు అనువైన సురక్షిత నడక మార్గాలు, సోలార్ విద్యుత్, వీధి దీపాలు, పచ్చదనం, కూర్చునే ప్రదేశాలను కూడా అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు.పునరావాస కాలనీల్లో ముందుగా ప్రాథమిక సర్వే నిర్వహించి, ప్రజల అవసరా లు, అభిప్రాయాల ఆధారంగా అభివృద్ధి పనులను చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. అదేవిధంగా పాఠశాల విద్యార్థులకు కృత్రిమ మేధస్సుపై అవగాహన కల్పించేందుకు ' జ్యోతి' ప్రాజెక్టుకు సంబంధించిన ప్రతిపాదన లు కూడా రూపొందిస్తున్నట్లు తెలిపారు.ఈ నాలుగు ప్రాజెక్టుల ద్వారా గిరిజన ప్రాంతాల్లో సాంస్కృతిక వారసత్వ పరిరక్షణ, పర్యాటక అభివృద్ధి, యువతలో నైపుణ్యాభివృద్ధి, ఆరోగ్య పరిరక్షణ, క్రీడా ప్రతిభ వెలికితీతతో పాటు పునరావాస కాలనీల్లో మెరుగైన జీవన ప్రమా ణాలు కల్పించేందుకు అవకాశం ఏర్పడు తుందని కలెక్టర్ తెలిపారు. ప్రాజెక్టుల అమలు లో జిల్లా యంత్రాంగంతో పాటు పునరావాస శాఖలు, ఇంజినీరింగ్ విభాగాలు, విద్యాశాఖ, క్రీడలు మరియు యువజన శాఖలు, గ్రామపంచా యతీలు, స్థానిక నివాసితుల కమిటీలు సమన్వయంతో భాగస్వాములు కావాలని సూచించారు.ఈ సమావేశంలో చీఫ్ ప్లానింగ్ అధికారి వెంకట్రావు, ఆస్పిరేషనల్ బ్లాక్ అధికారులు లవన్ రెడ్డి, హేమ మాధురి, కృష్ణ, మధుర తదితరులు పాల్గొన్నారు.

ఎంపీపీ అధ్యక్ష, ఉపాధ్యక్షులు, జెడ్పీ చైర్‌పర్సన్, వైస్‌చైర్‌పర్సన్ ఎన్నికల నిర్వహణకు మార్గదర్శకాలు

- కో-ఆప్షన్ సభ్యుల ఎన్నికలకు రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రత్యేక నోటిఫికేషన్
- ఎంపీపీ కో-ఆప్షన్ సభ్యుల ఎన్నికలు నవంబర్ 19, 20 తేదీల్లో, జెడ్పీ కో-ఆప్షన్ సభ్యుల ఎన్నికలు నవంబర్ 20, 21 తేదీల్లో నిర్వహించరు
- జెడ్పీ సి ఈ వో కే పురుషోత్తం రావు

ప్రజా భూమి ప్రతినిధి-రంపచోడవరం

మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు, ఉపాధ్యక్షు లు మరియు జిల్లా ప్రజా పరిషత్ చైర్‌పర్సన్, వైస్‌చైర్‌పర్సన్ ఎన్నికల నిర్వహణకు సంబం ధించి రాష్ట్ర ఎన్నికల సంఘం జారీ చేసిన మార్గదర్శకాలు, సవరణల మేరకు ఎన్నికల ప్రక్రియను నిర్వహించనున్నట్లు జిల్లా పరిషత్ ముఖ్య కార్య నిర్వహణాధికారి కె . పురుషోత్తం రావు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ మండల ప్రజా పరిషత్ సభ్యులు (కో-ఆప్టెడ్), అధ్యక్షులు, ఉపాధ్యక్షులు మరియు జిల్లా ప్రజా పరిషత్ సభ్యులు (కో-ఆప్టెడ్), చైర్‌పర్సన్, వైస్‌చైర్‌ప ర్సన్‌ల ఎన్నికల నిర్వహణ నియమావళి-2006లోని నిబంధన 6(ఎ), 17(ఎ) ప్రకారం కో-ఆప్షన్ సభ్యుల ఎన్నికల కోసం రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రత్యేక నోటిఫికేషన్ జారీ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఎంపీపీ కో-ఆప్షన్ సభ్యుల ఎన్నికలు నవంబర్ 19, 20 తేదీల్లో, జెడ్పీ కో-ఆప్షన్ సభ్యుల ఎన్నికలు నవంబర్ 20, 21 తేదీల్లో నిర్వహిం చడం లేదని స్పష్టం చేశారు.

ఎంపీపీ అధ్యక్ష, ఉపాధ్యక్షుల ఎన్నికలు నవంబర్ 19న

నవంబర్ 19వ తేదీ మధ్యాహ్నం 1 గంటకు కొత్తగా ఎన్నికైన ఎంపీటీసీ సభ్యులతో అధ్యక్షత వహించే అధికారి విధేయతా ప్రమాణం చేయి స్తారని, అనంతరం నిబంధన 9(1) ప్రకారం కోరం పూర్తయిన తరువాత ఎంపీపీ అధ్యక్ష,



ఉపాధ్యక్షుల ఎన్నిక నిర్వహిస్తారని తెలిపారు. అనివార్య కారణాల వల్ల నవంబర్ 19న ఎన్నికలు నిర్వహించడం సాధ్యం కాకపోతే, సెలవు దినమైనప్పటికీ నవంబర్ 20వ తేదీ ఉదయం 11 గంటలకు ఎన్నికలు నిర్వహిం చాలని సూచించారు. నవంబర్ 20న కూడా ఎన్నికలు జరగని పక్షంలో తదుపరి తేదీ నిర్ణ యం కోసం రాష్ట్ర ఎన్నికల సంఘానికి నివేదిం చాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఇప్పటికే సభ్యులకు, పదవీరీత్యా సభ్యులకు జారీ చేసిన నోటీసులు చెల్లుబాటులో ఉంటాయని, ఈ సవరణలను ఎంపీపీ ప్రత్యేక సమావేశాలకు అధ్యక్షత వహించే అధికారులు సభ్యుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు.

జెడ్పీ చైర్‌పర్సన్, వైస్‌చైర్‌పర్సన్ ఎన్నికలు నవంబర్ 20న

జిల్లా ప్రజా పరిషత్‌కు సంబంధించి నవంబర్ 20వ తేదీ మధ్యాహ్నం 1 గంటకు కొత్తగా ఎన్నికైన జెడ్పీటీసీ సభ్యులతో అధ్యక్షత వహిం చే అధికారి విధేయతా ప్ర కోరం పూర్తయిన తరువాత జెడ్పీ చైర్‌పర్సన్, వైస్‌చైర్‌పర్సన్ ఎన్నికల ప్రక్రియను నిర్వహిస్తారని పేర్కొ న్నారు. కో-ఆప్షన్ సభ్యుల ఎన్నికలకు సంబం ధించి రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రత్యేకంగా జారీ చేసే నోటిఫికేషన్ ప్రకారం తదుపరి చర్యలు చేపట్టాల్సి ఉంటుందని జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి ఆ ప్రకటనలో వెల్లడించారు

వి.ఆర్.పురం ఎంపీపీగా గొంది చంద్రయ్య..

వైస్ ఎంపీపీగా కారం సుందరయ్య ప్రమాణ స్వీకారం!

- ఏడు ఎంపీటీసీ స్థానాల్లో నూతన సభ్యుల ప్రమాణ స్వీకారం..
- మండల పరిషత్‌లో నూతన పాలకవర్గం కొలువుదీరింది

ప్రజాభూమి ప్రతినిధి-వి.ఆర్.పురం

వి.ఆర్.పురం మండల పరిషత్‌లో నూతన పాలకవర్గం కొలువుదీరింది. ఇటీవల జరిగిన ఎంపీటీసీ ఎన్నికల్లో విజయం సాధించిన ఏడు గురు సభ్యులు గురువారం ఎంపీడీవో కార్యా లయం వద్ద అధికారుల సమక్షంలో ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం ఎంపీపీ, వైస్ ఎంపీపీ ఎన్నిక ప్రక్రియ నిర్వహించగా, వడ్డిగూడెం ఎంపీటీసీ సభ్యుడు గొంది చంద్రయ్య ఎంపీపీగా, రామవరం ఎంపీటీసీ సభ్యుడు కారం సుందరయ్య వైస్ ఎంపీపీగా



ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన ఎంపీపీ గొంది చంద్ర య్య, వైస్ ఎంపీపీ కారం సుందరయ్య అధికా రుల సమక్షంలో ప్రమాణ స్వీకారం చేసి బాధ్య తలు స్వీకరించారు. ఎంపీడీవో ఇమ్మానియేల్, ఎన్నికల అధికారి ఆధ్వర్యంలో ఎన్నికల ప్రక్రి య నిర్వహించారు. అనంతరం నూతన ఎంపీపీ, వైస్ ఎంపీపీలు వారికి కేటాయించిన స్థానాల్లో కూర్చోబెట్టి శాలువాలతో సత్కరించారు.

మండలంలోని ఏడు ఎంపీటీసీ స్థానాలకు



ఎన్నికైన సభ్యుల వివరాలు ఇలా ఉన్నాయి. రేఖపల్లి ఎంపీటీసీగా వైఎస్సార్‌సీపీ అభ్యర్థి సోడే దినేష్, వడ్డిగూడెం ఎంపీటీసీగా టీడీపీ అభ్యర్థి గొంది చంద్రయ్య, చినమట్టపల్లి ఎంపీ టీసీగా సీపీఎం అభ్యర్థి సున్నం రాజులు, ముల కనపల్లి ఎంపీటీసీగా వైఎస్సార్‌సీపీ అభ్యర్థి బొగ్గా సంకురమ్మ, రామవరం ఎంపీటీ సీగా సీపీఎం అభ్యర్థి కారం సుందరయ్య, జీడిగుప్ప ఎంపీటీసీగా జనసేన అభ్యర్థి కనుగుల హేమ లత, శ్రీరామగిరి ఎంపీటీసీగా వైఎస్సార్ సీపీ అభ్యర్థి సోడే చిరంజీవి ఎన్నికయ్యారు, వారం తా ఎంపీడీవో కార్యాలయ సమావేశం మందిరం అధికారుల సమక్షంలో ప్రమాణ స్వీకారం చేశారు. ఎంపీపీ పదవి టీడీపీకి, వైస్ ఎంపీపీ పదవి సీపీఎంకు దక్కడంతో మండల పరిషత్‌లో రాజకీయ సమీకరణాలు ఆసక్తిక రంగా మారాయి. స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు నూతన పాలకవర్గానికి అభినందనలు తెలిపారు. మండల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం, గ్రామీణ ప్రాం తాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు నూతన పాలకవర్గం సమిష్టిగా కృషి చేయాలని పలువు రు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ డీవో ఇమ్మానియేల్, ఎన్నికల అధికారులు, నూతన ఎంపీటీసీ సభ్యులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


ఎంపీపీ, వైస్ ఎంపీపీ ఎన్నికతో రాజకీయ పార్టీల్లో జోష్..

- నూతన ప్రజాప్రతినిధులకు అభినందనల వెల్లువ!
- గొంది చంద్రయ్య, కారం సుందరయ్యలకు ఘన స్వాగతం..
- ఎంపీటీసీ కనుగుల హేమలతకు, సున్నం రాజులు కు కూటమి నేతలు, సిపిఎం నాయకులు అభినందనలు.

ప్రజాభూమి ప్రతినిధి-వి.ఆర్.పురం

వి.ఆర్.పురం మండల పరిషత్‌లో నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమం అనంతరం మండల రాజకీయాల్లో సందడి నెలకొంది. ఎంపీపీగా ఏకగ్రీవంగా ఎన్నికైన టీడీపీ నాయకుడు గొంది చంద్రయ్య, వైస్ ఎంపీపీగా ఎన్నికైన సీపీఎం నాయకుడు కారం సుందరయ్యతో పాటు నూతనంగా ప్రమాణ స్వీకారం చేసిన ఎంపీటీసీ సభ్యులకు ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు ఘనంగా అభినందనలు తెలిపారు. ఎంపీడీవో కార్యాలయం వద్ద ప్రమాణ స్వీకార కార్యక్రమం ముగించుకుని బయటకు వచ్చిన నూతన ప్రజాప్రతినిధులకు నాయకులు పుష్పగుచ్ఛాలు అందించి, శాలువాలు కప్పి శు భాకాంక్షలు తెలియజేశారు. ముఖ్యంగా ఎంపీపీ పీఠాన్ని ఏకగ్రీవంగా అధిరోహించిన గొంది చంద్రయ్యకు కూటమి నాయకులు అభినందనలు తెలుపుతూ హర్షం వ్యక్తం చేశారు. జీడిగుప్ప ఎంపీటీసీగా ఎన్నికై ప్రమాణ స్వీకారం చేసిన జనసేన అభ్యర్థి కనుగుల హేమలతకు, సిపిఎం అభ్యర్థి సున్నం రాజులుకు కూటమి నాయకులు, సిపిఎం నాయకులు అభినందనలు తెలియజేశారు. వైస్ ఎంపీపీగా బాధ్యతలు చేపట్టిన కారం సుందరయ్య, చినమట్టపల్లి ఎంపీటీసీగా





ప్రమాణ స్వీకారం చేసిన సున్నం రాజులకు సీపీఎం నాయకులతో పాటు కూటమి నాయకులు అభినందనలు తెలిపారు. మండల పరిషత్‌లో నూతన బాధ్యతలు చేపట్టిన ప్రజాప్రతినిధులు ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తూ మండల అభివృద్ధికి కృషి చేయాలని నాయకులు పేర్కొన్నారు. ఎంపీపీ, వైస్ ఎంపీపీ ఎన్నికలు ఏకగ్రీవంగా జరగడంతో మండల రాజకీయాల్లో కొత్త సమీకరణాలు తెరపైకి వచ్చాయి. వివిధ పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులు మండల పరిషత్‌లో బాధ్యతలు చేపట్టిన నేపథ్యంలో గ్రామాల అభివృద్ధి, ప్రజా సమస్యల పరి ష్కారం, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో సమన్వయంతో ముందుకు సాగాలనే ఆకాంక్ష వ్యక్తమైంది. నూతన పాలకవర్గానికి లభించిన అభినందనలు, నాయకుల ఉత్సాహం మండల రాజకీయాల్లో కొత్త జోష్ నింపాయి. ప్రమాణ స్వీకార కార్యక్రమం అనంతరం పలువురు నాయకులు, కార్యకర్తలు నూతన ప్రజాప్రతినిధులతో కలిసి ఫొటోలు దిగుతూ ఆనందాన్ని పంచుకున్నారు.

ప్రజాసేవే లక్ష్యంగా ముందుకు.. సర్పంచ్ అభ్యర్థి బలువు సత్యవతి

ప్రజాభూమి ప్రతినిధి-అడ్డతీగల



అడ్డతీగల మండలం వేటమాడు గ్రామ పంచాయతీ కూటమి బలపరిచిన సర్పంచ్ అభ్యర్థిగా బలువు సత్యవతి పోటీకి సిద్ధమ య్యారు. గతంలో ఒకసారి ఎంపీటీసీగా పనిచేసిన అనుభవంతో పాటు, మదర్ కమిటీ అధ్యక్షురాలిగా గ్రామంలో అంగన్‌వాడీ భవన నిర్మాణానికి కృషి చేసినట్లు తెలిపారు. ఎంపీటీసీగా ఉన్న సమయంలో గ్రామంలో రహదారుల నిర్మాణం చేపట్టించానని పేర్కొన్నారు.నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ, గ్రామ ప్రజల సమస్యలను పరిష్కరిం చేందుకు కృషి చేస్తున్నానని తెలిపారు. పదవులు ఉన్నా లేకున్నా ప్రజాసేవే తన లక్ష్యమని, గ్రామ అభివృద్ధికి మరింత కృషి చేసేందుకు సర్పంచ్‌గా అవకాశం కల్పించాలని బలువు సత్యవతి కోరారు.

ఎంపీపీ వైసీపీ అభ్యర్థి చర్లలు మురళి ప్రమాణ స్వీకారం..



ప్రజా భూమి ప్రతినిధి-కూనవరం (చింతూరు)



చింతూరు మండలంలో 12 ఎంపీటీసీలకు 10 వైసీపీ కైవసం చేసుకోగా ఒకటి టిడిపి ఒకటి బిజెపి తో సరిపెట్టుకున్నవి దీంతో మండలంలో జడ్పీటీసీ వైసీపీ ఎంపీపీ వైసీపీ చిచ్చడి మురళి గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాల యంలో స్థానిక అధికారుల సమక్షంలో పార్టీ నాయ కులు పెద్దల సమక్షంలో ప్రమాణ స్వీకారం కార్యక్రమం ఘనంగా నిర్వహించడం జరిగింది. వారు మాట్లాడుతూ గతంలో నేను జడ్పిటిసిగా చేసిన మంచి పనులు అలాగే వైసిపి మీద ఉన్న నమ్మకం నన్ను మా మాజీ ఎమ్మెల్యే ధనలక్ష్మి అనంతబాబుల సహకారంతో మరలా ఎంపీపీని చేసినందుకు వారికి ఎప్పుడూ రుణపడి ఉంటూ కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను అలాగే నన్ను నా పార్టీని నమ్మి నన్ను గెలిపించినందుకుమిమ్మల్ని నేను ఎప్పుడు రుణపడి ఉంటానని అలాగే మీకు ఎటువంటి సమస్య ఉన్న నేనెప్పుడూ మీకు అందుబాటులోనే ఉంటానని మండల సమస్య లను అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించే దిశగా ప్రయత్నిస్తానని వారు తెలియజేశారు అలాగే వైస్ ఎంపీపీ లేల భద్రయ్య ప్రమాణ స్వీకారం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ సిబ్బంది వైసిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

పంచాయతీ ఎన్నికల బరిలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు.. నామినేషన్ల జోరు!

- రేఖపల్లి, జీడిగుప్ప, వడ్డిగూడెం, కుందులూరు సర్పంచి స్థానాలకు అభ్యర్థుల నామినేషన్లు దాఖలు..
- వార్డు సభ్యుల స్థానాలకు సైతం నామినేషన్లు వేసిన అభ్యర్థులు



ప్రజాభూమి ప్రతినిధి-వి.ఆర్.పురం.

వి.ఆర్.పురం మండలంలో పంచాయతీ ఎన్నికల సందడి నెలకొంటోంది. గ్రామ పంచాయతీల్లో సర్పంచి, వార్డు సభ్యుల స్థానాలకు ఎన్నికల ప్రక్రియ వేగవంతం కావడంతో రాజకీయ పార్టీలు తమ అభ్యర్థులను రంగంలోకి దింపుతున్నాయి. ఈ నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ నాయకుల ఆధ్వర్యంలో ఆయా గ్రామాల్లో సర్పంచి, వార్డు సభ్యుల అభ్యర్థులు గురువారం నామినేషన్లు దాఖలు చేశారు. రేఖపల్లి గ్రామ సర్పంచి స్థానానికి చిట్కాల బాలు, జీడిగుప్ప సర్పంచి స్థానానికి కనుగుల స్వాతి, వడ్డిగూడెం సర్పంచి స్థానానికి సోడే రమణయ్య, కుందులూరు సర్పంచి స్థానానికి సాధల నరేంద్రరెడ్డి నామినేషన్లు సమర్పించారు. ఆయా గ్రామాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలో అభ్యర్థులు నామినేషన్ ప్రక్రియను పూర్తి చేశారు. సర్పంచి స్థానాలతో పాటు మండలంలోని పలుచోట్ల వార్డు సభ్యుల స్థానాలకు కూడా వైఎస్సార్‌సీపీ మద్దతుతో అభ్య ర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. నామినేషన్ల సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు అభ్యర్థులకు మద్దతుగా నిలుస్తూ ఎన్నికల ప్రచారానికి సమాయత్తమవుతున్నారు. గ్రామస్థాయి ఎన్నికలు కావడంతో స్థానిక సమస్యలు, అభివృద్ధి కార్యక్రమాలు, తాగునీరు, రహదారులు, పారిశుధ్యం, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు వంటి అంశాలు ఎన్నికల్లో ప్రధాన చర్చనీ యాంశాలుగా మారనున్నాయి. నామినేషన్ల ప్రక్రియతో గ్రామాల్లో రాజకీయ వాతావరణం వేడెక్కుతుండగా, రానున్న రోజుల్లో ప్రచారం మరింత ఊపందుకోనుంది. మండలంలోని వివిధ పంచాయతీల్లో అభ్యర్థుల ఎంపిక, నామినేషన్ల దాఖలుతో గ్రామస్థాయి రాజకీయ సమీకరణాలు ఆసక్తికరంగా మారుతున్నాయి. ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులు ఓటర్ల మద్దతు కూడగట్టుకునేందుకు తమ తమ వ్యూహాలకు పదును పెడుతున్నారు.

ఐదుగురు ఎంపీటీసీలతో జనసేన ఎంపీపీ వైస్ ఎంపీపీ సిపిఎం కుదిరిన ఒప్పందం..

ప్రజా భూమి ప్రతినిధి-కూనవరం



మండలంలోని 8 ఎంపీటీసీ గాను కూటమి ప్రభుత్వము నుండి టిడిపి 4 జనసేన రెండు గెలుచుకున్నాయి సిపిఎం రెండు స్థానాలుకి పరిమితం కావాల్సి వచ్చింది కానీ అనూహ్య కారణాలవల్ల జనసేన రెండు సిపిఎం రెండు టీడీపీ నుండి ఒక్కరు మద్దతు ఇవ్వడంతో జనసేన అభ్యర్థి చిన్న ఆర్కూర్ ఎంపీటీసీ రమాదేవి వైస్ ఎంపీపీ గా సిపిఎం పార్టీ పెద్దార్కుర్ ఎంపీటీసీ పాయం సీతారామయ్య స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ప్రమాణ స్వీకారం చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో జనసేన ఎంపీపీ రమాదేవి మాట్లాడుతూ నాకు నా జనసేన మిత్రులు అలాగే నాకు సపోర్ట్ ఇచ్చిన సిపిఎం టిడిపి నుండి ఒకరు వారందరికీ ధన్యవాదాలు తెలియజేస్తూ ఎంపీపీగా నేను చేయాల్సిన పనులన్నీ సక్రమంగా నిర్వహించి జనసేన పార్టీని బలోపేతం చేయడం కోసం పాటుపడతారని ఆమె తెలియజేశారు ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు కార్యకర్తలు సిపిఎం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

ప్రజాభూమి

జనరల్

శుక్రవారం, నవంబర్ 20, 2026

ఎంపీపీల ఎన్నిక వాయిదా

❖ మచిలీపట్నం సౌత్ మండలంలో 13 మందికి ఒక్కరే హాజరు

❖ మచిలీపట్నం నార్త్‌లో ఎవ్వరూ హాజరు కాలేదు ❖ కోరం లేక ఎన్నిక నేటికి వాయిదా..

ప్రజాభూమి ప్రతినిధి, మచిలీపట్నం:

మచిలీపట్నం మండలం నార్త్, సౌత్ మండలాల్లో ఎంపీటీసీల ప్రమాణస్వీకారం, ఎంపీపీ ఎన్నిక కోరం లేక వాయిదా పడింది. మచిలీపట్నం సౌత్ మండలంలో 11మంది ఎంపీటీసీలకు ఒక్కరే హాజరయ్యారని, అందువల్ల ఎంపీపీల ఎన్నిక, వైస్ ఎంపీపీ ఎన్నిక, ఎంపీటీసీల ప్రమాణస్వీకారం శుక్రవారం ఉదయం 11 గం.లకు నిర్వహిస్తున్నట్లుగా మచిలీపట్నం సౌత్ ఎంపీడీవో ఎం.ఎన్.ఎస్. మర్తి మీడియాకు తెలిపారు. అలాగే మచిలీపట్నం నార్త్‌లో కూడా 9 మంది ఎంపీటీసీలకు గాను ఒక్కరు కూడా హాజరు కాకపోవడంవల్ల గురువారం నిర్వహించవలసిన ఎంపీటీసీల ప్రమాణస్వీకారం, ఎంపీపీ ఎన్నిక, వైస్ ఎంపీపీ ఎన్నికలను కోరంలేక పోవడంవల్ల శుక్రవారం ఉ. 11గం.లకు వాయిదా వేయడం జరిగిందని మచిలీపట్నం నార్త్ ఎంపీడీవో ఎ. బాలకృష్ణారావు తెలిపారు. కావున నేడు అనగా శుక్రవారం ఉ. 11 గం.లకు ఎంపీటీసీల ప్రమాణ స్వీకారం తదుపరి ఎంపీపీ, వైస్ ఎంపీపీల ఎన్నికను నిర్వహిస్తామని ఇరువురు ఎంపీడీవోలు తెలిపారు.

డివైడర్ సమస్యను తీర్చిన చిన్న సుబ్బయ్య



❖ ప్రజా సమస్యలే లక్ష్యంగా పనిచేస్తున్న టిడిపి నేత చిన్న సుబ్బయ్య

❖ ఓటమి చెందినప్పటికీ ప్రజల హృదయాలను గెలుచుకున్న తీరు ❖ ప్రజా సమస్యల పరిష్కారం కోసం34వ డివిజన్ లో ప్రత్యేక వాట్సాప్ గ్రూప్

❖ చిన్న సుబ్బయ్య పై పెరుగుతున్న ప్రత్యేక ఆదరణ

ప్రజా భూమి ప్రతినిధి విజయవాడ

భవానిపురం స్వాతి రోడ్డు ప్రాంతం స్మశాన వాటిక కి ఎదురుగా గత మూడు సంవత్సరాలుగా పరిష్కారం కానీ డివైడర్ సమస్యని నిమిషాల వ్యవధిలో పరిష్కరించిన తెలుగుదేశం పార్టీ నాయకుడు పోనుగుపాటి చిన్న సుబ్బయ్య, ప్రజా సమస్య పరిష్కారం కోసం34వ డివిజన్ లో చిన్నసుబ్బయ్య, ప్రత్యేక వాట్సాప్ గ్రూపును ఏర్పాటు చేశారు. ఈ ప్రాంతంలో గత మూడు ఏళ్లుగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మాజీ కార్పొరేటర్ ఆంజనేయ రెడ్డి ప్రజా సమస్యల పరిష్కారాలను ఏమాత్రం పట్టించుకోలేదని ఆయన అన్నారు. తాజాగా డివైడర్ సమస్యను నిమిషాల వ్యవస్థల పరిష్కరించి ప్రజల హృదయాలను సుబ్బయ్య గెలుచుకున్నారు. డివిజన్ ప్రజల నుంచి సుబ్బయ్య పై అభినందనలు వెలువెత్తుతున్నాయి. ప్రజా సమస్యలను పరిష్కరించటమే లక్ష్యంగా ప్రజలకు మంచి చేయాలని ఆయన ప్రత్యక్షంగా ప్రజలతో మమేకమౌతున్న తీరు అభినందనీయం. తమ సమస్యను చిన్న సుబ్బయ్య పరిష్కరించారు, గత ప్రభుత్వంలో కార్పొరేటర్ గా పనిచేసిన ఆంజనేయ రెడ్డి తీరుపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆంజనేయ రెడ్డి పేరుకే కార్పొరేటర్ అయినప్పటికీ,ఇక్కడ నిజంగా ఓటమి చెందినప్పటికీ ప్రజల హృదయాలను గెలుచుకున్న చిన్న సుబ్బయ్యకే స్థానికులు సమస్యలు చెప్పుకుంటూ సమస్యను పరిష్కరించుకుంటున్నారు. ఈ కార్యక్రమంలో పొనుగుపాటి వెంకటసుబ్బయ్య, 34వ డివిజన్ టిడిపి కార్పొరేటర్ అభ్యర్థి పొనుగుపాటి విజయలక్ష్మి, చెరుకుపల్లి సుబ్బారెడ్డి, చింతలచెరువు ప్రసాద్ రెడ్డి, ముల్లంగి నాసరరెడ్డి, చింతలచెరువు వెంకటరెడ్డి, దుగ్గినేని వెంకట నరసయ్య,గుంటుపల్లి వెంకటేశ్వర్లు,పెండ్యాల వెంకటాద్రి, కమ్మ మాల కొండయ్య, చింతగుంపల రామానాయుడు, తదితర నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

నడకుదిటి శేషమల్లేశ్వరి భౌతికకాయానికి మేయర్ అబ్దుల్ అబీదా నివాళులు

కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి.. ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థన



మచిలీపట్నం, ప్రజాభూమి ప్రతినిధి:

స్వర్గీయ మాజీ మంత్రి నడకు దిటి నరసింహారావు సతీమణి, రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర సోదరి నడకుదిటి శేషమల్లేశ్వరి భౌతికకాయానికి మచిలీపట్నం నగర మేయర్ అబ్దుల్ అబీదా నివాళులర్పించారు. ఆమె పార్థివదేహాన్ని సందర్శించి పుష్పాంజలి ఘటించి, ఘనంగా అంజలి సమర్పించారు. ఈ సందర్భంగా శేషమల్లేశ్వరి కుటుంబ సభ్యులను పరామర్శించిన మేయర్ అబ్దుల్ అబీదా, వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కుటుంబానికి కలిగిన తీరని లోటు పట్ల విచారం వ్యక్తం చేస్తూ, ఈ విషాద సమయం లో మనోధైర్యంతో ఉండాలని ఓదార్చారు. శేషమల్లేశ్వరి ఆత్మ కు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు.శేషమల్లేశ్వరి మృతి పట్ల పలువురు ప్రము ఖులు, ప్రజాప్రతినిధులు సంతాపం వ్యక్తం చేస్తూ, కుటుంబ సభ్యులకు తమ సానుభూతిని తెలియజేశారు.



జనాభా గణన శిక్షణలో క్షేత్రస్థాయి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలి

❖ శిక్షణలో ప్రాక్టికల్‌గా నేర్పించడంతో పాటు సందేహాల నివృత్తికి ప్రత్యేక సమయం కేటాయించాలి

❖ జిల్లా కలెక్టర్ డీకే బాలాజి

ప్రజాభూమి ప్రతినిధి, మచిలీపట్నం:

భారత జనాభా లెక్కలు–2027లో భాగంగా రెండవ దశ జనాభా గణనకు సంబంధించి క్షేత్ర స్థాయిలో విధులు నిర్వహించే ఎన్యూమరేటర్లు, సూప ర్వైజర్లకు శిక్షణ ఇచ్చే ఫీల్డ్ ట్రైనర్లు ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా నేర్చుకుని, ప్రాక్టికల్‌గా బోధిం చాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజి సూచిం చారు. శిక్షణలో ఏ ఒక్క అంశం కూడా విడిచిపె ట్టకుండా, ప్రతి వ్యక్తి వివరాలను ఖచ్చితంగా నమోదు చేసేలా సిబ్బందికి అవగాహన కల్పిం చా లని స్పష్టం చేశారు.

గురువారం కలెక్టరే ట్‌లోని పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో భా రత జనాభా లెక్కలు–2027లో భాగంగా రెండవ దశ జనాభా గణనకు సంబంధించి క్షేత్ర శిక్షకుల (ఫీల్డ్ ట్రైనర్స్) శిక్షణ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొని దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జనాభా గణనలో



వినియోగించే యాప్ ద్వారా వివరాల నమోదు వంటి అంశాలు క్షేత్రస్థాయిలో కొంత క్లిష్టంగా ఉండే అవకాశం ఉందన్నారు. అందువల్ల శిక్షణ లో కేవలం సిద్ధాంతపరమైన వివరణలకే పరిమి తం కాకుండా, యాప్ వినియోగం, వివరాల నమోదు తదితర అంశాలను ప్రాక్టికల్‌గా చేసి చూ పించి శిక్షణ ఇవ్వాలన్నారు. విధుల నిర్వహ ణలో ఎదురయ్యే వివిధ సందేహాలను నివృత్తి చేసేందుకు ప్రతి శిక్షణ కార్యక్రమం చివర ప్రత్యేకంగా డౌట్ క్లియరింగ్ సెషన్ ఏర్పాటు చేయాలని సూచించారు. దీని వల్ల క్షేత్రస్థాయిలో సిబ్బంది మరింత సమ ర్థవంతంగా, స్పష్టమైన అవగాహ నతో విధులు నిర్వ హించగల రన్నారు. జనాభా గణన మొదటి దశ లో గృహాల జాబితా తయారీ (హౌస్ లిస్టింగ్ ఆపరేష న్) ద్వా రా భవనాలు, గృహాలకు సంబం ధించిన ప్రాథ మిక వివరాలు సేకరిం చడం జరిగిందని తెలి పారు. ఇప్పుడు జరగబోయే రెండవ దశలో ప్రతి ఇంటిలో నివసించే వ్యక్తుల పూర్తి వివరాలను సేకరించి నమోదు చేయడం జరుగుతుం దన్నారు.

ఈ ప్రక్రియలో ఇప్పటికే మ్యా పింగ్ చేసిన గృహాలను ఆధారంగా చేసు కుని ఆయా ఇళ్లలోని జనాభా వివరాలను సేకరిం చాల్సి ఉంటుందని వివరించారు.ప్రస్తుతం రెండవ బ్యాచ్ ఫీల్డ్ ట్రైనర్లకు ఈ నెల 16 నుంచి 21వ తేదీ వరకు శిక్షణ అందిస్తున్నారని, శిక్షణ పొందిన ఫీల్డ్ ట్రైనర్లు సంబంధిత మండలాల్లో ఎన్యూమరే టర్లు, సూపర్వైజర్లకు శిక్షణ ఇవ్వాల్సి ఉంటుందని, ఎన్యూమరేటర్లు, సూపర్వైజర్లుగా గ్రామ, వార్డు సచివాలయ సిబ్బందిని నియమిం చనున్నట్లు తెలిపారు. డిసెంబర్ మొదటి వారం నుంచి క్షేత్రస్థాయి సిబ్బందికి శిక్షణ ప్రారంభమ వుతుందని పేర్కొ న్నారు. ఫీల్డ్ ట్రైనర్లు ముందుగా తాము పూర్తి అవగాహనతో శిక్షణ పొందాలని, అనంతరం క్షేత్రస్థాయి సిబ్బందికి ఎలాంటి తేడాలు, లోపాలు లేకుండా ఒకే విధంగా శిక్షణ అందిం చాలని కలెక్టర్ ఆదేశించారు.

జనాభా గణనలో ఏ ఒక్క వ్యక్తి వివరాలు కూడా మిస్ కాకుండా, ప్రతి ఇంటిని, ప్రతి వ్యక్తిని కచ్చితంగా కవర్ చేయాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు. రెండవ దశలో కూడా ప్రజలకు స్వీయ గణన (సెల్ఫ్ ఎన్యూమరే షన్) చేసుకునే అవకాశం ఉంటుందని, ఇందుకు సంబం ధించిన ప్రక్రియ జనవరిలో ప్రారంభమై 15 రోజుల పాటు కొనసాగుతుందని తెలిపారు. అనంతరం జనవరి 25 నుంచి ఫిబ్రవరి 28 వరకు జనాభా గణన ప్రక్రియ చేపట్టనున్నట్లు వివ రించారు.

ఈ నేపథ్యంలో శిక్షణ పొందుతున్న ఫీల్డ్ ట్రైనర్లు పూర్తి నిబద్ధతతో శిక్షణ పొంది, క్షేత్రస్థాయిలో జనాభా గణన విజయవంతంగా నిర్వహించేలా సిబ్బందిని సన్నద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు.

నాణ్యతా ప్రమాణాలతో పోలీస్ శిక్షణ కేంద్రం నిర్మాణం పూర్తి చేయాలి





పనులను వేగవంతం చేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయండి

రాష్ట్ర పోలీస్ డీజీపీ హరీష్ కుమార్ గుప్తా ఆదేశం

మచిలీపట్నం, ప్రజాభూమి ప్రతినిధి:

కృష్ణా జిల్లా పెదకరగ్రహారంలో నూతనంగా నిర్మిస్తున్న జిల్లా పోలీస్ శిక్షణ కేంద్రం నిర్మాణ పనులను రాష్ట్ర పోలీస్ డైరెక్టర్ జనరల్ (డీజీపీ) హరీష్ కుమార్ గుప్తా, ఐపీఎస్ గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నిర్మాణ పనుల పురోగతిని సమీక్షించి, మిగిలిన పనులను త్వరితగతిన పూర్తి చేసి శిక్షణ కేంద్రాన్ని ప్రారం భోత్సవానికి సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ పర్యట న లో ఏలూరు రేంజ్ ఐజీ జి.వి.జి. అశోక్ కుమార్, కృష్ణా జిల్లా ఎస్పీ వి. విద్యాసాగర్ నాయుడు, ఏలూరు జిల్లా ఎస్పీ కె. ప్రతాప్ శివ కిషోర్ తదితర పోలీసు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. శిక్షణ కేంద్రం లోని వివిధ భవనాలు, మౌలిక సదుపా యాలు, పోలీసు సిబ్బందికి శిక్షణ అందించేం దుకు అవసరమైన వసతులను డీజీపీ స్వయంగా పరిశీలించారు. నిర్మాణ పనులు దాదాపు తుది దశకు చేరుకున్న నేప థ్యంలో ఇంకా చేపట్టాల్సిన పనులు, కల్పిం చాల్సిన అదనపు సౌకర్యాలపై అధికారులతో చర్చించారు.అనంతరం పోలీసు గృహ నిర్మాణ సంస్థ అధికారులతో సమావేశమై ఇప్పటివరకు పూర్తయిన పను లు, ప్రస్తుతం కొనసాగుతున్న పనులు, మిగిలి ఉన్న నిర్మా ణాలు, పనుల పూర్తికి ఎదురవుతున్న అవరో ధాలు, సాంకేతిక సమస్యలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు నిర్మాణ పనుల పురోగతిని డీజీపీకి వివరించారు.భవిష్య త్తులో ఈ శిక్షణ కేంద్రంలో శిక్షణ పొందే పోలీ సు సిబ్బం దికి అవసరమైన అన్ని సౌకర్యాలు అందుబా టులో ఉండేలా ప్రణాళి కలు రూపొం దించాలని డీజీపీ సూచిం చారు. అదనపు నిర్మాణాలు చేపట్టాల్సిన అవసరముంటే వాటిని ముందుగానే గుర్తించి తగిన చర్యలు తీసుకోవా లని తెలిపారు. నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమా ణాలను తప్పనిసరిగా పాటిం చాలని, భద్రతా నిబంధనల విషయంలో ఎలాం టి నిర్లక్ష్యానికి తావివ్వరాదని స్పష్టం చేశారు. భవిష్యత్తులో ప్రమాదాలు సంభవించకుండా అవసరమైన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారు లకు దిశానిర్దేశం చేశారు. నిర్మాణ పనుల పూర్తికి ఎదురవుతున్న సమస్యల ను సంబంధిత విభాగాల అధికారులు సమన్వ యంతో పరిష్క రించుకోవాలని డీజీపీ అదేశిం చారు. నిర్దిష్ట ప్రమాణాలకు అనుగు ణంగా పనులను వేగవంతం చేసి, మిగిలిన అన్ని పనులను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయా లని సూచించారు.జిల్లా పోలీసు సిబ్బందికి మెరుగైన శిక్షణ, అవసరమైన వసతులు కల్పించడంలో ఈ శిక్షణ కేంద్రం కీలకంగా నిలవనున్న నేపథ్యంలో, నిర్మాణ పనులను ప్రణాళికాబ ద్ధంగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావా లని ఉన్నతాధికారులు దృష్టి సారించారు.

సేవే లక్ష్యంగా.. గ్రామాభివృద్ధే ధ్యేయంగా!

తురిమెల్ల సర్పంచ్‌గా నాగమణిని గెలిపించుకోవాలని గ్రామస్థుల ఆకాంక్ష

తురిమెల్ల, ప్రజాభూమి ప్రతినిధి:

అధికార పదవి లేకున్నా ప్రజలకు అండగా నిలుస్తూ, గ్రామాభివృద్ధికి తనవంతు తోడ్పాటు నందిస్తున్న కూటమి బలపరిచిన జనసేన పార్టీ సర్పంచ్ అభ్యర్థి చెన్నకేశవుల నాగమణిని భారీ మెజారిటీతో గెలిపించుకోవాలని తురిమెల్ల గ్రామస్థులు ఆకాంక్షిస్తున్నారు. పదవులు లేకపో యినా ప్రజాసేవలో ముందుండే నాగమణి, ఆమె భర్త చెన్నకేశవుల సుబ్బరాయుడు చేసిన సేవా కార్యక్రమాలు గ్రామంలో చర్చనీయాంశంగా మారాయి.గత ఎన్నికల్లో పోటీ చేసి ఓటమి పాలైనప్పటికీ, చెన్నకేశవుల దంపతులు గ్రామ ప్రజలతో మమేకమై సేవా కార్యక్రమాలను కొన సాగించారని స్థానికులు గుర్తుచేస్తున్నారు. గ్రామానికి అవసరమైన పనుల్లో తమవంతు సహకారం అందిస్తూ, పేదలకు అండగా నిలుస్తున్న వారి సేవా తత్పరత అభినందనీయ మని పేర్కొంటున్నారు.గ్రామంలో స్మశానవాటిక లేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని గుర్తించిన చెన్నకేశవుల దంపతులు తమ సొంత ధనంతో స్థలం కొనుగోలు చేసి స్మశానవాటిక ఏర్పాటుకు విరాళంగా అందిం చినట్లు గ్రామస్థులు చెబుతున్నారు. అలాగే గ్రామంలోని అలయానికి ధ్వజస్తంభాన్ని ఏర్పాటు చేసి భక్తుల ఆకాంక్షను నెరవేర్చారు. విద్యాభివృద్ధికి ప్రాధాన్యమిస్తూ ప్రభుత్వ పాఠశాలలో ఒకటి నుంచి ఏడో తరగతి వరకు చదువుతున్న పేద విద్యార్థులకు ఏటా పుస్తకాలు పంపిణీ చేస్తూ విద్యార్థులను ప్రోత్సహి స్తున్నారు. గ్రామంలో పేద కుటుంబాలకు ఆపద ఎదురైనప్పుడు తమకు చేతనైన సహాయం



అందిస్తూ అండగా నిలుస్తున్నారని స్థానికులు పేర్కొంటు న్నారు.ఈ సందర్భంగా సర్పంచ్ అభ్యర్థి చెన్నకేశవుల నాగమణి మాట్లాడుతూ, గ్రామ ప్రజలు తనను ఆశీర్వదించి సర్పంచ్‌గా గెలిపించాలని కోరారు. గ్రామాభివృద్ధికి పదవితో పాటు చిత్తశుద్ధి, సేవాభావం ఎంతో అవసరమని పేర్కొన్నారు. ప్రజలు తనకు అవకాశం కల్పిస్తే గ్రామంలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి కృషి చేస్తానని, అవసర మైన సందర్భాల్లో తన సొంత ధనాన్ని సైతం వెచ్చించి తురిమెల్లను అభివృద్ధి పథంలో నడిపిం చేందుకు శ్రమిస్తానని తెలిపారు.అధికారంలో లేకున్నా గ్రామానికి సేవలందించిన చెన్నకేశ వుల దంపతులకు ఈ ఎన్నికల్లో ప్రజల మద్దతు లభిస్తుందనే ఆశాభావం గ్రామంలో వ్యక్తమవు తోంది. అయితే, తుది నిర్ణయం ఓటర్లదే. గ్రామాభివృద్ధి, ప్రజాసేవ, అభ్యర్థి పనితీరు వంటి అంశాల ఆధారంగా ఓటర్లు తమ తీర్పు వెల్లడించనున్నారు.

మోపిదేవిలో 'మన–2026' రాష్ట్రస్థాయి సాంకేతిక ఉత్సవం

పోస్టర్‌ను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ

డిసెంబర్ 14, 15 తేదీల్లో డ్రోన్, రోబోటిక్స్, ఆవిష్కరణల ప్రదర్శనలు

మచిలీపట్నం, ప్రజాభూమి ప్రతినిధి:

ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్ప థం, సాంకేతిక నైపుణ్యాలు, సృజనాత్మకతను పెంపొందించే లక్ష్యంతో కృష్ణా జిల్లా మోపిదేవి లోని పీఎం శ్రీ జడ్పీహెచ్ఎస్ ప్లస్ పాఠశాల ప్రాంగణంలో డిసెంబర్ 14, 15 తేదీల్లో 'మన–2026 (మైండ్స్ ఆఫ్ ఆంధ్ర–నర్చరింగ్ ఆస్పి రెంట్స్)' పేరుతో రెండు రోజుల రాష్ట్రస్థాయి సాంకే తిక, ఆవిష్కరణల ఉత్సవాన్ని నిర్వహిం చనున్నారు.ఈ ఉత్సవానికి సంబంధించిన అధికా రిక పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ గురు వారం ఆవిష్కరించారు. విజయవాడకు చెందిన స్కై స్పేస్ సంస్థ సహకారంతో పీఎం శ్రీ జడ్పీ హెచ్ఎస్ ప్లస్, మోపిదేవి ఈ కార్యక్రమాన్ని నిర్వ హిస్తోంది.రాష్ట్రవ్యాప్తంగా 100కు పైగా పాఠశా లల నుంచి విద్యార్థులు పాల్గొని వందకు పైగా వినూత్న ప్రాజెక్టులను



ప్రదర్శించనున్నారు. ఎలక్ట్రానిక్స్, ఎంబెడెడ్ సిస్టమ్స్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐఓటీ), రోబోటిక్స్, డ్రోన్లు, త్రీడీ ప్రింటింగ్, స్పేస్ టెక్నాలజీ, ఏరోమోడలింగ్ తదితర ఎనిమిది సాంకేతిక విభాగాల్లో విద్యార్థులు తమ ప్రతిభను ఆవిష్కరించనున్నారు.ఉత్సవంలో డ్రోన్ రేసింగ్, రోబో మిషన్, రోబో మేజ్ పోటీలతో పాటు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఉచితంగా రాష్ట్రస్థాయి ప్రాజెక్టుల ప్రదర్శన పోటీ నిర్వహించనున్నారు. ముగ్గురు విద్యార్థులతో కూడిన బృందాలు తమ ప్రాజెక్టు లను సమర్పిం చవచ్చని నిర్వాహకులు తెలిపారు. ఎంపికైన ఉత్తమ పది ప్రాజెక్టులను ప్రత్యేకంగా ప్రదర్శిం చడంతో పాటు తొలి ఐదు ఉత్తమ ప్రాజెక్టులకు నగదు బహుమతులు ప్రదానం చేయనున్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ జిల్లా విద్యాశాఖ అధికారికి పలు సూచనలు చేశారు. జిల్లాలో అటల్ టింకరింగ్ ల్యాబ్‌లు ఉన్న పది పాఠశాలలను ఇతర పాఠశా లలతో అనుసంధానం చేసి, అన్ని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఆ ల్యాబ్‌లను వినియో గించుకునేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. విద్యార్థులకు సాంకేతిక శిక్షణ, ప్రయోగాత్మక అభ్యాసం, ఆవిష్కరణలకు సమాన అవకాశాలు కల్పించాలని సూచించారు.జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులంతా ఈ ఉత్సవంలో పాల్గొని తమ వినూత్న ఆలోచనలను ప్రాజెక్టుల రూపంలో ప్రదర్శించాలని కలెక్టర్ పిలుపుని చ్చారు. విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీసి, ఆచరణాత్మక ఆవిష్కరణలుగా తీర్చిది ద్దేందుకు 'మన–2026' ఉత్తమ వేదికగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పీఎం జడ్పీహెచ్ఎస్ ప్లస్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పి. జయంతి, స్కై స్పేస్ వ్యవస్థాపకుడు, సీఈఓ ఇందుగు వేణుకుమార్ తదితరులు పాల్గొన్నారు.విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సాంకేతిక రంగంపై ఆసక్తి ఉన్నవారు ఈ ఉత్సవాన్ని సందర్శించి వినియో గించుకోవాలని నిర్వాహకులు కోరారు.

Printed by MK PUBLICATIONS AND OFFSET PRINTERS Published by ANKIREDDYPALLE RAMAMOHAN REDDY on behalf of ANKIREDDYPALLE RAMAMOHAN REDDY , printed at visakhapatnam and published at D. No.k31-27-31/3,oppsite pavanpublic school,duvvada station road,kurmnnapalem, visakhapatnam, editor ANKIREDDYPALLE RAMAMOHAN REDDY .RNI NO:APTEL/25/A1888.cell:9502116677.

ప్రజాభూమి

జనరల్ 13

శుక్రవారం 20 నవంబరు 2026

అడ్డతీగల ఎంపీపీగా జర్తా వెంకటరమణారెడ్డి ప్రమాణ స్వీకారం



ప్రజాభూమి ప్రతినిధి-అడ్డతీగల

మండల ప్రజా పరిషత్ అధ్యక్షుడిగా జర్తా వెంకటరమణారెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు. రిటర్నింగ్ అధికారి కె. రమణ నూతన ఎంపీపీకి నియామక పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ.. తనకు ఎంపీపీ పదవి అప్పగించిన తెలుగుదేశం పార్టీ అధిష్ఠానానికి, పార్టీ పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు. తన రాజకీయ ఎదుగుదలకు సహకరించిన వేటమామిడి ఎంపీటీసీ పరిధిలోని ప్రజలకు, తనను ఏకగ్రీవంగా ఎంపీపీగా ఆమోదించిన ఎంపీటీసీ సభ్యులకు పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు.పార్టీ అధికారంలో ఉన్నా లేకపోయినా తాను పార్టీని వీడకుండా, ఎన్నో కష్టాలు ఎదురైనా పార్టీకి అండగా నిలిచానని పేర్కొన్నారు. మండల పార్టీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి కార్యకర్తలందరినీ కలుపుకొని పార్టీ బలోపేతానికి కృషి చేశానన్నారు.తెలుగుదేశం పార్టీని నమ్ముకున్న కార్యకర్తలను పార్టీ ఎప్పుడూ గుర్తిస్తుందని, పదవుల కోసం కాకుండా నిబద్ధతతో పనిచేసే వారికి తగిన గుర్తింపు లభిస్తుందని తెలిపారు. తనపై పార్టీ ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ అడ్డతీగల మండల అభివృద్ధికి కృషి చేస్తానని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో మండల కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జనసేన నుండి.. టిడిపికి ఎదురు దెబ్బ



ప్రజా భూమి ప్రతినిధి-కూనవరం

మండలంలోని ఎనిమిది ఎంపీటీసీలకు కూటమి ప్రభుత్వం లో టిడిపి నాలుగు జనసేన రెండు గెలుచుకొని ఎంపీపీ ఇస్తానని కైవసం చేసుకున్నాయి అనుకున్నారు కానీ జనసేన కూటమి నుండి బయటికి వెళ్లిపోయి సిపిఎం జనసేన ఒక టిడిపి అభ్యర్థితో కలిసి ఎంపీపీ స్థానాన్ని జనసేన కైవసం చేసుకోవడంతో టీడీపీకి మండలంలో ఎదురు దెబ్బ తగిలినట్టు అనిపించింది వెంటనే టిడిపి వారు స్పందించి ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మాట్లాడుతూ జనసేన నాయకులు అమ్ముడుపోయారని అది సాక్షాత్తు సిపిఐ జడ్పిటిసి గుజ్జా మోహన్ రావు తెలియజేశారని అలాంటివారిని నమ్మటం మా తప్పని వారు తెలియజేశారు వెంటనే విప్పు ప్రకటించి రిటర్నింగ్ అధికారికి కూటమి ప్రభుత్వం నుండి విప్పు దరఖాస్తులు వారికి అందించడం జరిగింది వారు స్పందిస్తూ జడ్పీ కి పంపిస్తాను అని వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఎంపీటీసీలు కార్యకర్తలు పాల్గొన్నారు.ం

ఎంపీపీ , ఎంపీటీసీ సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమం



ప్రజాభూమి ప్రతినిధి - అడ్డతీగల

అడ్డతీగల మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ, ఎంపీటీసీ సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఎంపీడీవో ఏవీవీ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అధ్యక్షుడిగా (ఎంపీపీ) జర్తా వెంకటరమణారెడ్డి ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. అనంతరం నూతనంగా ఎన్నికైన ఎంపీటీసీ సభ్యులతో అధికారులు ప్రమాణ స్వీకారం చేయించారు.ఈ సందర్భంగా నూతన ఎంపీపీ, ఎంపీటీసీ సభ్యులను శాలువాలు కప్పి, పూలమాలలతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ వంతల రాజేశ్వరి పాల్గొని నూతన ప్రజాప్రతినిధులకు శుభాకాంక్షలు తెలిపారు.ఎంపీటీసీలుగా అడ్డతీగల-2 నుంచి ఎడ్ల శ్రీదేవి, ధాన్యంపాలెం నుంచి మడకం భాగ్యలక్ష్మి, డి.రామవరం నుంచి వంతల సూర్యనారాయణరెడ్డి, తిమ్మాపురం నుంచి కోసూరి హంసలేఖ, సోమన్నపాలెం నుంచి చెక్క వెంకటరమణ (అబ్బులు), అడ్డతీగల-1 నుంచి చింతపల్లి రఘు, బొడ్లంక నుంచి నక్క వీర్రాజు (మోహన్), గొంతువానిపాలెం నుంచి మాడెం గంగోత్రి, కోనలోవ నుంచి పడాల వెంకటరమణ (బాబి) ప్రమాణ స్వీకారం చేశారు.నూతనంగా బాధ్యతలు చేపట్టిన ప్రజాప్రతినిధులకు పలువురు నాయకులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలిపారు.

గుర్తేడు ఎంపీపీ ప్రమాణ స్వీకారానికి హాజరైన మాజీ ఎమ్మెల్యే ధనలక్ష్మి

-నూతన ప్రజాప్రతినిధులకు పూలమాలలు, శాలువాలతో సత్కారం

ప్రజా భూమి ప్రతినిధి-గుర్తేడు

పోలవరం జిల్లా రంపచోడవరం నియోజకవర్గంలోని గుర్తేడు మండల పరిషత్ అధ్యక్షుడిగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ముర్ల చిన్నారావు ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి హాజరయ్యారు.ఈ సందర్భంగా నూతన ఎంపీపీ ముర్ల చిన్నారావు, వైస్ ఎంపీపీ భసవ రెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు రాధమ్మ, జడ్పీటీసీ సభ్యురాలు శిల్పరాణిలను మాజీ ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి పూలమాలలు వేసి, శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ప్రజాప్రతినిధులకు శుభాకాంక్షలు తెలిపారు.



అడ్డతీగల అభివృద్ధే లక్ష్యం.. ప్రజలకు అందుబాటులో ఉంటాం

- **సర్పంచ్ అభ్యర్థి బీర వెంకటలక్ష్మి హామీ**
- **కోతుల సమస్య పరిష్కారానికి రూ.3 లక్షల సహాయం అందిస్తాం: బీర బాలయోగి వెంకటలక్ష్మి**



ప్రజా భూమి ప్రతినిధి-అడ్డతీగల

అడ్డతీగల గ్రామపంచాయతీ సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతామని కూటమి బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి బీర వెంకటలక్ష్మి తరఫున బీర బాలయోగి తెలిపారు. గ్రామ ప్రజల సమస్యలను తెలుసుకుంటూ, వారికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి, గ్రామ అభివృద్ధిలో ప్రతి ఒక్కరినీ భాగస్వాములను చేస్తామని ఆయన భరోసా ఇచ్చారు. సర్పంచ్ గా గెలుపొందిన అనంతరం గ్రామంలో దీర్ఘకాలంగా ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న కోతుల సమస్య పరిష్కారానికి తన వంతు సహాయంగా రూ. 3 లక్షలు అందిస్తానని ప్రకటించారు.అడ్డతీగల గ్రామంలో కోతుల బెడద కారణంగా ప్రజలు, ముఖ్యంగా మహిళలు, వృద్ధులు, చిన్నారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఇళ్లలోకి కోతులు ప్రవేశించడం, ఆహార పదార్థాలను తీసుకెళ్లడం, రోడ్లపై సంచరిస్తూ ప్రజలను భయాందోళనలకు గురిచేయడం వంటి సమస్యలకు పరిష్కారం చూపించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సమస్యను ప్రాధాన్యతగా తీసుకొని సంబంధిత అధికారుల సహకారంతో పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.అదేవిధంగా ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా ఉన్న మదర్ థెరిసా పార్కును అభివృద్ధి చేసి, చిన్నారులు ఆడుకోవడానికి, వృద్ధులు సేదతీరడానికి, కుటుంబాలు ప్రశాంతంగా గడపడానికి అనువైన ఆదర్శవంతమైన పార్కుగా తన సొంత నిధులతో తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు.

యువతకు క్రీడల ద్వారా ప్రోత్సాహం

గిరిజన యువత చెడు వ్యసనాలకు, అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉంటూ క్రీడలు, విద్య, ఉపాధి రంగాల్లో రాణించాలన్నదే తమ ఆకాంక్ష అని బీర బాలయోగి తెలిపారు. ఈ లక్ష్యంతో ప్రతి సంవత్సరం అల్లూరి మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించేందుకు సహకరిస్తామని, టోర్నమెంట్‌లో విజేతలకు రూ. 50 వేల ప్రథమ బహుమతి అందించేందుకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని వెల్లడించారు. క్రీడలు యువతలో క్రమశిక్షణ, ఐక్యత, నాయకత్వ లక్షణాలను పెంపొందించడంతో పాటు చెడు అలవాట్లకు దూరంగా ఉంచుతాయని పేర్కొన్నారు.



గ్రామ అభివృద్ధికి పది ప్రధాన హామీలు

తాగునీటి సౌకర్యం: గ్రామంలోని ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన తాగునీరు అందేలా చర్యలు తీసుకుంటాం.రోడ్లు, డ్రైనేజీ: అన్ని వీధుల్లో మెరుగైన రహదారులు, డ్రైనేజీ వ్యవస్థను అభివృద్ధి చేస్తాం.పారిశుద్ధ్యం, ఆరోగ్యం: గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడంతో పాటు దోమల నివారణకు ప్రత్యేక చర్యలు చేపడతాం. మహిళా సంక్షేమం: మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రోత్సాహం అందిస్తాం.యువతకు ప్రాధాన్యత: క్రీడా మైదానం ఏర్పాటు, యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తాం. విద్యాభివృద్ధి: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కృషి చేస్తూ, గ్రంథాలయం ఏర్పాటుకు చొరవ చూపుతాం.రైతుల సంక్షేమం: రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాం.వృద్ధులు, దివ్యాంగుల సంక్షేమం: అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పింఛన్లు, సంక్షేమ పథకాలు అందేలా సహకరిస్తాం.వీధి దీపాలు, భద్రత: గ్రామంలోని ప్రతి వీధిలో వీధి దీపాలు ఏర్పాటు చేసి రాత్రివేళ ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తాం.పారదర్శక పాలన: గ్రామసభల ద్వారా ప్రజల అభిప్రాయాలు, సూచనలు తీసుకొని వారి భాగస్వామ్యంతో అభివృద్ధి కార్యక్రమాలు చేపడతాం. ప్రజల సహకారంతో ఆదర్శ గ్రామంగా అడ్డతీగలగ్రామ అభివృద్ధి అనేది ఒక్కరి బాధ్యత కాదని, ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్తులు సమష్టిగా పనిచేసినప్పుడే ఆశించిన మార్పు సాధ్యమవుతుందని బీర బాలయోగి పేర్కొన్నారు. గ్రామంలో ఏ కుటుంబానికి ఏ సమస్య వచ్చినా తమ దృష్టికి తీసుకువస్తే స్పందిస్తామని, ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి కష్టసుఖాల్లో భాగస్వాములవుతామని తెలిపారు.కేవలం ఎన్నికల సమయంలోనే ప్రజల వద్దకు వెళ్లడం కాకుండా, పదవిలో ఉన్నా లేకపోయినా గ్రామ ప్రజలతో అనుబంధాన్ని కొనసాగిస్తూ అభివృద్ధికి కృషి చేస్తామని స్పష్టం చేశారు. 'మన గ్రామం – మన బాధ్యత, మన అభివృద్ధి – మన సంకల్పం' అనే నినాదంతో అడ్డతీగల గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడమే తమ ప్రధాన లక్ష్యమని బీర బాలయోగి వెల్లడించారు.

అడ్డతీగల వైస్ ఎంపీపీ ఎన్నికపై రగడ

- **అధిష్ఠానం ప్రతిపాదించిన పేరుపై ఎంపీటీసీ సభ్యురాలి అభ్యంతరం.. ప్రమాణ స్వీకారం చేయకుండానే వెళ్లిపోయిన వీరవరం ఎంపీటీసీ**
- **శుక్రవారం ఉదయం 11 గంటలకు వాయిదా పడిన వైస్ ఎంపీపీ ఎన్నిక**


ప్రజాభూమి ప్రతినిధి-అడ్డతీగల

అడ్డతీగల మండల పరిషత్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన ఎంపీపీ, వైస్ ఎంపీపీ, ఎంపీటీసీ సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఎన్నిక వ్యవహారం గందరగోళానికి దారితీసింది. ఎంపీపీగా జర్తా వెంకటరమణారెడ్డి పేరును పార్టీ అధిష్ఠానం ఖరారు చేయడంతో ఎంపీటీసీ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అయితే వైస్ ఎంపీపీ ఎంపిక విషయంలో మాత్రం భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి.

వైస్ ఎంపీపీ పదవికి ఎడ్ల శ్రీదేవి పేరును పార్టీ అధిష్ఠానం ప్రతిపాదించగా, రిటర్నింగ్ అధికారి కె. రమణ ఎంపీటీసీ సభ్యుల అభిప్రాయాలను కోరారు. అయితే సభ్యుల నుంచి స్పష్టమైన స్పందన రాకపోవడం చర్చనీయాంశంగా మారింది. మొత్తం 11 మంది సభ్యుల్లో వీరవరం ఎంపీటీసీ సింగంశెట్టి ఆదిలక్ష్మి అధిష్ఠానం ప్రతిపాదించిన పేరుపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో ఆమె ప్రమాణ స్వీకారం చేయకుండానే సమావేశం నుంచి వెళ్లిపోయారు.ఆమెను ఒప్పించేందుకు ఎంపీపీతో పాటు టీడీపీ ఎంపీటీసీ సభ్యులు, నాయకులు ప్రయత్నించినప్పటికీ ఆమె తన అభ్యంతరాన్ని వెనక్కి తీసుకోలేదు. వైస్ ఎంపీపీ అభ్యర్థి పేరును అధిష్ఠానం నిర్ణయించడంపై అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిసింది. దీంతో సమావేశంలో కొంతసేపు గందరగోళ పరిస్థితి నెలకొంది.

అధిష్ఠానం నిర్ణయానికి సభ్యుల మద్దతు లభిస్తుందా?

మరోవైపు వైస్ ఎంపీపీగా తన పేరును అధిష్ఠానం ప్రతిపాదించడంపై ఎడ్ల శ్రీదేవి



స్పందించారు. తమ కుటుంబం గత 30 ఏళ్లకు పైగా తెలుగుదేశం పార్టీకి సేవలందిస్తోందని తెలిపారు. తన భర్త ఎడ్ల శ్రీను అడ్డతీగల మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడిగా పనిచేశారని గుర్తుచేశారు. పార్టీ కోసం తమ కుటుంబం చేసిన సేవలను గుర్తించిన అధిష్ఠానం తన పేరును వైస్ ఎంపీపీ పదవికి ప్రతిపాదించిందని పేర్కొన్నారు. అయితే సభ్యుల నుంచి ఆశించిన సహకారం లభించక పోవడంతో ఆమె అసహనం వ్యక్తం చేసినట్లు సమాచారం.

శుక్రవారానికి వాయిదా పడిన సమావేశం

సభ్యుల మధ్య నెలకొన్న భిన్నాభిప్రాయాలు, గందరగోళ పరిస్థితుల నేపథ్యంలో రిటర్నింగ్ అధికారి కె. రమణ ఉన్నతాధికారులతో సంప్రదింపులు జరిపారు. అనంతరం వైస్ ఎంపీపీ ఎన్నిక ప్రక్రియను శుక్రవారం ఉదయం 11 గంటలకు వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. ఎంపీపీ ఎన్నిక ఏకగ్రీవంగా ముగిసినప్పటికీ వైస్ ఎంపీపీ ఎంపిక మాత్రం ఉత్కంఠకు దారితీసింది. పార్టీ అధిష్ఠానం ప్రతిపాదించిన అభ్యర్థికి సభ్యుల మద్దతు లభిస్తుందా? లేక వైస్ ఎంపీపీ ఎంపికలో మరో పరిణామం చోటుచేసుకుంటుందా? అన్నది ఆసక్తికరంగా మారింది.

ఎంపీపీ సీటు కేటాయింపుపై టీడీపీలో అసమ్మతి!

ఎమ్మెల్యే ఇంటి వద్ద కార్యకర్తల ఆందోళన.. అంతర్గత విభేదాలు

ప్రజాభూమి ప్రతినిధి - శింగనమల

ఎంపీపీ పదవి కేటాయింపు వ్యవహారం శింగనమల టీడీపీలో అసమ్మతికి దారితీసింది. ఎంపీపీ సీటు తమ వర్గానికి కేటాయించకుండా మరో వ్యక్తికి కేటాయించడంపై టీడీపీ కార్యకర్తలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ ఇంటి వద్ద ఆందోళనకు దిగారు.ముందుగా తమ వర్గానికి ఎంపీపీ పదవిలో అవకాశం కల్పిస్తామని హామీ ఇచ్చి, చివరి నిమిషంలో మరో



వ్యక్తికి పదవి కేటాయించడంపై కార్యకర్తలు అభ్యంతరం వ్యక్తం చేసినట్లు సమాచారం. తమకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని, ఎంపీపీ సీటు కేటాయింపులో న్యాయం చేయాలని వారు డిమాండ్ చేస్తున్నట్లు తెలిసింది. ఎంపీపీ పదవి విషయంలో మొదలైన అసంతృప్తి ఎమ్మెల్యే ఇంటి వద్ద ఆందోళనకు దారితీయడంతో శింగనమల టీడీపీలో అంతర్గత విభేదాలు మరోసారి వెలుగులోకి వచ్చాయి.

రెండోరోజు కొనసాగిన సర్పంచు, వార్డు మెంబర్లనామినేషన్లు.

ప్రజాభూమి ప్రతినిధి - పుట్టూరు

పుట్టూరు మండల వ్యాప్తంగా గురువారం 55 మంది సర్పంచులకు, 168 మంది వార్డ్ మెంబర్లకు నామినేషన్లు దాఖలు చేయడం జరిగింది. ఎస్ గూడూరుకు సంబంధించి నలుగురు సర్పంచులు 19 మంది వార్డ్ మెంబర్లకు, ఎల్లుట్లకు సంబంధించి 8 మంది సర్పంచులకు, 27 మంది వార్డ్ మెంబర్లకు, కుమ్మనమలకు సంబంధించి 20 మంది సర్పంచులకు, 51 మంది వార్డ్ మెంబర్లకు, పుట్టూరుకు సంబంధించి పదిమంది సర్పంచులకు, 35 మంది వార్డ్ మెంబర్లకు, అరగటి వేములకు సంబంధించి 13 మంది సర్పంచులకు , 36 మంది వార్డులకు నామినేషన్లు వేసినట్లు ఎంపీడీవో అలివేలమ్మ తెలిపారు.

సర్పంచ్ వార్డు సభ్యుల నామినేషన్ల స్వీకరణ..

ప్రజా భూమి ప్రతినిధి-యల్లనూరు

మండల వ్యాప్తంగా 21 గ్రామ పంచాయతీలకు గాను రెండవ రోజు 172 మంది వార్డు సభ్యులుగా నామినేషన్ వేయడంతో పాటు సర్పంచ్ స్థానాలకు 47 మంది నామినేషన్లు వేయడం జరిగిందని ఎంపీడీవో మనోహర్ బాబు తెలియజేశారు.



ఫైలేరియా సర్వే..

ప్రజాభూమి ప్రతినిధి - యల్లనూరు

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని యల్లనూరు లొ వైద్యాధికారి లోకేష్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫైలేరియా రక్త నమోన సేకరణ చేయడం జరిగింది అదేవిధంగా మొత్తం ఐదు టీములుగా విభజించి సెంటినల్ సర్వే రాత్రి సమయంలో చేపట్టినట్లు ఆయన తెలిపారు ఈ కార్యక్రమంలో సిహెచ్ఓ మధు కుమార్ సూపర్వైజర్ హాజీవలి జైనుబి హెల్త్ అసిస్టెంట్ నాగేశ్వర్ రెడ్డి ఏఎన్ఎం ఎమ్మెల్ హెచ్ పి ఎస్ ఆశ వర్కర్లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారని తెలిపారు.

రెండవ రోజు కి 322 నామినేషన్లు దాఖలు.

సర్పంచ్ పదవికి 64, వార్డు మెంబర్లకు 258 నామినేషన్లు.

ప్రజా భూమి ప్రతినిధి-కాజులూరు.

కాజులూరు మండల పరిధిలో గ్రామపంచాయతీ ఎన్నికలకు సంబంధించి రెండవ రోజుకి 322 నామినేషన్లు 5 కేంద్రాల ద్వారా దాఖలు అయ్యాయి. ఇందులో సర్పంచ్ పదవికి 64 ,వార్డు మెంబర్లకు 258 మంది ఆయా చోట్ల నామినేషన్లు దాఖలు చేశారు. సర్పంచి పదవికి గాను అంద్రంగి, ఆర్యావటం, కాజులూరు,మంజేరు,మతుకుమిల్లి ,ఒంటితాడి,దుగ్గుదుర్రు,పెనుమళ్ళ ,తర్లంపూడి,కోలంక,గ్రామాల్లో రెండేసి చొప్పున,బందనపూడి,చేదువాడ,గొల్లపాలెం, టి.మామిడాడ,జగన్నాదగిరి,గ్రామాలనుండి మూడు చోప్పున, తనుకువాడ, శీల, పెదలంక, గ్రామాల నుండి నాలుగేసి చొప్పున , తిప్పరాజుపాలెం శెలపాక, నామవాని పాలెం, గ్రామాలనుండి ఐదేసి చొప్పున, కుయ్యేరు ,ఉప్పు మిల్లి, గ్రామాల నుండి ఒక్కొక్కటి చొప్పున నామినేషన్ దాఖలు అయ్యాయి. ఇదిలా ఉండగా తనుమళ్ళ పెనుమళ్ళ,ఐతపూడి గ్రామాలనుండి రెండవరోజు సైతం సర్పంచ్,వార్డు మెంబర్లకు ఎవ్వరూ నామినేషన్లు దాఖలు చేయలేదు.



ఎంపీపీ ఎంపీటీసీల ప్రమాణ స్వీకారం..





ప్రజాభూమి ప్రతినిధి - యల్లనూరు

మండల వ్యాప్తంగా 10 ఎంపీటీసీ స్థానాలు సంబంధించి ప్రమాణ స్వీకారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు గెలుపొందిన స్థానాలు టిడిపి 8 ఎంపీటీసీ స్థానాలలో గెలుపొందగ వైసిపి 2 సంస్థానాలలో విజయం సాధించిన వారిని ప్రమాణ స్వీకారం ఆర్ వో హర్షద్ వలి ఎంపిడిఓ కరుణ సాగర్ తాసిల్దార్ సింధు ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది వీరిలో టిడిపి వెన్నపూస పల్లి ఎంపీటీసీ అభ్యర్థి ప్రసాద్ రెడ్డి ఎంపీపీ గా వైస్ ఎంపీపీ గా యల్లనూరు 1 ఎంపీటీసీ దొడ్లో లత ఎంపీపీ గా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం వారు మాట్లాడుతూ ఎంతో కష్టపడి మమ్మలను ఈ స్థానాల్లో కూర్చోబెట్టిన ప్రజలకు అందరికీ ధన్యవాదాలు తెలియజేస్తూ ఎల్లవేళలా ప్రజలకు అందు బాటులో ఉంటామని మండల అభివృద్ధికి మా వంతు కృషి చేస్తామని వారు తెలియజేశారు.

ప్రజాభూమి

జనరల్ 14

శుక్రవారం 20 నవంబర్ 2026

ఘనంగా అంతర్జాతీయ పురుషుల దినోత్సవం

ప్రజాభూమి ప్రతినిధి నూజీవీడు



నూజీవీడు మండలము జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల అన్నవరంలో పురుష దినోత్సవము నిర్వహించామని పాఠశాలప్రధానోఫాధ్యాయని విజయకుమారి తెలిపారు. అంతర్జాతీయ పురుషులదినోత్సవము నవంబర్ 19 న జరుపుకుంటారని తెలిపారు. కొడుకుగా, భర్తగా, అన్నగా, నాన్నగా జీవితమంతా తన వాళ్ళ కోసం బతికే మగ మహానుభావులు మీరు అని తెలిపారు. మెరుగైన భవిష్యత్ కోసం స్త్రీ, పురుషుల సమాన భాగస్వాములుగా ముందుకు సాగాలనే సందేశముతో ఈ వేడుక నిర్వహిస్తారు. పురుషుల, శారీరక మానసిక ఆరోగ్యముపై అవగాహనపెంచడం. పని ఒత్తిడి కుటుంబ భాద్యతల భావోద్వేగ సమస్యల పై బహిరంగముగా మాట్లాడేలా ప్రొత్సహించడం. లింగ, సమానత్వం మరియు మెరుగైన సామాజిక సంభంధాలను పెంపొందించడం. ప్రస్తుతం 70 దేశాలు పురుషు దినోత్సవము జరుపుకుంటున్నారని ప్రధానోఫాధ్యాయని తెలిపారు.

పురుషు ఉపాధ్యాయులైన నాగేంద్రరావు, నాగరాజు, దుర్గా మల్లేశ్వరరావు, రాజేంద్ర ప్రసాద్, భోగిప్రసాద్, రవీంద్ర, మరియు ఎలిమెంటరీ స్కూల్ కుక్కల గూడెం ఉపాధ్యాయులు హరిప్రసాద్ లను ప్రధానోపాధ్యాయని విజయ కుమారి మరియు మహిళా ఉపాధ్యాయులు జయకుమారి,శ్రీ మంగలక్ష్మి, వెంకటరమణ, కృష్ణ కుమారి పురుషు ఉపాధ్యాయులను సన్మానించారు. స్టాప్ సెక్రటరీ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ మాకు సన్మానించిన మహిళాఉపాధ్యాయలకు ధన్యవాదములు తెలిపారు.



అండర్-19 రాష్ట్రస్థాయి కబడ్డీ జట్టుకు శ్రీ శారదా కళాశాల విద్యార్థులు ఎంపిక

ప్రజాభూమి ప్రతినిధి నూజీవీడు

నూజీవీడు నూజీవీడులోని శ్రీ శారదా జూనియర్ కళాశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు అండర్-19 రాష్ట్రస్థాయి కబడ్డీ జట్టుకు ఎంపికై నూజీవీడుకు గర్వకారణంగా నిలిచారు. కళాశాలలో జూనియర్ ఎం పి సీ చదువుతున్న చింతా అభిలాష్, మాగులూరి ప్రహర్ష రాష్ట్రస్థాయి కబడ్డీ జట్టుకు ఎంపికయ్యారు. విజయవాడలోని పీబి సిద్ధార్థ కళాశాల ప్రాంగణంలో స్టేట్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఎంపిక పోటీల్లో విద్యార్థులు తమ క్రీడా ప్రతిభను ప్రదర్శించి, మెరిట్ ప్రాతిపదికన రాష్ట్ర జట్టుకు ఎంపిక కావడం విశేషం. ఒకే కళాశాల నుంచి ఇద్దరు విద్యార్థులు రాష్ట్ర జట్టుకు ఎంపిక కావడం శ్రీ శారదా కళాశాలకే కాకుండా నూజీవీడు ప్రాంతానికే గర్వకారణంగా నిలిచింది. విద్యతో పాటు క్రీడలకు కూడా సమాన ప్రాధాన్యతనిస్తూ విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీసేందుకు శ్రీ శారదా విద్యాసంస్థలు అందిస్తున్న ప్రోత్సాహానికి ఈ విజయం నిదర్శనంగా నిలిచింది. విద్యార్థుల కృషి, పట్టుదల, క్రీడా నైపుణ్యానికి లభించిన గుర్తింపుగా కళాశాల యాజమాన్యం ఈ విజయాన్ని అభివర్ణించింది. ఈ సందర్భంగా సంస్థ చైర్మన్ కుప్పాల శంకరరావు కరస్పాండెంట్ శ్రీమతి జి. రాధిక, ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం ఎంపికైన విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. రాష్ట్రస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచి, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత విజయాలు సాధించి నూజీవీడుకు, కళాశాలకు మరింత పేరు ప్రతిష్ఠలు తీసుకురావాలని ఆకాంక్షించారు.ఈ ఇద్దరు విద్యార్థుల ఎంపికతో కళాశాలలోఆనందోత్సాహాలు నెలకొన్నాయి.

పాలకొల్లు ఎంపీపీగా అంగర పదవి బాధ్యతలు స్వీకరణ

ప్రజాభూమి ప్రతినిధి,పాలకొల్లు



పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు మండల పరిషత్ అధ్యక్షునిగా అంగర వీరభద్ర కుమార్(చిన్న) గురువారం పాలకొల్లు మండల పరిషత్ కార్యాలయంలో పదవి బాధ్యతలు చేపట్టారు. అంగర వీరభద్రకుమార్ను మండల పరిషత్ అధ్యక్షునిగా ఎన్నుకునేందుకు చింతపర్రు ఎంపీటీసీ సవరపు వెంకటేశ్వర్లు ప్రతిపాదించుగా శివదేవుని చిక్కాల ఎంపీటీసీ కోటిపల్లి పద్మ మనికంట బలపరిచారు. దీనికి మిగిలిన 12 మంది ఎంపీటీసీలు మద్దతు పలకడంతో ఎంపీపీగా అంగర వీరభద్ర కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి పీ మురళీకృష్ణ ప్రకటించారు. అదేవిధంగా మండలం ప్రజా పరిషత్ ఉపాధ్యక్షుడిగా తిల్ల పూడి జనసేన ఎంపీటీసీ ఏవన్నా సాయి లక్ష్మి ని ఆగర్తి పాలెం ఎంపీటీసీ నున్నబోయిన గాంధీ ప్రతిపాదించగా గవరపేట ఎంపీటీసీ ఎల్లపు దుర్గా కుసుమ బలపరిచారు. ఈ పదవి కి కూడా ఎవరూ పోటీకి రాకపోవడంతో ఎన్నికల అధికారి మురళీకృష్ణ మాట్లాడు తు ఉపాధ్యక్షు రాలుగా సాయి లక్ష్మి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా నూతనంగా ఎంపీపీగా పదవి బాధ్యతలు చేపట్టిన అంగర వీరభద్ర కుమార్(చిన్న) మాట్లాడుతూ మంత్రి నిమ్మల రామానాయుడు, తన తండ్రి మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్ అడుగుజాడల్లో నడుస్తూ మండల అభివృద్ధి కృషి చేస్తానని తెలిపారు. తనను ఎంపీపీగా ఎన్నిక అయ్యేందుకు సహకరించిన ప్రజాప్రతినిధులకు ఎంపిటిసి లకు కృతజ్ఞతలు తెలిపారు. సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్ మాట్లాడుతూ ఎంపీటీసీ లందరూ కలిసిమెలిసి అన్నదమ్ముల మాదిరిగా గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. తాను మటీసీలు కు కూడా నిధులు ఇవ్వాలని సీఎంని కోరుతానని తెలిపారు. ఏఎంసీ చైర్మన్ కోడి విజయ భాస్కర్ రావు మాట్లాడుతూ ప్రమాణస్వీకారం చేసిన ఎంపిటిసి లందరూ గ్రామాల అభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేయాలని కోరారు. ముందుగ అరట్లకట్ట ఎంపీటీసీగా దిగమర్తి రత్నకుమారి, ఆగరు ఎంపీటీసీగా కొయ్య రామారావు, ఆగర్తి పాలెం ఎంపీటీసీగా నున్నబోయిన గాంధీ,కాపవరం ఎంపీటీసీగా ఊ టాల ప్రసన్న, కొత్తపేట ఎంపీటీసీగా కేత దుర్గాభవాని, గవరపెట ఎంపీటీసీగా ఎల్లపు దుర్గ కుసుమ, చింతపర్రు ఎంపీటీసీగా సవరపు వెంకటేశ్వర్లు, తిలపూడి ఎంపిటిసిగా ఏవన్నా సాయి లక్ష్మి, దగ్గులూరు ఎంపీటీసీగా వరద కాంతం, లంకలకోడేరు వన్ ఎంపిటిసిగా సోమ సురేష్ ఆకుల, లంకలకోడేరు టు ఎంపిటిసి గా ఇంజె సువార్త, వెలి వె ల ఎంపీటీసీగా తోకల మంగ వేణి, శివదేవుని చిక్కాల ఎంపీటీసీగా కోటిపల్లి పద్మ మనికంట, సగం చెరువు ఎంపీటీసీగా అంగర వీరభద్ర కుమార్ పదవి ప్రమాణ స్వీకారం చేశారు. ప్రమాణ స్వీకారం కార్యక్రమంలో ఎంపీడీవో ఎన్ ఎన్ ఉమామహేశ్వరరావు, తాసిల్దార్ కిషోర్, ఈఓ పి అర్డ్ మూర్తి బాబు,డిప్యూటీ ఎంపీడీవో డి పద్మాజీ రావు, ఏవో రాందాస్ నాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన ఎంపీపీ అంగర వీరభద్ర కుమార్, ఎంపీటీసీలను పార్టీ నాయకులు కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్య లో వచ్చి పూలమాలతో ఘనంగా సత్కరించారు.

ఆదిత్య కళాశాలలో ఘనంగా స్త్రీ శక్తి దివస్



ప్రజాభూమి ప్రతినిధి పెదపాడు.

ఆదిత్య డిగ్రీ కళాశాల, సత్రంపాడులో అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో వీరనారి ఝాన్సీ లక్ష్మీబాయి జయంతిని పురస్కరించుకొని స్త్రీ శక్తి దివస్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ వంగ వెంకటేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ వంగ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, ఝాన్సీ లక్ష్మీబాయి ధైర్యసాహసాలు, దేశభక్తి, పోరాట పటిమ ప్రతి ఒక్కరికీ ఆదర్శమని అన్నారు. మహిళలు ఆత్మవిశ్వాసంతో అన్ని రంగాల్లో ముందుకు సాగాలని, విద్యతో పాటు నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని సూచించారు. మహిళా సాధికారతతోనే సమాజం మరింత అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు,. విద్యార్థి పరిషత్ జిల్లా కన్వీనర్ జస్వంత్ మాట్లాడుతూ, ఝాన్సీ లక్ష్మీబాయి బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా చూపిన వీరోచిత పోరాటం నేటి యువతకు స్ఫూర్తిదాయకమని తెలిపారు. మహిళల్లో ధైర్యం, ఆత్మస్థైర్యం, దేశభక్తి భావాలను పెంపొందించడమే స్త్రీ శక్తి దివస్ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని అన్నారు. ప్రతి విద్యార్థిని ఝాన్సీ లక్ష్మీబాయిని ఆదర్శంగా తీసుకొని జీవితంలో ఉన్నత లక్ష్యాలను సాధించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శ్రీ ఫణికుమార్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ కె. హరిబాబు, కల్చరల్ కోఆర్డినేటర్ సౌభాగ్యలక్ష్మి, అధ్యాపకులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు. మహిళా శక్తి, ఆత్మగౌరవం, ధైర్యం మరియు దేశభక్తి సందేశంతో ఈ కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.

సమిష్టి కృషితో స్థానిక సంస్థలు ఎన్నికల్లో ఘనవిజయం సాధించాం

ప్రజాభూమి ప్రతినిధి నూజీవీడు





నూజీవీడు మంత్రి క్యాంపు కార్యాలయంలో గురువారం నూజీవీడు రూరల్ మండలం యంపిపి కాపా శ్రీనివాసరావు (టీడీపీ), వైస్ యంపిపి తిరుమారెడ్డి విజయకుమార్ (జనసేన), ఆగిరిపల్లి మండలం యంపిపి నక్కబోయిన వేణు (టీడీపీ), వైస్ యంపిపి బొడ్డు ధనలక్ష్మి (జనసేన), చాట్రాయి మండలం యంపిపి కొల్లి సత్యవతి (టీడీపీ), వైస్ యంపిపి మోదుగమూడి రమేష్ (టీడీపీ), ముసునూరు మండలం యంపిపి అమర్తల ధనలక్ష్మి (టిడిపి) వైస్ యంపిపి తుమంద్రు అశోక్ కుమార్ (టీడీపీ) ఆయా మండల కూటమిపార్టీ ఎంపీటీసీ అభ్యర్థులు ప్రమాణస్వీకారం అనంతరం, రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాలు శాఖ మంత్రి కొలుసు పార్థసారథిని మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కలను అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. వారందరికీ మంత్రి శుభాకాంక్షలు అభినందనలు తెలిపి, అధికార పాలనకు సిద్ధం కావాలని ప్రజలకు మంచి సేవలు అందించాలని మంత్రి కొలుసు పార్థసారథి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ ఈ రోజు చాలా ఆనందంగా ఉందని 2024 ఎలక్షన్లు రెండు నెలలు ముందు ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సీటు కేటాయించారని, నియోజవర్గంలో అందరూ ఆదరించారని అన్నారు. గెలుపొందటమే కాకుండా మంత్రి పదవులు ఇచ్చిన నూజీవీడు నియోజకవర్గం ప్రజలకు, నాయకులకు జీవితాంతం రుణపడి ఉంటానని మంత్రి అన్నారు. ప్రజలు ప్రభుత్వంపై, పాలనపై పెట్టుకున్న నమ్మకాన్ని అది మరోసారి తెలియజేయడమే కాకుండా, మాపై మరింత బాధ్యతలను పెంచిందని అన్నారు. సమిష్టికృషితో స్థానిక సంస్థలు ఎన్నికల్లో ఘనవిజయం సాధించామని అన్నారు. నియోజకవర్గంలో మున్సిపల్ చైర్ పర్సన్, నాలుగు జెడ్పిటిసిలు, నాలుగు యంపీపీలు సాధించుకున్నామని తెలిపారు.ఇదే స్ఫూర్తితో గ్రామపంచాయతీ మరింత మెరుగైన ఫలితాలు సాధించబోతున్నామని, 2029 సాధారణ శాసనసభ ఎన్నికలకు పునాది అన్నారు. 2024 సాధారణ ఎన్నికలు మాదిరే స్థానిక సంస్థలు ఎన్నికల్లోనూ ప్రజలు కూటమిపార్టీ పక్షాన నిలిచారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజలు ఉజ్వల భవిష్యత్తు, యువత ఆకాంక్షలకు అనుగుణంగా కూటమి పార్టీలు ఐక్యంగా పనిచేస్తుందని, అన్ని వర్గాలు ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. ప్రజలు ఆకాంక్షలకు అనుగుణంగా అన్ని రంగాల్లో ముందుకు వెళ్తున్నామని, ప్రజలు కూడా బ్రహ్మరథం పట్టి స్వాగతిస్తున్నారని తెలిపారు. ఇటీవల జరిగిన స్థానిక సంస్థలు, ప్రాదేశిక ఎన్నికలు ఫలితాల్లో ఇది స్పష్టంగా కనిపించిందని, ప్రజాసంక్షేమంతో పాటు గ్రామాల్లో జరిగిన అభివృద్ధిని చూస్తే ప్రజల కూటమి పార్టీలను అత్యధిక మెజారీతో గెలిపించారని అన్నారు. కూటమిపార్టీలు కొనసాగితేనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని ప్రజలు బలంగా నమ్ముతున్నారని, గతంలో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో చేసిన విధ్వంసం, అవినీతి పాలనపై ప్రజలు విసిగిపోయారని తెలిపారు. 2024 ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన మెజారిటీ నేడు స్థానిక సంస్థలు ఎన్నికల్లోనూ కొనసాగడం శుభపరిణామం అని, తర్వలో జరగనున్న గ్రామపంచాయతీలు ఎన్నికల్లో కూడా ప్రజలు ఆశీర్వదించి నూరుశాతం గెలుపు ఇవ్వాలని మంత్రి కోరారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రజలు స్వేచ్ఛగా జీవిస్తున్నారని తెలిపారు. అన్ని వర్గాలకు న్యాయంతో పాటు యువనాయకత్వానికి ప్రాధాన్యత ఇచ్చామని తెలిపారు. కొత్త ఆలోచనలతో వస్తున్న యువతకు సీట్లు ఇచ్చి అవకాశం కల్పించామని, ప్రజలు కూడా యువనాయకత్వానికి మద్దతుగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కూటమిపార్టీ శ్రేణులు, పట్టణప్ర ముఖులు, ఎంపీటీసీలు వారి కుటుంబ సభ్యులు, గ్రామనాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పాల్గొన్నారు.

ఏలూరు పట్టణాభివృద్ధికి కూటమిప్రభుత్వం ప్రత్యేక దృష్టి

- రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి



ప్రజాభూమి ప్రతినిధి నూజీవీడు

విజయవాడ తాడిగడప మంత్రి క్యాంపు కార్యాలయంలో గురువారం ?రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాలు శాఖ మంత్రి కొలుసు పార్థసారథిని, ఏలూరు నగరపాలకసంస్థ మేయర్ అభ్యర్థిగా గెలుపొందిన రెడ్డి అప్పలనాయుడు మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కను, ప్రత్యేక జ్ఞాపికనుఅందజేశారు. ఏలూరు పట్టణ ప్రజలకు మెరుగైన మౌళిక వసతులు కల్పించడంతో పాటు నగరాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దడమే కూటమిప్రభుత్వ లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు.ఈ సందర్భంగా మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ గత ఐదేళ్ల పాలనలో నిర్లక్ష్యానికి గురైన పట్టణ ప్రాంతాలను తిరిగి అభివృద్ధి పథంలోకి తీసుకువచ్చేందుకు కూటమిప్రభుత్వం పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతోందన్నారు. నగరంలో దెబ్బతిన్న రోడ్లపునర్నిర్మాణం, ఆధునిక డ్రైనేజీ వ్యవస్థ, వీధి దీపాలు ఏర్పాటు పనులను వేగవంతం చేయ్యాలనిసూచించారు.నగరవాసులకు స్వచ్ఛమైన తాగునీటిని అందించేందుకు అవసరమైన తాగునీటి పైప్‌లైన్లు, ప్రాజెక్టులు విస్తరణకు ప్రాధాన్యతను ఇవ్వాలని సూచించారు. ప్రజాసంక్షేమం పారదర్శతతో ప్రజాసమస్యలు పరిష్కారంలో ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ఇచ్చిన ప్రతిహామీనినిలబెట్టుకుంటూ,ఏలూరునుఆదర్శవంతమైన నగరంగా తీర్చిదిద్దుటకు సమిష్టిగా కృషిచేద్దామని మంత్రి భరోసానిచ్చారు.?ఈ కార్యక్రమంలో కూటమిపార్టీ శ్రేణులు, పట్టణ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

రక్తదానంతో వ్యక్తి ప్రాణాలను కాపాడిన చాంబర్స్ విద్యార్థి

ప్రజాభూమి ప్రతి నిధి, పాలకొల్లు



ఛాంబర్స్ కళాశాల లో మొదటి సంవత్సరం బిఎస్సి డేటా సైన్స్ చదువుతున్న విద్యార్థి కే. సంతోష్ వర్మ, నరసాపురానికి చెందిన వెంకటలక్ష్మి బ్లడ్ క్యాన్సర్ తో బాధపడుతూ స్థానిక రాజీవ్ ఆసుపత్రిలో చికిత్స పొందుతుంది ఈరోజు చికిత్స నిమిత్తం రక్తం అవసరం కాగా కే. సంతోష్ వర్మ రక్తదానం చేశారు అని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డి.వెంకటేశ్వరావు తెలిపారు.ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ కెవిఆర్ నరసింహారావు మాట్లాడుతూ సంతోష్ వర్మ బ్లడ్ క్యాన్సర్ తో బాధపడుతున్న వ్యక్తికి రక్తదానం చేసి ప్రాణాలను నిలిపారని సంతోష్ వర్మ లాంటి వారిని విద్యార్థులు ఆదర్శంగా తీసుకుని సమాజానికి అవసరాలకు అనుగుణంగా పలు సేవా కార్యక్రమాలు చేయాలని పిలుపునిచ్చారు. సంతోష్ వర్మ సేవను కళాశాల సెక్రటరీ కేవీ సీతారామరాజు , ట్రెజరర్ ఆర్ ప్రవీణ్ భాను , ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్స్ రాధా మాధవి, రాంబాబు, రంజిని, అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది మరియు విద్యార్థిని విద్యార్థులు అభినందించారు.

ఎన్నికల వరకే రాజకీయాలు.. అభివృద్ధి విషయంలో అందరూ సమానమే

- మండల అభివృద్ధికి సమష్టిగా కృషి చేయాలి
- ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు

ప్రజాభూమి ప్రతినిధి, తాళ్లపూడి

ఎన్నికల వరకే రాజకీయాలని, అభివృద్ధి విషయంలో పార్టీలకు, ప్రాంతాలకు అతీతంగా అందరినీ సమాన దృష్టితో చూస్తూ మండల అభివృద్ధికి సమష్టిగా కృషి చేయాలని కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. తాళ్లపూడి మండల పరిషత్ నూతన పాలకవర్గాన్ని అభినందించేందుకు ఆయన గురువారం మండల పరిషత్ కార్యాలయానికి విచ్చేశారు. ఈ సందర్భంగా నూతన ఎంపీపీగా ఎన్నికైన నామా నాగ శంకర రాణి, వైస్ ఎంపీపీగా ఎన్నికైన కల్లూరి సుబ్రహ్మణ్యంలను అభినందించారు. నూతనంగా ఎన్నికైన ఎంపీటీసీ సభ్యులను ఎమ్మెల్యే ఘనంగా సత్కరించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు తాళ్లపూడి మండల పరిషత్ పరిధిలోని 15 మంది ఎంపీటీసీ సభ్యులతో ఎన్నికల రిటర్నింగ్ అధికారి జయరామ లక్ష్మి ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం తాళ్లపూడి ఎంపీటీసీ నామన రవికుమార్‌ను పార్టీ విప్‌గా నియమించారు. తదుపరి ఎంపీపీ, వైస్ ఎంపీపీ ఎన్నిక నిర్వహించగా ఎంపీపీగా నామా నాగ శంకర రాణి, వైస్ ఎంపీపీగా కల్లూరి సుబ్రహ్మణ్యం ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఎంపీడీవో బి. అమ్మిరాజు, డిప్యూటీ ఎంపీడీవో వీరన్న, సూపరింటెండెంట్ నిర్మల, వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది నూతన ఎంపీపీ, వైస్ ఎంపీపీలను అభినందించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు, ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.



ప్రజాభూమి

జనరల్ 15


శుక్రవారం 20 నవంబర్ 2026

రావులపాడు సర్పంచ్ అభ్యర్థిగా బీసీ నేత చిన్నారావు

- జనరల్ స్థానంలో బీసీ నాయకుడికి టీడీపీ అవకాశం

ప్రజాభూమి ప్రతినిధి కొత్తపేట

గ్రామ పంచాయతీ ఎన్నికల వేళ రావులపాడు గ్రామంలో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. రావులపాలెం మండలంలోని రావులపాడు గ్రామ సర్పంచ్ పదవిని ఎన్నికల అధికారులు జనరల్ కేటగిరీకి కేటాయించగా, బీసీ వర్గానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు పెచ్చెట్టి చిన్నారావు సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఆశీస్సులతో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి పార్టీల మద్దతుతో ఆయన ఎన్నికల బరిలో నిలవడం గ్రామంలో రాజకీయ ఆసక్తిని రేకెత్తిస్తోంది. గత 30 ఏళ్లుగా తెలుగుదేశం పార్టీ కార్యకర్తగా పనిచేస్తూ పార్టీ జెండాను మోస్తున్న తనకు ఎమ్మెల్యే బండారు సత్యానందరావు సర్పంచ్‌గా పోటీ చేసే అవకాశం కల్పించడం



ఎంతో సంతోషంగా ఉందని పెచ్చెట్టి చిన్నారావు తెలిపారు. కూటమి ప్రభుత్వ పాలనపై ప్రజలు సంతృప్తిగా ఉన్నారని,



గ్రామంలో ఎన్నో ఏళ్లుగా నెలకొన్న సమస్యల పరిష్కారానికి తాను నిరంతరం కృషి చేస్తూ ప్రజలకు అందుబాటులో ఉంటున్నానని చెప్పారు. గ్రామంలో అధిక శాతం బీసీ, ఎస్సీ సామాజిక వర్గాల ఓటర్లు ఉండటంతో పాటు, అన్ని వర్గాల ప్రజలకు తాను సుపరిచితుడిగా ఉండటం తనకు కలిసొచ్చే అంశాలని చిన్నారావు ధీమా వ్యక్తం చేశారు. పార్టీ కోసం మూడు దశాబ్దాలుగా చేసిన సేవలకు గుర్తింపుగా లభించిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ప్రజల మద్దతుతో విజయం సాధిస్తాననే ఆశాభావం వ్యక్తం చేశారు.

తాళ్లపూడి మండల అభివృద్ధికి సమష్టిగా కృషి చేస్తా

- ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటా.. నూతన ఎంపీపీ నామా నాగ శంకర రాణి

ప్రజాభూమి ప్రతినిధి, తాళ్లపూడి

కొవ్వూరు టీడీపీ ప్రముఖులు పెండ్యాల అచ్చిబాబు ఆశీర్వాదాలతో, కూటమి ప్రభుత్వ తరఫున తాళ్లపూడి మండల పరిషత్ అధ్యక్షురాలిగా ఎన్నికైన తాను మండల అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని నూతన ఎంపీపీ నామా నాగ శంకర రాణి తెలిపారు. తన భర్త నామా కొండబాబు సహకారంతో పాటు కూటమి నాయకులు, అధికారులు, తోటి ఎంపీటీసీ సభ్యుల సమన్వయంతో మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానని ఆమె పేర్కొన్నారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. విద్య, వైద్యం, మౌలిక సదుపాయాలు, ఇతర ప్రజా అవసరాలకు ప్రాధాన్యతనిస్తూ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు కృషి చేస్తానని వెల్లడించారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అందరినీ కలుపుకొని ముందుకు సాగుతానని ఆమె స్పష్టం చేశారు. అనంతరం తాళ్లపూడి మండలానికి చెందిన టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నాయకులు,



ప్రజాప్రతినిధులు నూతన ఎంపీపీ నామా నాగ శంకర రాణి, వైస్ ఎంపీపీ కల్లూరి సుబ్రహ్మణ్యం, ఎంపీటీసీ సభ్యులను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

మహిళల్లో మణిహారం ఝాన్సీ లక్ష్మీబాయి

- పెరవరం: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో మహిళా దినోత్సవం, పాటల పోటీలు

ప్రజాభూమి ప్రతినిధి కొత్తపేట

మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తూ సమాజ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కె.జె.ఎస్.ఎల్. కుమారి అన్నారు. 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా గురువారం పెరవరం శాఖా గ్రంథాలయంలో జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న కుమారి, ఇందిరాగాంధీ, ఝాన్సీ లక్ష్మీబాయి, దుర్గాబాయి దేశ్‌ముఖ్ తదితర ప్రముఖ మహిళల చిత్రపటాలకు



పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వివిధ రంగాల్లో సేవలందిస్తున్న మహిళలను శాలువాలతో సత్కరించారు. విద్యార్థులకు, మహిళలకు పండ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఝాన్సీ లక్ష్మీబాయి వంటి స్వాతంత్ర్య సమరయోధులను నేటి విద్యార్థినులు ఆదర్శంగా తీసుకుని వారి అడుగుజాడల్లో నడవాలని, ధైర్యసాహసాలు, ఆత్మవిశ్వాసంతో జీవితంలో ముందుకు సాగాలని సూచించారు. చిన్ననాటి నుంచే సేవాగుణాన్ని అలవర్చుకుని సమాజానికి ఉపయోగపడేలా ఎదగాలని పిలుపునిచ్చారు. తదుపరి విద్యార్థులకు దేశభక్తి, జానపద సంగీత పాటల పోటీలను నిర్వహించారు. ఈ పోటీలకు లిటిల్ ఫ్లవర్ పాఠశాల ఉపాధ్యాయులు సత్యనారాయణ, జ్యోతి, అఖిల న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. విద్యార్థులు అధిక సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొన్నారు. పెరవరం శాఖా గ్రంథాలయ అధికారిణి శెట్టిపల్లి శ్రీదేవి నిర్మల అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సభ్యులు రామారావు, సూర్యారావు, కృష్ణమూర్తి, సత్యనారాయణ, గ్రంథాలయ సిబ్బంది కృష్ణవేణి, జె. సునీత, శాంతి, వి. సునీత, భవాని, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక పోలీసింగ్‌లో కృష్ణాజిల్లా మరో ముందడుగు!

- ఒకే కేంద్రం నుంచి జిల్లా అంతటా నిఘా
- అత్యాధునిక సమీకృత ఆదేశ, పర్యవేక్షణ కేంద్రాన్ని ప్రారంభించిన రాష్ట్ర డీజీపీ హరీష్ కుమార్ గుప్తా
- కృత్రిమ మేధతో నేరాల గుర్తింపు.. ఒకేసారి 30 డ్రోన్ల ప్రత్యక్ష చిత్రాల పరిశీలన

మచిలీపట్నం, ప్రజాభూమి ప్రతినిధి

నేర నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజలకు వేగవంతమైన పోలీసు సేవలు అందించడమే లక్ష్యంగా కృష్ణాజిల్లా పోలీసు శాఖ అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో సమీకృత ఆదేశ, పర్యవేక్షణ కేంద్రాన్ని (ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్) ఏర్పాటు చేసింది. జిల్లా నలుమూలల్లోని నిఘా కెమెరాలను ఒకే వేదికపైకి తీసుకువచ్చి, సంఘటనలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించేలా రూపొందించిన ఈ కేంద్రాన్ని రాష్ట్ర పోలీసు డైరెక్టర్ జనరల్ (డీజీపీ) హరీష్ కుమార్ గుప్తా, ఐపీఎస్ గురువారం ఘనంగా ప్రారంభించారు. రాష్ట్ర డీజీపీ మార్గదర్శకత్వంలో కృష్ణాజిల్లా ఎస్పీ వి. విద్యాసాగర్ నాయుడు, ఐపీఎస్ ఆధ్వర్యంలో ఈ కేంద్రం రూపుదిద్దుకుంది. జిల్లాలో నేరాల దర్యాప్తును వేగవంతం చేయడంతోపాటు, అత్యవసర పరిస్థితుల్లో పోలీసు యంత్రాంగం తక్షణమే స్పందించేందుకు ఈ వ్యవస్థ దోహదపడనుంది.

ప్రారంభోత్సవానికి విచ్చేసిన డీజీపీకి వేదపండితులు మంత్రోచ్ఛారణల నడుమ ఆశీర్వచనాలు అందించి స్వాగతం పలికారు. ఏలూరు రేంజ్ ఐజీ జి.వి.జి. అశోక్ కుమార్, జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు పుష్పగుచ్ఛాలు అందజేసి గౌరవించారు. అనంతరం డీజీపీ శిలాఫలకాన్ని ఆవిష్కరించి, రిబ్బన్ కత్తిరించి కేంద్రాన్ని ప్రారంభించారు. కేంద్రంలోని వివిధ విభాగాలు, ఆధునిక పరికరాలు, పర్యవేక్షణ తెరలను పరిశీలించిన ఆయన, వాటి పనితీరు, సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, జిల్లా వ్యాప్తంగా సమాచార సేకరణ విధానం గురించి ఎస్పీని అడిగి తెలుసుకున్నారు. సందర్శకుల పుస్తకంలో తన అభిప్రాయాలను నమోదు చేసి, కేంద్రం ఏర్పాటుపై పోలీసు అధికారులను అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, ఏలూరు జిల్లా ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్, జాయింట్ కలెక్టర్ ఎం. నవీన్, శిక్షణలో ఉన్న ఐఏఎస్ అధికారి నమ్రత అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం అతిథులను శాలువాలతో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఏర్పాటు చేసిన ఈ కేంద్రం కృష్ణాజిల్లా పోలీసులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని డీజీపీ హరీష్ కుమార్ గుప్తా పేర్కొన్నారు. నేరాల ఛేదనను వేగవంతం చేయడంతోపాటు, పోలీసు సిబ్బంది పనితీరును మెరుగుపరచడానికి ఈ వ్యవస్థ దోహదపడుతుందని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన నిఘా కెమెరాల చిత్రాలను పరిశీలించడంతోపాటు,





ఒకేసారి 30 డ్రోన్ల ప్రత్యక్ష చిత్రాలను వీక్షించే సదుపాయం ఉండటం విశేషమన్నారు. సంఘటనలు జరిగినప్పుడు సంబంధిత సిబ్బందికి కేంద్రం నుంచే తగిన సూచనలు అందించడం ద్వారా సత్వర చర్యలు చేపట్టవచ్చని వివరించారు. ప్రజల నుంచి అందే ఫిర్యాదుల పరిష్కార స్థితిని తెలుసుకునేందుకు ప్రత్యేక స్పందన వ్యవస్థను ఏర్పాటు చేయడం పారదర్శకతకు నిదర్శనమని డీజీపీ ప్రశంసించారు. ఈ విధానాన్ని ఇతర జిల్లాల్లోనూ విస్తరించే అవకాశాలను పరిశీలిస్తామని తెలిపారు. ఈ కేంద్రం ఏర్పాటులో కృషి చేసిన జిల్లా ఎస్పీతోపాటు పోలీసు అధికారులు, సిబ్బందికి అభినందనలు తెలియజేశారు. ఈ కేంద్రం ద్వారా జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ నిఘా కెమెరాలతోపాటు, అనుసంధానించిన ఇతర అంతర్రాజ్ల ఆధారిత కెమెరాల చిత్రాలను ఒకే చోట నుంచి పరిశీలించవచ్చు. ఒకేసారి 30 డ్రోన్ల ప్రత్యక్ష చిత్రాలను వీక్షించే సాంకేతిక సామర్థ్యం ఉండటంతో పెద్ద సభలు, ఉత్సవాలు, ఎన్నికలు, భారీ బందోబస్తు సందర్భాల్లో పరిస్థితులను సమగ్రంగా పర్యవేక్షించేందుకు వీలవుతుంది. ఎక్కడైనా అవాంఛనీయ సంఘటన జరిగినప్పుడు అందుబాటులో ఉన్న చిత్రాల ఆధారంగా పరిస్థితిని వేగంగా అంచనా వేసి, సంబంధిత పోలీసు అధికారులను అప్రమత్తం చేయవచ్చు. తద్వారా క్షేత్రస్థాయిలో సిబ్బంది కదలికలను సమన్వయం చేయడంతోపాటు, శాంతిభద్రతల పరిరక్షణకు అవసరమైన చర్యలు చేపట్టేందుకు అవకాశం ఉంటుంది.

కృత్రిమ మేధ (ఏఐ), ముఖ గుర్తింపు సాంకేతికత, సీసీటీవీ 360 వంటి వ్యవస్థల అనుసంధానంతో నేరాలకు పాల్పడిన అనుమానితులను గుర్తించడం, తప్పిపోయిన వ్యక్తుల ఆచూకీ కనుగొనడం, దొంగతనానికి గురైన లేదా పోయిన వాహనాలను గుర్తించడం మరింత సులభతరం కానుంది.

గతంలో వివిధ ప్రాంతాల్లోని నిఘా కెమెరాల చిత్రాలను సేకరించేందుకు సంబంధిత ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితులు ఉండేవి. ప్రస్తుతం అందుబాటులో ఉన్న కెమెరాల చిత్రాలను ఒకే కేంద్రంలో పరిశీలించే అవకాశం ఉండటంతో దర్యాప్తు ప్రక్రియకు సమయం ఆదా కానుంది. వాహనాల రాకపోకలు, ప్రమాదాలకు సంబంధించిన దృశ్యాలను పరిశీలించేందుకు కూడా ఈ సాంకేతిక వ్యవస్థ ఉపయోగపడనుంది. అత్యవసర పరిస్థితుల్లో ప్రజల నుంచి అందే సమాచారంపై వేగంగా స్పందించేందుకు ఈ కేంద్రాన్ని డయల్ 112 వ్యవస్థతో అనుసంధానించారు. ఫిర్యాదు లేదా అత్యవసర సమాచారం అందిన వెంటనే సంబంధిత ప్రాంతంలోని పోలీసు సిబ్బందిని అప్రమత్తం చేసి, అవసరమైన చర్యలు చేపట్టేందుకు ఈ వ్యవస్థ తోడ్పడుతుంది. పోలీసుల స్పందనను పర్యవేక్షించేందుకు కూడా అవకాశం కలుగుతుంది. ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్--మీకోసం) ద్వారా అందే ఫిర్యాదుల పరిష్కారంలో పారదర్శకత, జవాబుదారీతనాన్ని పెంచేందుకు జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు ప్రత్యేక స్పందన వ్యవస్థను ఏర్పాటు చేశారు. అందిన ఫిర్యాదులతోపాటు పరిష్కరించిన ఫిర్యాదులపై కూడా అభిప్రాయాలను సేకరించి, వాటిని నేరుగా జిల్లా ఎస్పీకి చేరేలా ఏర్పాట్లు చేశారు. దీంతో ఫిర్యాదుల పరిష్కారంలో లోపాలు ఉన్నాయా, సంబంధిత అధికారులు సమర్థవంతంగా స్పందిస్తున్నారా అనే అంశాలను ఉన్నతాధికారులు పరిశీలించవచ్చు. అవసరమైన సందర్భాల్లో సంబంధిత అధికారులకు సూచనలు అందించి, ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు వీలవుతుంది. ఈ విధానం రాష్ట్రంలోనే తొలిసారిగా జిల్లా స్థాయిలో ఏర్పాటు చేసినట్లు పోలీసు శాఖ వెల్లడించింది. ఇళ్లకు తాళాలు వేసి ఊళ్లకు వెళ్లే వారి గృహాల్లో చోరీలను అరికట్టేందుకు లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్ (ఎల్హెచ్ఎంఎస్)ను కూడా ఈ కేంద్రానికి అనుసంధానించారు. అనుమానాస్పద కదలికలను గుర్తించి, అవసరమైనప్పుడు పోలీసులను అప్రమత్తం చేసేందుకు ఈ వ్యవస్థ ఉపయోగపడనుంది. త్రినేత్ర ప్రత్యక్ష పర్యవేక్షణ అనువర్తనంతో అనుసంధానం చేయడం ద్వారా నేరాల నివారణకు సాంకేతిక సహకారం మరింత పెరగనుంది. గతంలో జిల్లా పరిధిలోని కొన్ని నిఘా, పర్యవేక్షణ అవసరాల కోసం విజయవాడలోని నియంత్రణ కేంద్రంపై ఆధారపడాల్సి వచ్చేదని, దీనివల్ల కొన్ని సందర్భాల్లో సమాచార సమన్వయం, దర్యాప్తులో జాప్యం జరిగే అవకాశం ఉండేదని పోలీసు శాఖ తెలిపింది. ప్రస్తుతం ప్రత్యేక కేంద్రం అందుబాటులోకి రావడంతో జిల్లా పరిధిలోని సంఘటనలపై స్థానికంగానే పర్యవేక్షణ చేపట్టవచ్చు. అత్యాధునిక కంప్యూటర్లు, పెద్ద తెరలు, సమగ్ర సమాచార వ్యవస్థలతో రూపుదిద్దుకున్న ఈ కేంద్రాన్ని జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు స్వయంగా రూపకల్పన చేసినట్లు పోలీసు శాఖ వెల్లడించింది. కేంద్రం ఏర్పాటుకు రాష్ట్ర డీజీపీ అందించిన మార్గదర్శకత్వం, నిధుల సహకారంతోపాటు వివిధ పరిశ్రమలు, దాతలు వస్తు రూపంలో అందించిన తోడ్పాటుకు ఎస్పీ కృతజ్ఞతలు తెలిపారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థంగా వినియోగించుకుంటూ నేర నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణ, అత్యవసర సేవలు, ప్రజా ఫిర్యాదుల పరిష్కారాన్ని ఒకే వేదికపైకి తీసుకువచ్చిన ఈ సమీకృత కేంద్రం కృష్ణాజిల్లా పోలీసు వ్యవస్థలో కీలక ముందడుగుగా నిలవనుంది.



20వ వార్డులో స్వతంత్ర అభ్యర్థిగా కోటా రమణి దుర్గ నామినేషన్

ప్రజాభూమి ప్రతినిధి కొత్తపేట

రావులపాలెం స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో రావులపాలెంలో ఎన్నికల సందడి నెలకొంది. ఈ క్రమంలో రావులపాలెం గ్రామ పంచాయతీ 20వ వార్డు నుంచి స్వతంత్ర అభ్యర్థిగా కోటా రమణి దుర్గ బరిలో నిలిచారు. గురువారం ఆమె సంబంధిత ఎన్నికల అధికారులకు నామినేషన్ పత్రాలను సమర్పించారు. స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసేందుకు అవసరమైన పత్రాలను దాఖలు చేయడంతో 20వ వార్డు ఎన్నికల్లో ఆమె అభ్యర్థిత్వం ఆసక్తికరంగా మారింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 20వ వార్డులో ఉన్న సమస్యలు పరిష్కరించి, ప్రజల అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

జీలుగుమిల్లి మండలంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకత్వానికి అభినందనలు

- మాజీ శాసనసభ్యులు బాలరాజు



ప్రజాభూమి ప్రతినిధి,జీలుగుమిల్లి

ప్రతిపక్షంలో ఉన్నప్పటికీ ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటూ, మండల నాయకులు, గ్రామ నాయకులు, పార్టీ కార్యకర్తలు అందరూ ఐకమత్యంతో, సమష్టి కృషితో టీమ్ వర్క్ చేస్తూ సాధించిన విజయం ఇది అని పోలవరం మాజీ శాసనసభ్యులు బాలరాజు అన్నారు. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నాయకత్వంలో, ఆయన ఆశయ సాధన కోసం నిరంతరం పనిచేస్తూ, పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి ముందుకు సాగుతాము అన్నారు.ప్రతిపక్షంలో ఉన్నప్పటికీ పార్టీ కోసం అండగా నిలిచిన ప్రతి నాయకుడికి, కార్యకర్తకు ఈ విజయం అంకితం అన్నారు.
ఈ రోజు రాష్ట్రం లోని జగన్మోహన్ రెడ్డి ఇంతటి విజయం సాధించిన జీలుగుమిల్లి మండల నాయకత్వాశి వైపు చూసి ప్రత్యేకంగా గుర్తు చేస్తుందని ఆయన అన్నారు. అనంతరం మండలం నాయకత్వం సారధ్యంలో ఏర్పాటు చేసిన నూతనంగా విజయం సాధించిన జడ్పిటిసికి ఏడు పంచాయతీల ఎంపీటీసీలకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బాలరాజు, మండల ప్రెసిడెంట్ సందా ప్రసాద్, జిల్లా సీనియర్ నాయకులు కొల్లూరి రాంబాబు, జిల్లా నాయకులు బోధ శ్రీనివాస్ రెడ్డి , టౌన్ ప్రెసిడెంట్ చిట్టి బొమ్మ శ్రీను, జిల్లా నాయకులు ఘంటసాల గాంధీ , మాజీ వైస్ ఎంపీపీ సోమగాని శ్రీను , మొహమాట మంగరాజు, కుమ్మరి టోనీ, కొప్పుల బాలు, నాగేశ్వరరావు , మరి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

మండల పరిషత్ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం



ప్రజా భూమి ప్రతినిధి,జీలుగుమిల్లి

జీలుగుమిల్లి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారం చేశారు. ముగిసిన మండల ఎంపిపి ,వైస్ ఎంపిపి,ఎంపిటిసి ల ప్రమాణ స్వీకార కార్యక్రమం ఎంపిపిగా సున్నం ఉషారాణి,వైస్ ఎంపిపి గా వీరంకి. నాగలక్ష్మి లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కోలాహలంగా ఎన్నికైన ఎంపీటీసీలు హాజరయ్యారు. నేటి నుండి వీరి పదవి కాలం ఐదు సంవత్సరాలు కొనసాగుతుంది.

విద్యార్థి దశ నుంచి చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

- న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి యన్, శ్రీలక్ష్మి

ప్రజాభూమి బ్యూరో ఏలూరు జిల్లా



రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి వారి ఆదేశాలు ప్రకారం ఉమ్మడిపశ్చిమగోదావరి జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి యన్.శ్రీలక్ష్మి , గురువారం హనుమాన్ నగరులోని జిల్లా పరిషత్తు పాఠశాల నందు ఫోక్స్, బాలలు హక్కులు చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమ్మడిజిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, యన్.శ్రీలక్ష్మి మాట్లాడుతూ లైంగిక దాడులు నుండి బాలలను రక్షించడానికి ఈ చట్టాన్ని రూపొందించడం జరిగిందని తెలిపారు. ఈ చట్ట ప్రకారం నేరానికి పాల్పడిన వారికి కఠినమైన శిక్షలు అమలు పరచడం జరుగుతుందని, ఈ నేరాలు తరచుగా సన్నిహితులు పాల్పడటం చాలా బాధాకరమైన విషయం అని అన్నారు. బాలలు తగు జాగ్రత్తగా ఉండాలని, సమస్యలు ఎదుర్కునే కంటే, నివారణ మార్గాలను పాటించాలని తెలిపారు. చరవాణిలను అవసరాలకు మాత్రం ఉపయోగించాలని, సైబరు నేరాలు పట్ల అప్రమత్తంగా ఉండాలని ఏదైనా సమస్య ఏదైనా తల్లిదండ్రులు లేదా ఉపాధ్యాయులు లేదా 15100 ద్వారా న్యాయ సేవాధికార సంస్థలను సంప్రదించవచ్చని సూచించారు. బాధితులకు పరిహారం పొందే అవకాశం ఉందని, విద్యార్థులు మారుతున్న చట్టాలపై ఎప్పటికప్పుడు అవగాహన కలిగి ఉండటం ముఖ్యమని సూచించారు.